# Chatussutri (Brahmasutra) by SrimanRamacharyulu, New Delhi

"**అమ్మా**! ఆకలిగా ఉంది ఏదయినా తినడని పెట్టు" ఒక రోజు సాయంత్రం college నుండి వస్తూ ఏదో పుస్తకం చదువుతున్న మా అమ్మ తో అన్నాను. " అయినాకానీ ఎప్పుడూ అదో అలా భగవంతుడి పుస్తకాలు చదువుతూ కూర్చుంటే ఏమొస్తుంది నీకు" అని అడిగాను మా అమ్మను.

**అమ్మ**: ఏం పెట్టమన్నావు, ప్రొద్దున్నది చక్కెర పొంగలి ఉంది తింటావా.

**నేను**: మళ్ళీ చక్కెర పొంగలేనా, విసుగు వేస్తోందమ్మా చక్కెర పొంగలి అంటే, మరేదైనా పెట్టు

**అమ్మ**: నీకు చక్కెర పొంగలి అంటే ఇష్టం కదురా, వద్దంటావేం?

**నేను**: అయినా అదే మళ్ళీ మళ్ళీ ఏం తినగలం?

**అమ్మ**: అంటే నీకొక విషయం తెలిసి ఉండాలి. ఏ లౌకిక కర్మలైనా, విషయమైనా ఎప్పుడూ ఆనందము ఇవ్వలేదు. అందుకే ఇలా భగవంతుని గురించిన విషయాలు తెలుసుకోవాలి. అవయితే అలాకాదు.

**నేను**: లౌకిక కర్మలు, విషయాలంటున్నావు, యజ్ఞ, యాగాదులు చేసి పొందే స్వర్గ ఫలాలో.

**అమ్మ**: అవీ అంతే కదా, ఆ ఫలితం పూర్తయిన తరువాత మళ్ళీ ఇక్కడ ఏదో జన్మ పొంది జీవితము గడప వలసినదే కదా, అలా కాకుండా భగవంతుని తెలుసుకొని భక్తితో ధ్యానాదులు చేస్తే ఆయన కరుణిస్తే అపరిమితమైనది, కాల పరిచ్ఛేదము లేనిది అయిన ఆనందం పొందవచ్చు.

**నేను**: భగవంతుడిని నమ్ముకొని పని మానేసి కూర్చోవచ్చా?

**అమ్మ**: అలా అని ఎవరన్నారు. మనకు విహితమైన కర్మలు జీవితాంతం చేయాల్సిందే. భగవంతుడిని పట్టుకొని నేను మీకు వంటా, వార్పూ మానీలేదుకదా!

**నేను**: అమ్మా! క్రియాన్వితం కాని పదాలనుండి జ్ఞానము కలుగదు, లాభము ఉండదు. ఒక పని జరిగితే దాని వలన ఫలితం ఉంటుంది. ఆ భగవంతుడు గొప్పవాడు అని  నాకు తెలిస్తే ఫలితం ఎలా వస్తుంది? అలాంటప్పుడు ఈ పుస్తకాలు పట్టుకొని భగవంతుడి గురించి ఆరాటం ఎందుకు?

**అమ్మ**: అలాకాదురా, క్రియ లేని వాక్యాలు కూడా ప్రయోజనాన్ని ఇస్తాయి. మీ నాన్నగారిని చూపించి ఆయన మీ నాన్నగారు అంటే అక్కడ క్రియ లేకపోయినా ప్రయోజనం కలుగుతోంది కదా. అసలు భగవంతుడి గురించి తెలుసుకోవడంలో క్రియాకారిత్వం లేదని నువ్వు ఎందుకనుకుంటున్నావు. భగవంతుడు మనలను, ఈ జగత్తులను సృష్టిస్తున్నాడు, రక్షిస్తున్నాడు, మోక్షమిచ్చి మనకు అపరిమిత ఆనంద పదమైన మోక్షమిస్తున్నాడు అంటూ ఉంటే క్రియ లేదంటావేమిటి? ఆయనకు మనకు సంబంధము తెలుస్తూందికదా, అంటే ప్రయోజనం కలుగుతోంది. అందుచేత మనం భగవంతుడి గురించి తెలుసుకోవడం అవసరమే!

**నేను**: అయితే ఈ లౌకిక జగత్తంతా అంతా తాత్కాలికమే కనుక హుళక్కేనా! అలాగయితే అదేదో స్వామీజీ అన్నట్లు ఆ భగవంతుడొక్కడే నిజము. మిగిలినదంతా అబద్ధము, అనిత్యమేనా? నేను కూర్చున్న కుర్చీ విరిగిపోతే కర్ర ముక్కలైపోతుంది. దానిని కాల్చేస్తే బూడిద అయిపోతుంది. ఆబూడిదతో ఇటుక చేస్తే ఇటుక అయిపోతుంది. ఇలా నిడివి, నిలకడ లేనిది కదా ఈ జగత్తు కాని ఈ శరీరముకాని, అంటే తాడుని చూసి పాము అనుకుంటున్న వాడు ఇది పాముకాదు తాడు అని తెలుసుకున్నట్లు ఈ జగత్తు అనిత్యము, అసత్యము అని తెలుసుకోవడమేనా, భగవంతుడిని తెలుసుకోవడం అంటే

**అమ్మ**: ఈ కనపడే జగత్తు మారుతోండవచ్చు, అంటే ప్రవాహతో నిత్యమనుకోవచ్చు. కాని అసత్యమని ఎలా చెప్తావు ప్రత్యక్షంగా కనపడుతున్నదాన్ని పట్టుకొని.

**నేను**: అజ్ఞానం వల్ల, అవిద్య వల్ల, నీరు లేని చోట ఎండమావి వలన నీరు కనపడడం లేదూ, fan తిరుగుతున్నప్పుడు ఆ రెక్కలు కనపడక ఒక చక్రం లా కనపడడంలేదూ, అలాగే

**అమ్మ**: ఈ అవిద్య ఎక్కడిది, ఎక్కడుంటుంది.

**నేను**: ఈ అవిద్య మనలను కప్పేసి మనమూ, ఈ జగత్తు ఇదంతా ఉన్నట్లనిపింపచేస్తుంది. ఇదంతా మాయ అని తెలిస్తే ఇదేమీ లేదనీ ఉన్నది ఒక్క పరమాత్మేనని తెలుస్తుంది. అదే మోక్షం అన్నారు స్వామీజీ.

**అమ్మ**: ఈ అవిద్య అనేది నువ్వు చెప్పినట్లు ఉండడానికి అవకాశములేదు అని అనేక రకాలుగా నిరూపించ వచ్చు. ఉదాహరణకు ఎక్కడుందని చెప్తావు. జీవుడిని ఆశ్రయించిందని చెప్పడానికి అవిద్య ఆశ్రయించిన తరువాతనే కదా జీవుడు జగత్తూ అంటే మనము ఈ ప్రపంచమూ వచ్చినది, అలాకాదు, పరమాత్మని ఆశ్రయించినదంటే వెలుగు చీకటి ఒక చోట ఉండనట్లు స్వయంప్రకాశకమూ, జ్ఞానస్వరూపమూ అయిన పరమాత్మని చేరి అవిద్య ఎలాగుంటుంది. పోనీ అవిద్యా, పరమాత్మ ఒక్కటే అంటే వెలుగు చీకటి ఒక్కటి

ఎలాగవుతాయి. అసలు మనమందరము నాశనమయి పోవడము మోక్షమని అంటే అలాంటి మోక్షము ఎవడికి కావాలి. ఎండమావిలో నీరు కన్పించడానికి, తిరుగుతున్న పంకా లో రెక్కలుకాక, చక్రముల కనపడడానికి నిజమైన కారణాలున్నాయి కాని అసత్యమవడంవల్ల కాదు. అయినా తాడు పాములా కనపడి ఎవరైనా నిజం చెప్పినప్పుడు అది తాడు అయి పోయినట్లుగా అంటున్నావు, అది పాములా చూసి నప్పుడు నీకు చెమటలు పోసింది నిజమేకదా, అంటే ఆ సమయంలో అది సత్యమే, అయినా అసలు పరమాత్మ అయిన మనము మనుష్యులుగా చూచుకోవడం అంటే ఎలాంటిదంటే తాడు తనను పాముగా చూచుకోవడం , ఇదెలా సంభవం. అసలు మాయ అంటే ఊహించరాని విచిత్ర శక్తి కార్యమని కాని, అసలు లేనిది అని కాదు. అందుచేత ఈ అవిద్య, జీవ బ్రహ్మైకవాదము అంతా కట్టుకథే

**నేను**: పెద్ద ఉపన్యాసమే ఇచ్చావు, సరే కర్మలు అస్థిర ఫలాన్ని ఇస్తాయికనుక అనంత ఫలప్రదమైన పరమాత్మ గురించి తెలుసుకోవలసినదేనని ఒప్పుకుంటాను, ఇంతకీ ఈ పరమాత్మ ఎవడు?

**అమ్మ**: ఏం అలా అడుగుతున్నావు.

**నేను**: ఆ స్వామీజీ పరమాత్మ నిర్విశేష చిన్మాత్రం అని అన్నారు. అంటే ఏ విశేషాలు, లక్షణాలు, గుణాలు లేని చైతన్యమన్న మాట. నువ్వేమో విగ్రహాలూ అవీ పెట్టి పూజా అదీ చేస్తూంటావు.

**అమ్మ**: ఆయననే అడక్క పోయినావా?

**నేను**: నేను అడగలేదులే, కాని మరెవరో అడిగేరు. మనమందరం స్తోత్రాలూ అవీ చదువుతూ విగ్రహాలకు పూజలూ అవీ చేస్తూంటాం కదా, అదంతా శాస్త్ర విరుద్ధమా? అని. అంటే స్వామీజీ "వేదాలలో ముందు సగుణ శ్రుతులు ఉన్నాయి. తరువాత నిర్గుణ శ్రుతులు ఉన్నాయి. అదేదో న్యాయం ప్రకారం అపచ్ఛేద న్యాయం అనుకుంటాను, ఒక శాస్త్రంలో ముందు చెప్పబడినవి తరువాత చెప్పబడిన వాటిచేత supersede అయిపోతాయి. అందుచేత కొంచెం తక్కువ స్థాయి వాళ్ళు సగుణమైన పరబ్రహ్మను ఆరాధించినా, ఆఖరికి తెలుసుకోన వలసినది తాను నిర్విశేష చిన్మాత్రమనే "  అన్నారు.

**అమ్మ**: నిర్విశేషము అంటే ఏమిట్రా?

**నేను**: చెప్పేనుగా ఏ విశేషాలు లేనిది

**అమ్మ**: అంటే ఒక ఉదాహరణ చెప్పగలవా

**నేను**: ఈ కనబడుతున్నదంతా భ్రమ అని కదమ్మా తెలుసుకోవలసింది. ఈ కుర్చీ ఉన్నది, ఈ పుస్తకం ఉన్నది అంటున్నప్పుడు ఈ విశేషణాలు అన్నీ ఈ కుర్చీకో పుస్తకానికో. ఇవన్నీ తాత్కాలికమయినవి. అంటే నాశనమై పోయేవి. ఇలా నాశనం కాకుండా ఎప్పుడూ ఉండేదే పరబ్రహ్మము. అంటే ఈ కుర్చీ ఉన్నది, ఈ పుస్తకం ఉన్నది అంటున్నప్పుడు ఈ కుర్చీ, పుస్తకం నాశనం అయిపోయినా ఈ "ఉన్నది" అంటున్నామే సత్ అదే నన్నమాట నిర్విశేష చిన్మాత్రం.

**అమ్మ**: అసలు నువ్వు శ్రుతులలో కొంతభాగం పరిగణించి కొంతభాగం వదిలేయాలన్నావే అదేతప్పు. దీని సంగతికి తరువాత వద్దాం. ఇంతకుముందు కూడా కర్మలను వదిలేసి అంటే వేదాలలో కర్మవిభాగాన్ని వదిలేసి, పరమాత్మను గురించి తెలిపే జ్ఞాన విభాగాన్ని మాత్రము పరిగణనలో తీసుకుంటే చాలేమో అన్నావు. అదెలాకుదురుతుంది చెప్పు.

**నేను**: వీటిలో విషయం వేరు, వాటిలో విషయం వేరు, కర్మ కాండ ప్రయోజనాలు వేరు అవి తాత్కాలిక సుఖాలు, జ్ఞానకాండ ప్రయోజనం శాశ్వత బ్రహ్మానందము, కర్మ కాండ తెలుసు కొనేవాళ్ళు తాత్కాలిక సుఖాలు కోరుకొనే వాళ్ళు, జ్ఞానకాండ తెలుసుకొనేవాళ్ళు శాశ్వత ఆనందం కావలసిన వాళ్ళు, ఉదాహరణకు మీమాంసా శాస్త్రంలో  జైమిని ధర్మ సూత్రాలు వ్రాస్తే బాదరాయణుడు బ్రహ్మ సూత్రాలు వ్రాసేడు. అంటే ఇవి రెండూ వేర్వేరనీ ఇది కావాలంటే ఇది, అది కావాలంటే అది మనము తెలుసుకోవాలని నా అభిప్రాయము.

**అమ్మ**: అదెలాగురా, వేదంలో మొదటిభాగంలో భగవదారాధనారూపమైన కర్మలు వివరింపబడగా, ఉత్తర భాగంలో తదారాధ్యుడైన పరమాత్మ నిరూపింప బడ్డాడు. ఒకదానికొకటి సంపూరకం కాదా. వాటి ప్రయోజనం వేరు అన్నావు, కర్మలు చేయడం వలన చిత్త శుద్ధి కలిగి మోక్షం సాధితమవుతుంది కదా. నువ్వు చెప్పేది చేతులు కడుగు కొని భోజనం చేయరా అంటే చేతులు కడుగుకోవడం వేరు, భోజనం చేయడం వేరు కనుక నాకు భోజనం చేయాలని అనిపించినప్పుడు చేతులెందుకు కడుగు కోవడం అన్నట్లుంది. కవి త్రయం ముగ్గురు వ్రాసేరు ఒకే భారతాన్ని, బాణభట్టుడు, ఆయన కుమారుడు వ్రాసేరు కాదంబరిని. అలాగని ఆ గ్రంథాలు వేర్వేరని ఎలాగంటావు. అందుచేత వేదంలో కర్మ కాండ, జ్ఞాన కాండ రెండూ పరిగణనలోకి తీసుకోవలసినవే.

**నేను**: అలాగే సగుణ శ్రుతులు, నిర్గుణ శ్రుతులూ అని అంటావా? అదెలా కుదురుతుంది. ఒక చోట నిర్గుణం, నిష్క్రియం, అని సత్యమ్, జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ అని...

**అమ్మ**: ఆగాగు సత్యమ్, జ్ఞానమ్, అనంతమ్ బ్రహ్మ అన్నదానికి నిర్గుణం అని ఎలా చెబుతావు

**నేను**: ఏముంది, అసత్యము కానిది, అజ్ఞానము కానిది .... అని ఇలా అర్థము చెప్పుకుంటే సరి, పుస్తకమున్న కుర్చీ అంటే పుస్తకం కుర్చీకి విశేషణమవుతుంది కాని అపుస్తకమైన కుర్చీ అంటే అపుస్తకత్వము కుర్చీకి విశేషణంగా తీసుకోం కదా, అయినా ఈ సత్యం, జ్ఞానమ్, అనంతమ్ బ్రహ్మ లో అవన్నీ బ్రహ్మ కు విశేషణాలయితే సత్యమైన బ్రహ్మ, జ్ఞానము కల బ్రహ్మ....ఇలా అనేకులైన బ్రహ్మలు వచ్చి కూర్చోరూ. అందుచేత....

**అమ్మ**: నీ ముక్కు పట్టు కోమంటే తల చుట్టూ తిప్పి పట్టుకున్నట్టు తిన్నగా అర్థం సత్యం, జ్ఞానం... అంటే సత్యమైనది, జ్ఞానము కలది అని తెలుస్తూంటే అలా పెడర్థాలు పరబ్రహ్మని నిర్విశేషమని చెప్పడానికి చెప్పడంతప్పు. పరస్పరం వ్యతిరేకంకాని అంటే నల్లని, బలిష్ఠుడైన దేవదత్తుడు అంటే దేవదత్తులు ఇద్దరుండక్కరలేదు. అలాగే పరస్పర విరుద్ధం కాని సత్యం జ్ఞానం అనంతం అనే విశేషణాలు ఒకే పరబ్రహ్మనికి వర్తిస్తాయి. అయినా నిర్గుణ శ్రుతులు ఏం చెబుతాయి, పరమాత్మ హేయగుణ ప్రత్యనీకుడనీ, ప్రాకృతికగుణాలు లేవని చెబుతాయి తప్ప అసలు గుణాలే లేవని కాదు. నిర్విశేషమయిన పదార్థము చూడక పోవడమే కాదు, తెలుసుకోలేవు, ఊహించనూ కూడా లేవు. ఏ ప్రమాణంచేతా నిరూపించలేవు. వివరించడం అసలు కుదరదు. అయినా పరమాత్మ జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్యాది గుణసంపన్నుడని శ్రుతులు ఘోషిస్తూంటే ఈ నిర్విశేషము ఎలా అంటగడతావు పరబ్రహ్మనికి.

**నేను**: సరేనమ్మా పరబ్రహ్మ నిర్విశేషము కాదని కల్యాణ గుణపూర్ణుడనీ ఒప్పుకుంటాను. అయినా పరమాత్మ అంటే ఏమిటి అని నిర్వచించమంటే మళ్ళీ ఉపన్యాసం మొదలు పెట్టేమేమిటి. ఒక్క ముక్కలో చెప్పు, పరమాత్మ అంటే ఏమిటో?

**అమ్మ**: అదేదో ఒక్క ముక్కలో నువ్వే చెప్పు

**నేను**: "తత్త్వమసి" అంటే "త్వమ్" అంటే నేనే అనే ఈ జీవుడే "తత్ " అంటే ఆ పరబ్రహ్మము "అసి" అంటే అయి ఉన్నాను" అంటే ఈ జీవుడే అవిద్య తొలగి పోతే పరబ్రహ్మమన్నమాట.

**అమ్మ**: ఊ, నీకీ వాదము బాగా ఒంటబట్టినట్లుంది. సరే ఈ వాక్యము ఏ సందర్భం లోదో చెబుతావా.

**నేను**: ఇది ఛాందోగ్యోపనిషత్ లోది, నేను ఎక్కడి నుండో కల్పించినది కాదు. దానిలో ఉద్దాలకుడు అనే ముని తన కొడుకైన శ్వేతకేతుని చదువుకి పంపిస్తాడు. అతను 12 సంవత్సరాల తరువాత గురువుగారి దగ్గర

చదువుకొని తిరిగి వస్తాడు. తన కుమారునకు చదువుకున్న తరువాత కొంచెం గర్వం వచ్చిందని గ్రహించిన తండ్రి కొడుకును " దేని గురించి తెలుసు కుంటే సర్వం తెలుస్తుందో అది నేర్చుకున్నావా" అని అడుగుతాడు. కొడుకు ఆప్రశ్నకు ఒక విషయం తెలిస్తే అంతా ఎలా తెలుస్తుందో (నిప్పు తెలిస్తే నీరు తెలియదుకదా)తెలియక తెల్ల పోగా అతనిని తీసికొని తండ్రి ఒక కుమ్మరి దగ్గరకు తీసుకొని పోయి అక్కడ మన్ను చూపించి, అలాగే ఒక బంగారపు పనివాడి దగ్గరకు తీసుకొనిపోయి వాడి దగ్గర బంగారము, కమ్మరి వాడి వద్దకు తీసుకొని వెళ్ళి ఇనుపముద్దను చూపించి తరువాత వాటినుండి తయారయిన మట్టి కుండలు, ప్రమిదలూ, అలాగే బంగారపు ఆభరణాలు, అలాగే ఇనుప సామానులు ఇలాంటి వాటిని చూపించి "చూసేవా మన్ను గురించి తెలిస్తే దాని వలన తయారయే వస్తువులన్నిటి గురించి తెలుస్తుంది, అంటూ "ఏకేన మృత్పిండేన సర్వమ్ మృణ్మయమ్ యథా విజ్ఞాతమ్ స్యాత్" అంటే "ఒకే మట్టి ముద్ద చేత మట్టి తో చేయ బడ్డ పదార్థాలన్నీ ఎలా తెలుస్తాయో " అని "వాచారంభణమ్ వికారో నామధేయమ్ మృత్తికా ఇతి ఏవ సత్యమ్ " అంటే పేరుకి వచ్చిన వికారంతోటే ఇది కుండ ఇది పాలిక అంటున్నాం తప్ప ఇదంతా మన్నే అంటే మన్ను మాత్రమే సత్యమైనది, అలాగే "సత్ ఏవ సోమ్య ఇదమగ్ర ఆసీత్, ఏకమ్ ఏవ అద్వితీయమ్" అని అంటే సత్ ఒక్కటే దీనికి(అంటే ఈ కనపడే దానికంతటికీ) ముందు ఉన్నది, అది ఒక్కటే ఉన్నది, వేరొకటి లేదు అని తాత్త్విక బోధ చేసేడు. అంటే ఆ సత్ లాంటివి కాని, సత్ కు వేరయినవి కాని సత్ లోనే వేరే వేరే ఏమయినా గాని లేక సత్ ఒక్కటే ఉన్నదన్న మాట. ఇవన్నీ అంటే ఈ జగత్తు, జీవుళ్ళు ఏమీ లేవన్నమాట, ఈ విషయం నిర్ధారిస్తూ "తత్ త్వమ్ అసి" అని అంటే నువ్వు అంటూ వేఱుగా లేవు నాయనా నువ్వంటే ఆ పరబ్రహ్మమే అని తేటతెల్లము చేసేడన్నమాట మహర్షి ఉద్దాలకుడు.

**అమ్మ**: బాగానే ఉంది కాని మన్ను మాత్రం సత్యం అని చెప్పడానికి మృత్తికా ఏవ సత్యమ్ అనాలి కాని మృత్తికా ఇతి ఏవ సత్యమ్ అని ఎందుకన్నారంటావు

**నేను**: ౘెండూ ఒకటే కదమ్మా

**అమ్మ**: కాదు, దానికర్థం ఈ కుండలూ అవీ ఆ మట్టి కంటే వేఱు కావు అని మాత్రమే. అసలు మన్ను మాత్రమే సత్యం అని చెప్పాలంటే మూడు ఉదాహరణలు చూపించనక్కరలేదు. ఒక్కటి చూపిస్తే సరిపోయేది. మూడు ఉదాహరణలు చూపడానికి కారణం దాని నుండి ఇవి వచ్చేయి. అంటే మన్ను కారణంగా ఈ కుండలూ అవీ వచ్చేయి అని అర్థం. అలాగే ఆ పరబ్రహ్మ కారణంగా ఈ జగత్తు, జీవుళ్ళు వచ్చేరన్న మాట

**నేను**: మఱి సత్ ఏవ, ఏకమ్ ఏవ, అద్వితీయమ్ అని ఎందుకన్నారు. దానికర్థం సత్ తప్ప మరేమీ లేదనే కదా!

**అమ్మ**: కాదు. ఒక కుండ తయారవడానికి మన్ను ఉండాలి కద, దానిని ఉపాదానము అంటారు.  అలాగే కుమ్మరి కావాలి కద, దానిని నిమిత్తకారణమంటారు. చక్రము, కర్ర లాంటివి సహకారి కారణాలు. పరబ్రహ్మ విషయంలో ఇలా మూడు కారణాలూ ఆయనే, ఆయన తప్ప వేఱుగా మఱొక కారణంలేదు అని చెప్పడానికి సత్ ఏవ, ఏకమ్ ఏవ, అద్వితీయమ్ అని మూడు సార్లు వాడేరు. అయినా ఈ రాజు అద్వితీయుడు అంటే అలాంటి రాజు మఱొకడు లేడని కాని, ఈ రాజు ప్రజా, పరివారమూ లేని ఒంటరి వాడనా? అలాగే పరబ్రహ్మ అద్వితీయుడు అంటే ఆయన వంటిది కాని, ఆయన కంటె గొప్పదైనది కాని వేఱొకటి లేదు అని. అందుకే ఆయనను తెలుసుకొని పూజించాలి, ధ్యానించాలి. ధ్యానము అంటే తెలుసు కదా ఆయన గురించి నూనె ధారలా విచ్ఛిన్నము లేని స్మృతి.

**నేను**: మఱి "తత్త్వమసి" అనే వాక్యానికేం చెబతావు. దానికి అర్థము క్లియర్ గానే ఉందికదా! స్వామీజీ వాళ్ళూ వాళ్ళ సిద్ధాంతంలో నాలుగు మహా వాక్యాలలో ఇది చాలా గొప్పదనీ, ఈ వాక్యార్థ జ్ఞానము వలననే అంటే ఈ వాక్యము అర్థము తెలుసుకొని చింతన చేయడంవలననే మోక్షము వచ్చేస్తుందనీ అన్నారు.

**అమ్మ**: ఆ వాక్యానికి అర్థము నువ్వు చెప్పింది కాదు

**నేను**: మఱేమిటట దానికి అర్థం
అది సరే: ఆ వాక్యంలో తత్ త్వమ్ అంటే అర్థం ఏమిటన్నావు

**నేను**: చెప్పేనుగా, త్వమ్ అంటే అవిద్య ఆవరించడం చేత నేను వేరు అనుకుంటున్న నువ్వు తత్ అంటే ఏ అవిద్యా, అజ్ఞానమూ లేని ఆ నిర్విశేష చిన్మాత్రానివే, పరబ్రహ్మనివే అని

**అమ్మ**: అంటే ఆ తత్, త్వమ్ నుండి మనం మఱియొక అంతరార్థాన్ని  తీసుకోవాలి అన్నమాట. అంటే తత్, త్వమ్ కూడా సర్వనామాలూ, లాక్షణిక పదాలూ  అన్నమాట

**నేను**: లాక్షణిక పదాలంటే?

**అమ్మ**: పుస్తకం, కుర్చీ ఇలాంటివి direct గా అర్థం ఇస్తాయి. అలాకాక మీ పిల్లడు సింహంరా, మా పిల్లడు పిల్లి కాని అన్నాను అనుకో అక్కడ సింహం, పిల్లి అనే పదాలు లక్షణావృత్తి పదాలు. అంటే ఆ పదాల నుండి

implied అంటే indirect అర్థం తీసుకోవాలి తప్ప మీకు సింహం పుట్టింది, నాకు పిల్లి పిల్ల పుట్టింది అని తీసుకోకూడదు.

**నేను**: తెలిసింది. అక్కడ సింహం అన్న లక్షణావృత్తి పదం మీ కుర్రాడు అనే పదాన్ని వివరిస్తోంది.

**అమ్మ**: కదా! అలాకాకుండా ఒక లక్షణావృత్తి పదం మఱియొక లక్షణావృత్తి పదాన్ని వివరించ గలదా?

**నేను**: కుదరదు, ఏదో ఒకటైనా direct అర్థం ఇచ్చే పదం ఉండాలి.

**అమ్మ**: అలాగయితే నువ్వు చెబుతున్న దానిలో ఱెండూ లాక్షణికాలే ఎందు కంటే ఱెండింటి నుండి మనం మరొక అర్థం తీసుకోవాలి.అంటే తత్, త్వమ్ కి  అది కుదరదన్న మాట. అదలా ఉంచు, తత్ అన్నది సర్వ నామము అంటున్నావు కదా, సర్వనామము దేనికి ఉంటుంది

**నేను**: ఏమిటమ్మా మరీను, నామవాచకాలకుంటుంది.

**అమ్మ**: నామ వాచకం అంటే నామం, రూపం ఉన్నదే కదా

**నేను**: అవును

**అమ్మ**: మఱి నువ్వు పరబ్రహ్మకు రూపము, విశేషణం లేవంటున్నావు, ఎలా కుదురుతుంది. ఇంక, నువ్వు అవిద్య లేని పరబ్రహ్మ, అవిద్యతో ఉన్న నువ్వు అంటే జీవుడు ఒక్కటే అంటున్నావు. అంటే విరుద్ధమైన లక్షణాలున్న ఱెండూ ఒక్కటే అంటున్నావు. ఇదెలా కుదురుతుంది

**నేను**: ఎందుకు కుదరదు. మామయ్య అంతకు ముందు విశాఖ పట్టణం లోఉండి తరువాత హైదరాబాదు వెళితే విశాఖ పట్టణం మామయ్య, హైదరాబాదు మామయ్య ఒక్కరే అంటున్నాను కదా! అక్కడ కూడా లక్షణాలు అంటే విశేషణాలు వేరయినా మామయ్య ఒక్కరే కదా!

**అమ్మ**: అలా అనవచ్చు ఒకే కాలం కాదు కనుక. ఇక్కడ అలా కాదు కదా, సరే, నువ్విందాకా అవిద్య ఆవరించడం అన్నావు, అవిద్య దేనిని ఆవరిస్తుంది

**నేను**: బ్రహ్మనే. బ్రహ్మనే అవిద్య ఆవరించడం చేత అది జీవుడినని భ్రమిస్తుంది. "తత్త్వమసి" అనే జ్ఞానము వలన ఆ భ్రమ, ఆ అవిద్య నివర్తకమయిపోతుంది.

**అమ్మ**: బ్రహ్మాని ఆవరించడం, అదే కప్పడం అంటే కప్పబడే base అదే ధర్మాలున్న ఒక పదార్థము ఉండాలి కదా! మఱి నువ్వు పరబ్రహ్మ కు ధర్మాలేమీ లేవంటున్నావు. ఆ అవిద్య ధర్మాలేమీ లేని పదార్థాన్ని అసలు base లేనిదాన్ని ఎలా కప్పుతుంది

**నేను**: పోనీ ఆశ్రయించిందంటే

**అమ్మ**: అదీ అంతే. ఇంతకు ముందే అనుకున్నాము. అదీ కుదరదు

**నేను**: నువ్వు చెప్పినదేమిటో మఱి కొంచెం వివరంగా చెప్పు.

**అమ్మ**: భ్రమ పోతుంది అంటున్నావు కదా, అంటే ముందు భ్రమ ఎలా కలుగుతుంది. నేనూ పెద్ద దానినే, అడ్డకచ్చ చీర కట్టుకున్న దానినే, మామ్మా పెద్దవారే, అడ్డ కచ్చ చీర కట్టు కున్నారు. ఆవిడని చూసి నువ్వు నేననుకొని భ్రమ పడ్డావు. తరువాత దగ్గరా చూస్తే ఆవిడ, బొట్టు, తలకట్టు అవీ చూసి మామ్మ అని తెలిసింది. అంటే ముందు కొన్ని ధర్మాల వలన భ్రమ కలగాలి, తరువాత మరి కొన్ని ధర్మాల వలన ఆ భ్రమ పోవాలి. సన్నగా, పొడుగ్గా ఉన్న తాడుని పాము అని అనుకున్నప్పుడు తరువాత అది కరవదు, కదలదు అని తెలిసిన తరువాత ఆ భ్రమ పోతుంది. కాని నువ్వు ధర్మమే లేదంటున్నావు, మరెలా ఆ భ్రమ పోతుంది. అసలు నువ్విందాకా కథ చెబుతున్నప్పుడు మధ్యలో కొంత వదిలి వేసేవు. "తదైక్షత బహుస్యామ్ ప్రజాయేయ" అంటే "తత్ అంటే ఆ పరబ్రహ్మ సంకల్పించెను అనేకముగా అగుదును గాక " అని. అంటే పరబ్రహ్మ కు సర్వజ్ఞత్వం, సత్య సంకల్పత్వం ఉన్నాయన్నమాటే! లేక పోతే సృష్టి ఎలా జరగుతుంది. అదుగో అలాంటి పరబ్రహ్మాత్మకుడవు నువ్వు అని చెప్పడానికి "తత్ త్వమ్ అసి" అని వాడేరు. అంటే ఆ పరబ్రహ్మమే నీకు అంతర్యామిగా ఉన్నది అని చెబుతున్నారు ఇక్కడ.

**నేను**: త్వమ్ అంటే నువ్వు అని clear గా ఆత్మ అని చెబుతూంటే అది ఆత్మ కు ఆ నువ్వు అనే పదము అంతర్యామి ని ఎలా address చేస్తుంది.

**అమ్మ**: నేను మనష్యుడను అంటే ఎవరు మనుష్యుడు

**నేను**: ఆత్మ, ఆ sorry, మనుష్యత్వము శరీరానికే, ఆత్మకు కాదు. కాని శరీరమూ ఆత్మ కలసి ఉండడం వలన అలా పరిగణిస్తాం.I mean వాడుతాం

**అమ్మ**: పరమాత్మ, ఆత్మ ఎప్పుడూ కలసి ఉంటారు కదా, అందుచేత మనము శరీరానికి చెప్పినది ఆత్మకు పర్యవసించినట్లు ఆత్మకు చెప్పింది పరమాత్మ దాకా పర్యవసిస్తుందన్నమాట. రామాయణం చదువుతూంటావుకదా, దానిలో రావణ సంహారము అయిన తరువాత బ్రహ్మాదులు వచ్చి రాముడిని కీర్తించినప్పుడు "జగత్సర్వమ్ శరీరమ్ తే" అంటాడు బ్రహ్మ రాముడిని. అంటే ఈ జగజ్జీవాలన్నీ ఆయన శరీరమన్నమాట. అసలు శరీరమంటే ఏమిటి. 1. తదేక ఆశ్రయత్వము అంటే ఆత్మనే ఆశ్రయించి ఆత్మ లేకపోతే పడిపోయేది 2. తదేక ప్రయోజనత్వము అంటే ఆత్మ ప్రయోజనమునకు మాత్రమే ఉన్నది 3. నియత విశేషణత్వము అంటే శరీర వాచక విశేషణాలు ఆత్మకూ చెందుతాయి. ఇలాగయితే శరీరమంటారు.

**నేను**: అలాగయితే నరకాది లోకాలలో శరీరం బాధలు పడడం ఆత్మకోసమేనా

**అమ్మ**: అవును, పాప కర్మ క్షయము కూడా ఆత్మ ప్రయోజనమే కదా

**నేను**: ఒక సేవకుని శరీరం అతని స్వామికే ఎప్పుడూ సేవ చేస్తోందనుకో తనకోసం కాకుండా, అప్పుడో ?

**అమ్మ**: అప్పుడూ అంతే ఆ సేవకుని శరీరం స్వామికి సేవచేయడానికి కారణం చివరకు ఏదో జీతానికో, అవసరాలకో కదా, అంటే అక్కడా శరీరము ఆత్మ ప్రయోజనం కోసమే. ఇలాంటి శరీరాత్మ భావాన్ని అంటే వేరు వేరుగా ఉండక ఎప్పుడూ పైన చెప్పిన లక్షణాలతో కలసి ఉండే తత్త్వమే ఆత్మ పరమాత్మలది అని మనము అర్థము చేసుకోవాలి.
నేను: ఇదేదో కొత్త concept యుక్తితో కిట్టించి నట్టుగా ఉంది. ఇది ఎక్కడ నుండి చెబుతున్నావమ్మా, ఇలా ఎక్కడుంది?

**అమ్మ**: అయితే విను, "అంతః ప్రవిష్టః శాస్తా జనానామ్" అంటే పరమాత్మ జనుల లోపల ప్రవేశించి జనములను నియమిస్తున్నాడు, "యః పృథివ్యామ్ తిష్ఠన్, పృథివ్యా అంతరః, యమ్ పృథ్వీ నవేద, యస్య పృథ్వీ శరీరమ్, యః పృథ్వీమ్ అంతరః యమయతి సత ఆత్మా అంతర్యామ్యమృతః" అంటే ఎవరు పృథివి యందుండి పృథివి చేత తెలుసుకొన బడక పృథివిని శరీరముగా కలవాడో, వాడు ఈ ఆత్మ అంతర్యామియు మరియు జనన మరణములు లేని వాడు
"య ఆత్మని తిష్ఠన్ ఆత్మనో అంతరో యమాత్మా నవేద....." అంటే ఎవడు ఆత్మచే తెలిసికొన బడక ఆత్మను లోపలి నుండి నియమించు చున్నాడో
"యః పృథివీమ్ అంతరే సంచరన్ .....అపహత పాప్మా దివ్యో దేవ ఏకః నారాయణః" అని ఆయనే ప్రకృతి సంబంధము లేని వాడు, ఒక్కడు నారాయణుడు.

"తత్ సృష్ట్వా, తదేవ అనుప్రావిశత్, తదను ప్రవిశ్య సత్ చ త్యత్ చ అభవత్" దానిని సృజించి దానియందు ప్రవేశించి చేతనము, అచేతనము ఆయెను.
"అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" అనగా జీవునితోబాటు చేతనాచేతనములయందు తానుగూడ అనుప్రవేశము చేసి వాటికి నామరూపములు కల్పించి వ్యవహార యోగ్యములుగా చేసి ఈ జగజ్జీవాలకు ఆత్మగా అయినాడు.
ఇలా ఎన్నో శ్రుతులు పరమాత్మ చేతనాచేతనాలకు అంతర్యామి యై ఉన్నాడని తెలుపుతున్నాయి. అందుచేత ఆత్మకు పరమాత్మకు విడివడని సంబంధము ఉంటుంది.

**నేను**: ఒక ద్రవ్యము మీద జాతి, గుణము, రుచి, క్రియ ఆధార పడి ఆ ద్రవ్యము address అయినప్పుడు వాటికి కూడా అది apply అవుతుందనుకోవచ్చు. పండు చెప్పి నప్పుడు దాని రంగు, రుచీ అవీ దానితో పాటే address అయినట్లు అంటే స్ఫురించి నట్లు. కాని నువ్వు రెండు ద్రవ్యాలు అంటే ఆత్మ, పరమాత్మ విషయంలో  ఆత్మను సంబోధిస్తే ఆ అంతర్యామి కి కూడా apply అవుతుంది అంటున్నావు, ఇదెలాగ

**అమ్మ**: ఎందుకు కాదు, దండి, కుండలి అన్నప్పుడు కూడా రెండు ద్రవ్యాలు కలిసి అంటే దండము, అది కలవాడు అలాగే కుండలములు, అది కలవాడు ఇలా కలసి ఉండవచ్చును. ఎటొచ్చీ ఆ దండము కలవాడు దండము లేకుండా వేఱుగా  కూడా ఉండగల స్థితి వీలవుతుంది.
కాని శరీరాత్మల విషయంలో, లేదా ఆత్మ, పరమాత్మల విషయంలో ఆ ద్రవ్యాలు వేఱుగా ఉండక ఇంతకు ముందు చెప్పినట్లు కలసి ఉంటాయి. మనుష్యుడు దేవుడైనాడు అంటే మనుష్యశరీరం దేవ శరీరం అయినా ఆ సంబోధన ఆత్మ దాకా పర్యవసిస్తుంది.

**నేను**: ఒక పండు, దాని రంగు చెప్పినప్పుడు రంగు పండుకి విశేషమై దానిని వర్ణిస్తోంది. అలాగే దండి అన్నప్పుడు దండము అది కలవాడికి విశేషణమవుతుంది, కనపడుతుంది. కనపడక, వర్ణించకుండా ఉంటే ఆత్మ అంటే పరమాత్మ పర్యంతమూ ఎలా వర్తిస్తుంది.

**అమ్మ**: అలా అనుకోకూడదు. మన్ను కన పడుతుంది, దాని వాసన కనపడదు, అలాగని మన్ను అన్నప్పుడు అది దాని వాసనకు వర్తించదు అనగలమా, ఆత్మ కంటికి కనపడకపోయినా అంతరింద్రియమైన మనస్సుకి తెలుస్తుంది కదా! అక్కడ ఇంతకు ముందు చెప్పినట్లు శరీర, ఆత్మ సంబంధమే ముఖ్యము.

**నేను**: ఇలా కాక,  జీవ పరబ్రహ్మలు కుండలో ఆకాశం, మహాకాశం లాగా ఉండి కుండ పగిలి పోయినప్పుడు అంటే ఈ శరీరం పోయినప్పుడు జీవ బ్రహ్మలు కలిసి పోతారు అప్పుడు జీవబ్రహ్మలు ఒక్కటైపోతారు అంటే

**అమ్మ**: అదీ కుదరదు. పరబ్రహ్మకు ఉపాధి వలన వచ్చేయి అంటూ దోషాలెలా అంటగడతాము

**నేను**: పోనీ, సముద్రము నుండి కెరటము వచ్చి మళ్ళీ సముద్రములో కలసి పోయినట్లు  పరబ్రహ్మ నుండి జీవుడు పరణామం చెంది మళ్ళీ కలిసి పోయాడంటేనో.

**అమ్మ**: అదీ కుదరదు. అప్పుడూ పరమాత్మ జీవుడవడాని ఆయనలో దోషాలు ప్రవేశించడం, మళ్ళీ ఆయన పరమాత్మగా మారినపుడు మాయమవడం ఇదంతా అసలు కుదరదు.

**నేను**: అయితే పరమాత్మ, జీవుడు పూర్తిగా వేరే అంటే

**అమ్మ**: అప్పుడు నువ్వు ప్రారంభంచిన "తత్త్వమసి" లాంటి జీవుడు, పరబ్రహ్మ ఒకటే అనిపించే శ్రుతి వాక్యాలకు ఎలా అర్థం చెబుతావు. అంతేకాదు, "వేదాహమేతమ్ పురుషమ్ మహాన్తమ్" అంటే ఆ గొప్ప పురుషుడిని నేను ఉపాసిస్తున్నాను, అంటే నేను అనే జీవుడు వేరు, ఆ పురుషుడనే పరమాత్మ వేరు అని చెప్పేశ్రుతులు( భేద శ్రుతులు), నువ్వు చెప్పిన జీవుడు, పరమాత్మల ఐక్యత చెప్పే శ్రుతులు(అభేద శ్రుతులు), ఇంతకుముందు నేను ఉదాహరించిన ఘటక శ్రుతులు ఇవన్నీ సమన్వయ పరిచేది ఈ ఆత్మ, పరమాత్మల శరీర, శరీరి సంబంధము. నువ్వు చెప్పిన వాక్యము "తత్త్వమసి" ఈ విషయమే చెబుతోంది, అంటే "సర్వజ్ఞుడు, సత్య సంకల్పుడు, దోషములు లేని వాడు అయిన పరమాత్మే నీలో ఉన్నాడు" అనే అర్థం చెప్పుకోవాలి.

**నేను**: ఈ శరీరి, శరీర సంబంధం ఏదో తెలిసీ తెలియనట్లుగా ఉన్నది. శరీరమంటే చేష్టలు చేయడానికి కావలిసినది, ఇంద్రియాలున్నది, అనుభవించడానికి పనికి వచ్చేది, చేతులు, కాళ్ళూ ఇలాంటివి ఉన్నది అని నేను అనుకుంటున్నాను ఇంతవరకూ

**అమ్మ**: చేష్టలు చేయడానికి అంటే పనులు చేయడానికి పనికి వచ్చేది అంటే మన వంటపాత్రలు, పనిముట్లు అవన్నీ శరీరాలే అవుతాయి. ఇంక ఇంద్రియాలున్నది అంటే ఇంద్రియాలంటే ఏమిటో తెలియాలి ముందు. ఇంద్రియమంటే ఉదాహరణకు మనకు పైన కనపడే గుడ్డు, ఱెప్ప లతో ఉన్న కనిపించేది ఇంద్రియం కాదు. అది కేవలం అవయవం మాత్రమే. లోపల కనపడకుండా ఉండి మనకు ఈ దృష్టి జ్ఞానం కలిగించేది ఇంద్రియము. అది ఉండడానికి సహకరించేది, మనకు కనపడుతున్న కన్ను అవయవం. అందువలన ఇంద్రియాలున్నది అంటే ఆయా అవయవాలన్నీ శరీరాలయిపోతాయి. అలా కాదు కదా.

అలాకాక మనం అనుభవించడానికి పనికి వచ్చేది అంటే మన ఇళ్ళు, బంగారాలు ఇంతకుముందు అనుకున్న కుండలాలు ఇలాంటివన్నీ భోగానికి పనికివచ్చేవే, కాని ఇవి కూడా శరీరాలు కావు. చేతులూ, కాళ్ళూ ఇలాంటివి ఉన్నది అంటే చెల్లి ఆడుకొనే బొమ్మను కూడా శరీరమనాలి. అందుచేత శరీరమంటే వేఱుగా ఉండకుండా ఎప్పుడూ కూడి ఉండి  నియమింపబడి, ఎల్లప్పుడూ ఆశ్రయించి ఉండి, ఎవరితో ఉన్నదో వారు అలా ఉన్నంతకాలమూ వారి కొఱకు మాత్రమే ప్రవర్తిస్తే దానిని శరీరమనవచ్చును.

**నేను**: మఱి చని పోయినప్పుడు శరీరం పోతుంది కదా!

**అమ్మ:** అవును. అందుకే "ఎవరితో ఉన్నదో వారు అలా ఉన్నంతకాలమూ" అని అన్నాను. పోయిన తరువాత సూక్ష్మ శరీరము వస్తుందనుకో, అది వేఱే విషయము.

**నేను**: అలా అంటే గుర్తుకు వచ్చింది, పోయిన తరువాత కూడా ఆత్మలో పరమాత్మ ఉంటాడా, అలాగే పరమ పదము లోకి వెళ్ళిన తరువాత కూడా.

**అమ్మ**: మన సిద్ధాంతములో ఆత్మ మారదు. అందుచేత ఆత్మతో బాటు అంతర్యామి గా పరమాత్మ ఇక్కడైనా, స్వర్గ, నరకాలలోనైనా, పరమపదములోనైనా ఆత్మతోటే ఉంటాడు.

**నేను**: అలాగయితే ఈ సుఖ దుఃఖానుభూతి పరమాత్మకు కూడానా.ఇందాకా ఘటకశ్రుతులు అన్నావు. అవేమిటో మరొకసారి చెప్పు

**అమ్మ**: అంటే పరమాత్మ ఆత్మ కలిసి ఉంటాయని చెప్పే శ్రుతివాక్యాలు. ఇంతకుముందు అనుకున్నామే, అంతః ప్రవిష్టః శాస్తా జనానామ్ మొదలైన శ్రుతి వాక్యాలు.  అలాగే ద్వా సుపర్ణా సయుజా.......అనే ముండకోపనిషత్తు లోని వాక్యం సమానమైన గుణములున్న ఱెండు పక్షులు ఒకే చెట్టును ఆశ్రయించి ఉన్నాయి. ఒకటి ఆ చెట్టు పళ్ళు అనుభవించుచుండగా ఱెండవది అనుభవించకుండా ప్రకాశిస్తోంది అని ఆత్మ, పరమాత్మలు కలసి ఉంటాయని, ఒకటి కర్మానుభవము అనుభవిస్తోంటే ఱెండవది అనుభవించకుండా ప్రకాశిస్తోందని చెబుతుంది. ఇటువంటి శ్రుతులను ఘటక శ్రుతులంటారు. ఈ శ్రుతిలో తెలుస్తోంది కదా కర్మానుభవము ఆత్మకుకాని పరమాత్మకు కాదని.

**నేను**: "సర్వమ్ ఖలు ఇదమ్ బ్రహ్మ" అని కదమ్మా శ్రుతి వాక్యము, అంటే ఈ కనపడేదంతా బ్రహ్మమే ననికదా?

**అమ్మ**: అక్కడి ఆపక తరువాత వాక్యాన్ని కూడా కలిపి చదువు. "తత్ జలాన్ ఇతి శాంత ఉపాసీత" అంటే తత్ జలాన్ ను తత్ జమ్, తత్ లమ్, తత్ అన్ అని అర్థం చేసుకోవాలి. అంటే దాని యందే పుట్టి, దాని యందే రక్షింపబడి, దాని యందే లయమవుతుంది. అలాంటి బ్రహ్మాని శాంత చిత్తముతో ఉపాసించాలి. ఉపాసించాలి అంటూంటే ఉపాసించేవాడూ, ఉపాసింపబడేదీ అని రెండు ఉండాలి కదా. అంటే రెండూ ఒకటనే అర్థం రాదుకదా! ఈ చరాచర జగత్తంతా ఆయన యందే జన్మ, స్థితి, లయాలు పొందుతూ ఉంటుంది కనుక ఆయనను ఉపాసించాలి అని ఆ శ్రుతి వాక్యానికి అర్థము. అంటే అక్కడ కూడా ఆత్మ, పరమాత్మలకు శరీర, శరీరి భావమే చెబుతున్నారు.

**నేను**: మఱి భగవద్గీతలో పదమూడవ అధ్యాయంలో "క్షేత్రజ్ఞమ్ చాపి మామ్ విద్ధి" అంటూ క్షేత్రజ్ఞుడను నేనే అని కృష్ణుడు చెప్పేడు కదా!

**అమ్మ**: అదే గీత లో అనేక సార్లు నువ్వు, నేను అంటూ, "అహమ్ కృత్స్న స్య జగతః ప్రభవః ప్రలయః" అని ఈ జగత్తు పుట్టుక, లయము అన్నీ నా వలననే, అనిన్నీ, "మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్" అనిన్నీ ఇలా ఎన్నోచోట్ల ప్రకృతి, జీవుళ్ళు పరమాత్మ ఒక్కటి కాదని చెప్పేడు కదా! ఆ క్షేత్ర, క్షేత్రజ్ఞ విభాగ యోగం లో కూడా దానికర్థం ఆత్మకు అంతర్యామి గా ఉన్న పరమాత్మ ను నేను అనే అర్థం తీసుకోవాలి.

**నేను**: అదే భగవద్గీతలో "మాయాంతు ప్రకృతిమ్" అని ఈ ప్రకృతి అంతా మాయయే అని అన్నట్లు ఉంది కదా, నువ్వేమో మాయ అంటే అనూహ్యమై విచిత్రమైనది అని అనుకోమంటావు. మఱి మనం గారడీవాడు మాయ చేసి లేని వస్తువు సృష్టించేడు అని అంటాము. ఏమిటో చాలా confusing గా ఉంది.

**అమ్మ**: సరే, ఈ మాయ అంటే ఏమిటని నీ ఉద్దేశ్యము?

**నేను**: మొదట ఒక రకంగా ఉన్నట్లు అనిపింప లేదా కనిపింప జేసి పిదప అసలు విషయము లేదా వస్తువు సమంగా తెలిసినప్పుడు తొలగి పోయేది మాయ అనుకోవచ్చేమో నమ్మా! అంటే ముందు అక్కడ పాము ఉందని అనుకున్నాము. తరువాత అది పాము కాదు తాడు అని నాన్నగారో ఎవళ్ళో చెప్పిన తరువాత అది పాము అనే జ్ఞానము పోతుంది కదా, అలా ముందు ఉండి తరువాత పోయే దానినే మాయ లేదా మిథ్య అనవచ్చును. ఉదాహరణకు కోర్టు లో ఒక సాక్షిని లాయర్ హత్య చేసిన వాడు ఎలాగుంటాడు అని అడిగితే మొదట ఆ సాక్షి వాడికి తలపై బొద్దుగా నల్లగా జుత్తు ఉంటుందని చెప్పి మళ్ళీ మరొక ఘడియలో లేదండీ నల్లగా కాదు తెల్లగా ఉంటుందని, మరొక మాటు అసలు జుత్తే లేదండీ అంటే ఆ లాయరు వీడు చెప్పేది

సత్యముగా తీసుకోలేమని అంటాడు కదా, అలాగే క్షణ క్షణానికి మారి పోయే ఈ కనపడుతున్నదంతా సత్యమని ఎలాగంటావు మిథ్య అనే అనాలి కదా.

**అమ్మ**: ఈ మిథ్య కలగడానికి కారణం?

**నేను**: అవిద్య. అంటే అసలు స్వరూపాన్ని తెలియకుండా చేసి రకరకాలుగా, విచిత్రంగా తోపిస్తూ అసలు ఉన్నదో, లేదో తెలియనిది అవిద్య అనవచ్చును అనుకుంటాను. అంటే అక్కడ లేని పాము ఉన్నదని తెలిపే తెలివి లేదా జ్ఞానము అన్నమాట. ఈ అవిద్య ఎప్పటినుండో ఉన్నది, అంటే దానికి పుట్టుక లేదన్న మాట. అలాగే ఈ అవిద్య వలననే బ్రహ్మ అయిన నేను ఆ విషయం తెలుసుకోలేక రామాన్ని అనో మరేదో అనో భ్రమించి వ్యవహరిస్తున్నాను. అసలు విషయం అంటే నేను బ్రహ్మ అనే విషయం తెలిసి పోతే అదే ధ్యాసలో ఉండి బ్రహ్మత్వం వచ్చేస్తుందన్న మాట.

**అమ్మ**: బాగుంది. ఎప్పుడు మనం ఇలా బ్రహ్మ గురించి ధ్యానిస్తూ కూర్చోవాలి అంటావు. ఎవరైనా అలా కూర్చోవచ్చా?

**నేను**: దీనికే ముఖ్యంగా నాలుగు prerequisites, అంటే కావలిసిన సోపానాలు అనుకో, అంటారమ్మా స్వామీజీ. 1. బ్రహ్మ ఒక్కటే నిత్యమని మిగిలినవన్నీ నిత్యము కాదనీ తెలుసుకోవడం 2. బాహ్యా అంతరింద్రియాలమీద నియంత్రణ సాధించడం. 3. ఈ లోకంలోను అంతే కాకుండా స్వర్గాది లోకాలలోను కూడా అనుభవాలమీద విరక్తి కలిగి ఉండడం 4. మోక్షం అంటే ఈ మిథ్యాభూతమైన ప్రపంచజ్ఞానాన్ని దాటి బ్రహ్మత్వాన్ని పొందడానికి కోరిక గలగి యుండడం.

**అమ్మ**: అలాగయితే మోక్షం మనంతట మనం పొందీడమేనా, మరొకరి అనుగ్రహము వలన కలిగేది కాదా?

**నేను**: నాకని పించేది మనకు ఆత్మ విశ్వాసం లేనప్పుడు ఏదయినా మరొకళ్ళు ఇవ్వాలి తప్ప మనమంతట మనం సాధించలేము, పొందలేము అనుకుంటామమ్మా. అయినా ఇవ్వడానికి వేటే ఎవరైనా ఉంటే కదా, అంతా బ్రహ్మే అయినప్పుడు, ఇచ్చేదెవరు, పుచ్చుకొనేదెవరు?

**అమ్మ**: కాని, ఉపనిషత్తులు అలా చెప్పలేదు నాన్నా. శాస్త్రాన్ని వదిలేసి అహంకారంతో మోక్షం నాకు నేను పొందేస్తాను అనకూడదు.

**నేను**: మఱి,

**అమ్మ**: శాస్త్రం వివేకం అంటే ఆహారాదులలో ఏవి స్వీకరించాలో, ఏవి కూడదో తెలుసుకొని వ్యవహరించడం, తరువాత విషయాసక్తి తగ్గించుకోవడం, అలా అభ్యాసం చేస్తూండడం, తరువాత పంచ మహా యజ్ఞాలు నిర్వర్తించడం, తరువాత సత్యం పలకడం, త్రికరణ శుద్ధిగా ఉండడం అహింసాలాంటివి కలిగి ఉండడం, దైన్యం లేకుండా మనస్సు స్థిరంగా ఉంచుకోవడం, క్రుంగి పోకుండా, పొంగి పోకుండా ఉంటూ విహిత కర్మలు చేస్తూ పరమాత్మకూ మనకూ ఉన్న సంబంధాన్ని తెలుసుకొని ఆయనను భక్తితో ఉపాసన చేయడం చేస్తే ఆయన ప్రీతి చెంది నిరవధికమైన, అఖండమైన ఆనందముతో ఆయన సాన్నిధ్య, కైంకర్యాలను అనుభవించే స్థితి అయిన మోక్షాన్ని ఆయన ప్రసాదిస్తాడు.

**నేను**: నేను బ్రహ్మ ఒక్కటే నిత్యమని మిగిలినది కాదనీ తెలుసుకొని అంటూ కొన్ని కండిషన్లు చెబితే నువ్వు మరేవో చెప్పేవు. నీ కుడి చేయి తీయి నా దక్షిణ హస్తము పెడతాను అన్నట్లు.

**అమ్మ**: అది కాదు నాన్నా, బాహ్య, అంతర ఇంద్రియ నిగ్రహము అవీ కలిగిన తరువాత అంటే అలాంటి పరిస్థితి అసంభవమనే చెప్పాలి. అసలు ముఖ్యమైన తేడా నువ్వు చెప్పిన దానికీ నేను చెప్పిన దానికీ బ్రహ్మ గురించి ధ్యాస మొదలు పెట్టిన తరువాత మరేమీ అక్కరలేదు అంటున్నావు, మరొకటి నాకు నేనే మోక్షము సాధించేస్తాను అంటున్నావు. నేను విహిత కర్మలు వదలకూడదు అంటున్నాను, మోక్షం పరమాత్మ ఇవ్వాలి తప్ప మనంతట మనం పొందలేము అని అంటున్నాను. ఈ తేడాలను గమనించు. ఇంక ఇంతకీ మనకి త్రాడు పాములా ఎందుకు కనపడుతోంది అంటావు మన అనుభవంలో.

**నేను**: రెండు ముఖ్యమైన కారణాలు ఉండవచ్చును. ఒకటి, నాలో దోషం అంటే నాకు కళ్ళు సమంగా కనపడకపోవడం లేదా నేను సమంగా చూడక పోవడం, మరొక కారణం అక్కడ దోషం అంటే సమంగా వెలుతురూ అదీ లేకపోవడం వలన.

**అమ్మ**: అంటే నువ్వు ఇందాకా చెప్పినట్లు మనం బ్రహ్మ అని తెలుసుకోలేకపోవడానికి కారణం దోషం బ్రహ్మ లోనేనా ఉండచ్చు. మిథ్యావస్తువు లోనైనా ఉండవచ్చును. మనము ఇంతకు ముందు అనుకున్నట్లు ఈ రెండూ సాధ్యం కాదు. (బ్రహ్మలో దోషం ఉండలేదు, ఎందుకంటే బ్రహ్మకు విశేషణం ఉండలేదు, దోషం ఉంటే వాడు బ్రహ్మ కాదు. అలాకాక మిథ్యా వస్తువు లో ఉంది అనుకుంటే దానికి కారణం ఏమిటి అని ప్రశ్నిస్తూ పోతే అదొక అంతులేని కథ అయి కూర్చుంటుంది, అందుచేత అదీ కుదరదు.)

**నేను**: అంతులేని కథ అంటే

**అమ్మ**: ఇందాకా వెలుతురు లేక పోవడం వలన అన్నావు, ఆ వెలుతురు ఎందుకు లేదు

**నేను**: చీకటి అయి పోయింది. లైటు లేదు

**అమ్మ**: లైటు ఎందుకు లేదు

**నేను**: కరెంటు పోయింది అనుకో

**అమ్మ**: కరెంటు ఎందుకు పోయింది.

**నేను**: ట్రాన్స్ఫార్మర్ పోయిందనుకో

**అమ్మ**: ట్రాన్స్ఫార్మర్ ఎందుకు పోయింది

**నేను**: లోడు ఎక్కువయిపోయిందనుకో

**అమ్మ**: ఎందుకు ఎక్కువయి పోయింది

**నేను**: ముందు ఒక లోడుకు ట్రాన్స్ఫార్మర్ పెట్టేరు. తరువాత ఎక్కువ ఇళ్ళువచ్చేసేయి. దానితో లోడు పెరిగి పోయింది

**అమ్మ**: మరి ట్రాన్స్ఫార్మర్ ఎందుకు మార్చలేదు.

**నేను**: వాళ్ళ దగ్గర డబ్బులు లేవో, అశ్రద్ధో నాకు తెలియదమ్మా, ప్రతి దానికి ఏదో ప్రశ్న వేస్తున్నావు

**అమ్మ**: కదా, దీనిసే అంతులేని కథ అన్నాను. అందువలననే ఇలా కుదరదు అని అంటున్నాను. అంటే దోషం ఆ మిథ్యా వస్తువులోనూ ఉండలేదు. ఇందాకా ఈ దోషాన్నే అవిద్య అన్నావు. దీనిని బట్టి అవిద్య ఉండడానికి అవకాశము లేదన్నమాట.
మరొక విషయం త్రాడు పాము లాగే ఎందుకు కనపడుతోంది. ఏనుగులా ఎందుకు కనపడడం లేదు?

**నేను**: త్రాడు లో కొన్ని గుణాలు అంటే పొడుగ్గా, సన్నగా ఉండడం పాములో ఉండడం వలన.

**అమ్మ**: అంటే పాము అనేది ఒకటి ఉన్నదనీ దానికి కొన్ని గుణాలు ఉన్నాయని ఒప్పుకుంటున్నావు కద, మఱి పాము మిథ్య అనీ అసలు గుణాలుండవనీ ఎలాగంటున్నావు.

**నేను**: ఈ పాము అనేది అక్కడ లేదు కదమ్మా, నా బుర్రలో అదే నామవసులో ఉంది. అసలు ఏ వస్తువు ఉనికైనా ఆయా విషయ వాసనల బట్టే పూర్వ జ్ఞాపకాల బట్టి కదా తెలుసుకొనేది. అంటే ఆ వస్తువు మన మనస్సులో ఉన్నది, నిజంగా కాదు. చిన్న పిల్లడికి ఆవుని చూపించి ఇది ఆవు అని చెబితే ఆవు అంటాడు, లేక పోతే లేదు. అందు చేత ఈ వస్తు జ్ఞానమంతా మన మనస్సులో పుట్టిందే తప్ప నిజంగా లేదనిపిస్తుందమ్మా।మరొకటి, ఇప్పుడు ఇక్కడ ఆవు ఉన్నది, ఆ తరువాత లేదు అనుకో ఆ ఆవు ఉండడం నిజమని ఎలా చెబుతాము. వస్తువుకీ వస్తువుకీ తేడా అంటూ ఒకటి ఉంటేనే కదా ఇలా రకరకాల వస్తువులు. ఉదాహరణకు నీకూ నాకూ తేడా ఉందనుకో. అలాగే నాకూ తమ్ముడికీ తేడా ఉంది. ఈ తేడా ఆ తేడా ఒకటేనా అంటే ఒకటి కాదు. అదెలా కుదురుతుంది. అసలు ఈ తేడా అన్నది వస్తువా, ధర్మమా అంటే ఏదీ కాదు. ఇలా చూస్తూంటే పోతే ఈ తేడా అనేది లేదనే అనిపిస్తుంది. ఇదంతా మనం మనస్సుతో కల్పించుకొన్నదే తప్ప నిజంగాలేవు. మనం శాస్త్రం కూడా అలాగే అర్థం చేసుకోవాలని అనిపిస్తుంది. అందుకే ఇంతకు ముందు అన్నట్లు మనం ఒక దానిని చూసినప్పుడు మొదట తెలిసేది ఒకటి ఉన్నది అని, తరువాత దాని ధర్మాలో, గుణాలో అవి మన మనస్సులో అంతకు ముందు వాసనా జ్ఞానం వలన అనిపించేవి. అంటే అంతకుముందు నా మనస్సులో తప్పుగానో, సమంగానో దాచబడిన జ్ఞానం. ఉదాహరణకు తొండము ఉంటే ఏనుగు అన్నట్లుగా. ఈ జ్ఞానం కల్పితమే కదా! అందుచేత ఆ "ఉన్నది" అంటే సత్ యే సత్యము, మిగిలినదంతా మిథ్యే అని నాకు అనిపిస్తుంది.
అంటే కనపడి ఇంద్రియ గ్రాహ్యమై మనం గుర్తించేమనుకుంటున్నవన్నీ నిజాలు కాదన్నమాట.

**అమ్మ**: అలాగయితే వస్తువులకి గుణాలూ, విశేషణాలూ లేవంటావు, అలాగయితే మరి బ్రహ్మకు కూడా జ్ఞానం లేదంటావా, జ్ఞానమూ విశేషణమే కదా?

**నేను**: బ్రహ్మ, జ్ఞానమూ వేఱు కాదు కదమ్మా, సత్ అన్నా జ్ఞానమన్నా బ్రహ్మయే కదా! ఇది స్వయంప్రకాశకం, చిన్మాత్రం కాబట్టి, దీనిని తెలుసుకుందికి మరొక జ్ఞానము అక్కరలేదు. ( ఇలాంటి ద్రవ్యాన్ని అజడము అంటారు. )

**అమ్మ**: జ్ఞానం, ప్రకాశం అనేవి గుణాలు కదా, అవి వేటికో వాటికి అప్లై అవాలి కదా, అంటే నల్లదనము అంటే అది వేరుగా ఉండదు కదా, కుండయో, బండియో ఏదో ఒకటి దానికి ఆశ్రయం అంటే దేనికో ఒక దానికి అప్లై అవాలి కదా. అంతే కాక కర్త, కర్మ అంటే తెలుసుకొనేవాడు, తెలుసుకొనేది ఒకటి కాలేవు కదా.

**నేను**: అలా అసలు వేఋ వేఋగా ఉండవమ్మా, ఉన్నది ఒక్క బ్రహ్మయే. అది తెలుసుకోవడమే మోక్షము. దీపం గుర్తించడానికి వేరొక దీపం అక్కరలేదు కదా. ఆ బ్రహ్మకు జ్ఞాత, జ్ఞేయము ఇలా ఉండవు. అంతేకాక విశేషణాలు ఏమీ ఉండవు. ఇలా ఒక విశేషణం ఉందనుకుంటే ఆ విశేషణానికి మరొక విశేషణం ఉండాలి. అలా చూస్తూపోతే అదీ అంతు లేని కథే. అంటే నల్లకుండ అంటే ఎంత నల్లదనము అని ప్రశ్న వస్తుంది. మంచి నల్ల దనము అంటే ఎంత మంచి....ఇలాగ.

**అమ్మ**: అలా కాదు నాన్నా, ఒక వస్తువు తెలుసు కోవాలంటే దాని అసాధారణ ధర్మాన్ని బట్టి తెలుసుకుంటాము. అంటే ఆవు అంటే గంగడోలు ఉన్నది. ఏనుగు అంటే తొండము ఉన్నది, ఇలాగ. ఈ అసాధారణ ధర్మము ఆ వస్తువు తోటే ఎప్పుడూ ఉండి ఆ వస్తువూ, ఆ ధర్మమూ ఒకేసారి తెలుస్తాయి. ఒకదాని తరువాత ఒకటి కాదు. ఈ ధర్మమే ఆ వస్తు జాతికి మూలము. అదే భేదము. అందు వలన ముందు ఏదయినా వస్తువు ఉన్నదని మాత్రమే తెలుస్తుంది. తరువాత ఆ వస్తువు ధర్మాలూ అవీ ఏమిటో మన మనస్సులో ఉన్న వాసనల వలన తెలుస్తుంది, అనేది సరి కాదు. ఆ వస్తువు తో ఉండే అసాధారణ ధర్మము, ఆ వస్తువు ఒకే సారి తెలుస్తాయి. అసలు వస్తువులలో భేదాలే లేకపోతే ఇన్ని పదాలెందుకు, గుఋము తెమ్మంటే గాడిదను తెచ్చి భేదం లేదు కదండీ అంటే ఊరుకుంటావా? ఈ వస్తు ధర్మము ఆ వస్తువు పై ఆధారపడి ఉంటుంది, దాని తోనే కలసి ఉంటుంది కాని ఆ ధర్మమే ఆ వస్తువు కాదు. అంటే నల్లని కుండలో నలుపుదనము, కుండ ఆ ఋండూ వేఋ కాని నలుపుదనము కుండను ఆశ్రయించి ఉంటుంది అంటే అవి ఋండూ కలిసే ఉంటాయి. అసలు భేదమే లేదంటే బ్రహ్మ కి మిథ్యకీ భేదం లేదంటావా?

**నేను**: పూవుకు వాసన దానినే ఆశ్రయించి ఉంటే మఋ దూరంగా ఉన్న నాకా వాసన ఎలా తెలుస్తుంది.

**అమ్మ**: అక్కడకూడా వాసన కణాలద్వారా వ్యాపించి మన దగ్గరకు వస్తుంది. అంటే ఆ వాసనకు కణాలు ఆశ్రయమన్నమాట

**నేను**: అయితే మహాత్ములు భేదాన్ని చూపించరు అంటాం కదా?

**అమ్మ**: అవును. వారు అన్నిటిలోను ఆ పరమాత్మే ఉన్నాడని మనలో భేదాలను పరిగణించడానికి ఇష్టపడరు. దానికర్థం అసలు భేదమే లేదని కాదు. భేదాలే లేకుంటే చెప్పేవాడికీ వినీ వాడికి తేడా ఉండదు. నువ్వు చెప్పిన త్రాడు, పాము ఉదాహరణలో అది పాము కాదు త్రాడు అంటే అసలు పాము ఉండదని, పాము అనేది మిథ్య అనీ కాదు. పాము అక్కడ అప్పుడు లేదు, అని మాత్రమే. పాము అనేది మిథ్యే అయితే మఱి యొక చోట పామును చూస్తున్నాము కదా! అది కాటు వేస్తే నొప్పి కలగడం, మందు పుచ్చు కోవడం అంతా అవుతోంది కదా, అంటే దాని వలన ఏదో పనో, ప్రయోజనమో జరుగుతోంది. అందు చేత ఈ కనపడే వస్తువులన్నీ మిథ్య కాదు, సత్యాలే. అలాకాదు వస్తువులు సత్యాలు కాదు సత్ ఒక్కటే సత్యము. మనం వస్తువు చూసినప్పుడు ఉన్నది అని మాత్రమే తెలుస్తుంది, అన్నావనుకో, అప్పుడు ఆ సత్ కూడా ఇంద్రియ గ్రాహ్యము, అంతరింద్రియానికైనా, అవడం వలన అదీ మిథ్యే అయిపోవాలి, నీ ప్రకారము. అలాకాదు కదా! అందుచేత బ్రహ్మ నిర్విశేషము అనే వాదన నిలపడదు. ఒక ఊరిలో ఒకాయన "నేను మాటలాడనండీ" అని చెబుతూండే వాడట. అలాగుంటుంది అంటే బ్రహ్మ నిర్విశేషము అంటే ఆ నిర్విశేషమే విశేషణమై కూర్చుంటుంది బ్రహ్మకు. అందుచేత బ్రహ్మకు ధర్మాలు, గుణాలు ఉన్నాయని ఒప్పుకోక తప్పదు.

**నేను**: అంటే నిర్విశేషమన్నది ప్రత్యక్షంగా నిరూపించలేమంటావు. అనుమితి లేదా అనుమాన ప్రమాణంతో నిరూపించచ్చునేమో!

**అమ్మ**: కుదరదు నాన్నా! ఎందుకంటే అనుమాన ప్రమాణము కూడా ముందు ప్రత్యక్ష ప్రమాణాన్ని అనుసరించే నిరూపించబడుతుంది. ఉదాహరణకు పొగ ఉంది కనుక అక్కడ నిప్పు ఉన్నది అన్నావనుకో . పొగ అనేది ప్రత్యక్షంగా కనబడిన తరువాతనే కదా, నిప్పు ఉనికిని ఊహిస్తున్నావు. అందువలన ప్రత్యక్షానికి అసలు చిక్కని నిర్విశేష వస్తువును అనుమాన ప్రమాణంతో కూడా సాధించలేవు.

**నేను**: మఱి శబ్ద ప్రమాణంతోనో.

**అమ్మ**: నిర్విశేష మని శబ్ద ప్రమాణం చెప్ప లేదు. ఒక వేళ ఏదో ఒక చోట అలా ఉన్నా దాని అర్థం అసలు ఏమీ విశేషాలు లేనట్లు కాదు.

**నేను**: మఱి...,

**అమ్మ**: నువ్వు నాకొక జాయిని ఇచ్చేవనుకో. ఏమిటి ఆ జాతిలో విశేషం అని నేను అడిగితే నువ్వు ఏమీ లేదమ్మా, అన్నావనుకో, అంటే ఏమిటి అర్థం?

**నేను**: ఆ జాతిలో ఏమీ specialityలేదని,

**అమ్మ**: కదా, అంతే కాని ఆ జాయికి రంగు, స్వభావము, స్వరూపము ఏమీ లేవని కాదు కదా. అందువలన ఎప్పుడయినా నిర్విశేషమని పదము వచ్చి నప్పుడు అలా అర్థం చేసుకోవాలి. లేదా అలాంటి జ్ఞానము భ్రమ జ్ఞానమైనా అయి ఉండాలి.

**నేను**: నువ్వు అన్నట్లుగా ముందు భేదం ఉండి తరువాత భేదం పోతుందని అనుకుంటేనో, ఉదాహరణకు సముద్రంలోంచి కెరటాలు, వాటినుండి నురుగు వచ్చి తరువాత అంతా సముద్రపు నీరు అయిపోయినట్లు.

**అమ్మ**: నల్ల కుండ అన్నప్పుడు నల్ల తనము వేఱు, కుండ తనము వేఱు, వాటి గుణాలు వేఱు, ఉదాహరణకు నల్లతనం స్పృశించ బడలేదు. అవి ఱెండూ ఎప్పుడూ కలసి ఉన్నా అవి వేఱు వేఱే.

**నేను**: పోనే, ఒక ఉపాధి వలన వేఱుగా ఉన్నట్లుండి ఆ ఉపాధి పోయిన తరువాత ఆ భేదము పోతుందంటేనో. కుండలో గాలి, పైన గాలి కుండ ఉన్నంతకాలమూ వేఱు, కుండ పగిలి పోతే ఒక్కటే కదా!

**అమ్మ**: అదీ కుదరదు. కుండలో గాలి పరిమాణము కాని, దానిలో ఉండే ధూళి కణాలు కాని, పైనున్న గాలి పరిమాణానికి ధూళి కణాలకు వేఱుగా ఉండవూ! అందువలన భేదమనేది తీసి పారేయ లేవు. అసలు నీ ప్రకారం ఈ జ్ఞానం అంటే ఏమిటి?

**నేను**: నిత్యము, సత్యము, స్వయం ప్రకాశకము, నిర్వికారమూ, ప్రాగభావము అంటే అంతకు ముందేదీ లేనిది. దృశ్యత్వము కానిది. ...

**అమ్మ**: నువ్వు నిత్యము అన్నా సత్యము అన్నా ఒక్కటే అనుకుంటున్నావులా ఉంది. నిత్యము అంటే ఎప్పుడూ ఉండేది. ఇది ఱెండు రకాలు. స్వరూపతో నిత్యము, ప్రవాహతో నిత్యము అని. ఉదాహరణకు ఆత్మ ఉందనుకో. దాని  స్వరూపం ఎప్పుడూ మారకుండా ఎప్పుడూ ఒక్కలా ఉంటుంది. అంటే స్వరూపతః నిత్యం అన్నమాట. లేకపోతే ఒక కుండ ఉందనుకో. అది ఇప్పుడు కుండ రూపంలో ఉండ వచ్చును, కొంత కాలము తరువాత పగిలి పోయి పెంకుల రూపంలో ఉండ వచ్చును, మరి కొంత కాలము తరువాత మట్టి రూపానికి మార వచ్చును. ఆ మట్టి మళ్ళీ కుండ రూపాన్ని పొంద వచ్చును. అంటే ఉంటుంది కాని దాని స్వరూపం మారుతూంటుంది. అంటే కుండ స్వరూపతః అనిత్యము, ప్రవాహతో నిత్యము. అంటే అనిత్యము అంటే ఒకప్పుడు ఉండి మరొకప్పుడు లేకుండనివి. ఇంక సత్యములు అంటే అర్థక్రియా కారిత్వము అంటే ఒక ప్రయోజనము కలిగినవి అని అనుకో. పరమాత్మ ఈ సృష్టి అంతా ఏదో ఒక ప్రయోజనానికే కదా చేసినది.

ఇందాకా పాము, త్రాడు ఉదాహరణలో పాము అసత్యము అన్నావు, కాని ఆ పాము లా కనపడి నప్పుడు భయము కలగడమో , జాగ్రత్త పడడమో ఏదో జరిగింది కదా, అంటే ఆ పాము అనే భావన కూడా అసత్యము కాదన్న మాట. అలాంటప్పుడు కుండతో ఇప్పుడు నీళ్ళు పట్టు కుంటున్నాము కదా, అందు వలన అదీ సత్యమే. ఇలా ఈ జగత్తంతా సత్యమే అవుతుంది.

**నేను**: మఱి అసత్యమన్నది లేసే లేదా!

**అమ్మ**: కుందేటి కొమ్ము అన్నామనుకో. అలాంటిది ఉండదు కనుక అది అసత్యము. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఇందాకా నువ్వు జ్ఞానము నిత్యము, సత్యము, నిర్వికారము, ప్రాగభావము లేనిది, దృశ్యత్వము లేనిది, అన్నావుకదా!

**నేను**: అవును. ప్రాగభావము ఉంటే నిత్యము అవదు కదా! అలాగే దృశ్యత్వము ఉంటే దానిని తెలిసి కొనే జ్ఞానము ఇంకొకటి, దానిని తెలిసి కొనే జ్ఞానము ఇంకొకటి ....ఇలా మళ్ళీ అంతులేని కథ అయి పోదూ!

**అమ్మ**: జ్ఞానము సత్యమే మనము ఇందాకా అనుకున్నట్లు. కాని స్వరూపతః నిత్యము, నిర్వికారము, ప్రాగభావము లేనిది, దృశ్యత్వము లేనిది, భేదములు లేనిది, స్వయం ప్రకాశకము అన్న విషయాలు మరి కొంచెం చర్చించాలి. నిద్ర పోతున్నప్పుడు ఈ జ్ఞానము ఉంటుందా!

**నేను**: ఉంటుంది

**అమ్మ**: నిద్రపోతున్నప్పుడు నాకేమీ తెలియలేదు అంటాం కదా!

నేను: జ్ఞానం ఉంటుంది. కాని తెలియబడదు.

**అమ్మ**: మఱి స్వయం ప్రకాశకం అంటున్నావు కదా, అంటే తాను వేరొక ఆధారము లేకుండా ప్రకాశిస్తూ ఇతరులను ప్రకాశింప చేసేదని కదా అర్థము?

**నేను**: అవును

అందు చేత ఈ జ్ఞానం ధర్మి జ్ఞానము, ధర్మ భూత జ్ఞానము అని ఱెండుగా అర్థం చేసుకోవాలి. ధర్మి జ్ఞానము ఆత్మను ఆశ్రయించి ఉండేది. ధర్మభూతజ్ఞానము ఆత్మనుండి ప్రసరించి మిగిలిన జడ పదార్థములు తెలియడానికి ఉపయోగించేది. ఈ ధర్మ భూత జ్ఞానము ఆత్మ నుండి మనస్సు మరియు ఇంద్రియాల ద్వారా

ప్రసరించి ఇతరములైవ జడ పదార్ధములను, అంటే అచేతన పదార్థాలను తెలుసుకొనడానకి ఉపయోగిస్తుంది. నిద్ర పోయినప్పుడు ఈ ధర్మ భూత జ్ఞానము అంతః కరణమునందు, తద్వారా బయటకు ప్రసరించ నందువలన మనకు మనం "నాకేమీ తెలియ లేదు" అని అంటాము. ఈ ధర్మ భూత జ్ఞానం ప్రసారం పిచ్చి వాడికి ఒకలా, మాదక పదార్థములు సేవించిన వానికి వేరొకలా, సత్పురుషునికి ఒకలా, దుష్టునికి వేరొకలా, కలలు కంటున్నప్పుడు ఇంకొకలా ఇలా అనేక రకాలుగా ఉంటుంది. దీని గురించి ఇంకొక సారి చెప్పుకుందాం.

**నేను**: ఇంతకీ జ్ఞానానికి, ప్రాగభావము, వికారాలూ, దృశ్యత్వము అవీ ఉంటాయంటావా.

**అమ్మ**: మనం ఇలా మాటలాడుకుంటుంటే సుఖంగా ఉంది. అంటే సుఖజ్ఞానం ఉంది. వెళ్ళి చదువు కోమంటే ఆ సుఖ జ్ఞానం పోయి, అంతకు ముందు లేని దుఃఖ జ్ఞానం వస్తుంది. అంటే వికారాలూ, ప్రాగభావము ఉన్నట్లే కదా! స్వరూపతః నిత్యము కాదని కూడా అందు వలన తెలుస్తోంది కదా! ఆత్మా అరే ద్రష్టవ్యః ...అని అంటుంది ఉపనిషత్తు. అంటే ఆత్మ, అదే నీ సిద్ధాంతంలో జ్ఞానం దృశ్యత్వము కలది అనే కదా! అంతే కాక కొంతమంది మహాను భావులు మానసికంగా ఆత్మానుభవాన్ని సాధిస్తారని వినడం, కనడం జరుగుతోందికదా! అందువలన మారుతోంది కాబట్టి సత్యం కాదు మిథ్య అని చెప్పడం కుదరదు. అసలు మిథ్య సత్యమా,అసత్యమా!

**నేను**: అసత్యమే

**అమ్మ**: అంటే double negative positive అన్నమాట!

**నేను**: కాదు, సత్యమే అంటే

**అమ్మ**: నీ సిద్ధాంతంలో ఉండేది ఒకటే సత్యం కదా, ఈ రెండవ సత్యాన్ని ఎక్కడనుండి తీసుకు వస్తావు. అలాగయితే మొదటికే ముప్పు కదా! అందువలన సత్యత్వం సత్యత్వం సత్యమే, మిథ్యాత్వం మిథ్యాత్వం కూడా సత్యమే. అందువలన కుండ ఇప్పుడు ఉంది. తరువాత లేదు కనుక అది అసత్యము అనే వాదము చెల్లదు. ఎందుకంటే ప్రదేశము, కాలము, పరిస్థితులు మారిపోయినప్పుడు conditions మారి పోతాయి కద, అలాంటప్పుడు నీ ఉపపత్తి, వాదము పనికిరాదు. ఇంక నువ్వు చెప్పిన లక్షణాలన్నీ విశేషణాలే, అందుచేత "నిర్విశేష"అని బ్రహ్మను నిర్వచించలేవు.

**నేను**: ఇందాకా జ్ఞానానికి ప్రాగ్భావము అంటే దానికి ముందుండే స్థితి ఉంటుందన్నావు. అదెలా?

**అమ్మ**: జ్ఞానానికి ముందేమీ లేదు, అంటే అది అనాది అని చెప్పి అందువలన దానికి నాశము కూడా లేదు అందువలన అది నిత్యము అని సాధించడానికి ప్రయత్నిస్తున్నావు నువ్వు. దీనికి కారణం ధర్మి జ్ఞానము, ధర్మ భూత జ్ఞానముల గురించి పూర్తి అవగాహన లేక.
జ్ఞానానికి ముందు, అంటే ప్రాగ్భావము ఉందని అంటే ప్రాగభావము అంటే ముందు లేకపోవడం లేదని అంటున్నాను నేను ధర్మ భూత జ్ఞానము విషయంలో. అందుకే ఇప్పుడు ఉన్న సుఖ జ్ఞానము తరువాత ఉండక పోవచ్చు, ఇప్పుడు లేని దుఃఖ జ్ఞానము కొత్తగా రావచ్చు. ఇప్పుడు చెల్లాయికి ఆమ్లజనికి సంబంధించిన జ్ఞానము లేదు. రేపు నువ్వో, వాళ్ళ మేష్టారో చెప్పేరనుకో దానికి ఆమ్ల జని సంబంధ జ్ఞానము కలుగ వచ్చు. అందువలన జ్ఞానానికి ప్రాగభావము లేదని చెప్పలేము.

**నేను**: జ్ఞానము ఒక్కటి కాదా! ఇలా ఆమ్ల జని జ్ఞానము, నత్ర జని జ్ఞానము అని నానా భేదాలు కలిగి ఉంటుందా!

**అమ్మ**: ఉండదా! ఆమ్ల జని తెలిస్తే నత్రజని తెలియాలని ఏముంది. కుండ చేయడం వస్తే వంట చేయడం వస్తుందని చెప్పలేము కదా! ఇదంతా ధర్మభూతజ్ఞానము పై బాహ్య ప్రభావాలవలన వ్యాకోచ, సంకోచాల వలన మార్పులకు లోనవడమే. అందుచేత జ్ఞానాలలో నానాత్వమూ ఉంటుంది. అంతే కాదు. జ్ఞాన ప్రసారము కూడా ఒక జ్ఞాన పదార్థము నుండి మరొక దానికి, అది మరొక మనిషిలా చేతనమవనీ, కుండలాగో బండలాగో అచేతనమవనీ, ప్రసరిస్తుంది కూడా. రెండు జ్ఞానాలు మూడవ జ్ఞానము కూడా అవవచ్చు. ఇందుకే జ్ఞానానికి ఆశ్రయముండడం తప్పని సరి.

**నేను**: జ్ఞానం స్వయంప్రకాశకం కూడా కాదంటావా!

**అమ్మ**: నువ్వే చెప్పు. స్వయం ప్రకాశకం అంటే తనను తాను ప్రకాశింప చేసుకుంటూ మిగిలిన వాటిని కూడా ప్రకాశింప చేయాలి, అంటే తెలియ చేయాలి ఎప్పుడూ. నేనేమనుకుంటున్నానో నీకున్న జ్ఞానానికి తెలియక పోవచ్చు కదా, అలాంటప్పుడు జ్ఞానాలన్నీ స్వయం ప్రకాశకాలని చెప్పలేము.

**నేను**: అలా కాకుండా తన కోసమే ప్రకాశించేది అంటేనో

**అమ్మ**: స్వయం ప్రకాశకమంటే అర్థం అది కాదు. అయినా తనకోసం జ్ఞానం ఎప్పుడూ ప్రకాశించదు, మరొకళ్ళకు కూడా ప్రకాశించాలి, పదార్థాలను ప్రకాశింప చేయాలి దీపజ్వాలలా.

**నేను**: దీపానికి జ్వాల, కాంతి అని రెండుంటాయి కదా!

**అమ్మ**: ధర్మి జ్ఞానము దీప జ్వాల అనుకుంటే, ధర్మ భూత జ్ఞానము దీప కాంతి లా అన్నమాట. ఆ రెండిటికీ ఆశ్రయమైన ఆత్మను దీపంలా అనుకోవచ్చు.

**నేను**: అలాగయితే జ్ఞానం ద్రవ్యమంటావా, ధర్మమంటావా?

**అమ్మ**: రెండూను.

**నేను**: అదెలా కుదురుతుంది?

**అమ్మ**: ఎందుకు కుదరదు? కాంతి దీపం ధర్మం, అంతే కాక photons అని కణాల సముదాయము అంటే ద్రవ్యము కూడా. అలాగే కర్పూరం తీసుకుంటే వాసన దాని ధర్మం, ఆ వాసన ఎలా వస్తుంది, కర్పూర కణాలు వాయురూపంగా ప్రసరించడం వలన అంటే అది ద్రవ్యము కూడా. అనుమానం ఉంటే కర్పూరానికి తూకం వేసి చూడు ఒక గంట ముందు, ఆ తరువాత. కర్పూరం బరువు తగ్గినట్లు తెలుస్తుంది. అంటే ఆ ద్రవ్యం కణాలు ప్రసరిస్తున్నట్లే కదా! అంటే అది ద్రవ్యమూ, ధర్మమూ రెండూ అవడం లేదూ!

**నేను**: అలా కాదమ్మా! జ్ఞానం అజడం కదా, నువ్వంటున్న ఆత్మ కూడా అజడము కదా, అంటే ఆత్మా, జ్ఞానమూ ఒకటేనన్న మాట.

**అమ్మ**: బాగుందిరా, ఎఱ్ఱ చీర కట్టుకున్న ఆడుది మా ఆవిడ అన్నాడుట, వెనకటికి ఒకడు. అంటే ఎఱ్ఱ చీర కట్టుకున్నదెవరైనా వాడి పెళ్ళామన్నట్లు. ఒక్క ధర్మాన్ని పట్టుకొని ఆత్మా, జ్ఞానమూ ఒక్కటే అంటే ఎలా. అలాగయితే ఆత్మా స్వయం ప్రకాశకమే, దీపమూ స్వయం ప్రకాశకమే కనుక ఆత్మా, దీపమూ ఒక్కటే అని చెప్పలేము కదా!

**నేను**: అది కాదమ్మా, జ్ఞానంతో బాటు జ్ఞాతృత్వము కూడా జత చేస్తే అంటే జ్ఞాతను కూడా జత కలిపితే ఆ తెలుసుకోవడం అనేది ఒక క్రియ, ఏ పనికైనా ముందు, వెనుక ఉంటాయి కనుక మఱి జ్ఞానం అనిత్యమయి పోతుంది. అంటే నాశం పొందుతుంది. అందుకే జ్ఞానం జ్ఞాతతో ఉండడానికి అవకాశము లేదు.

**అమ్మ**: నేనంటున్నదీ ధర్మభూతజ్ఞానానికి సంకోచ, వికాసాలుంటాయనేకదా! ఎటొచ్చీ ఆ జ్ఞానానికి ఆశ్రయమైన చైతన్యానికి, అదే చిత్తుకి, అంటే ఆత్మకు నిత్యత్వం ఉంటుంది.

**నేను**: అదెలా?

**అమ్మ**: నువ్వు జ్ఞాన క్రియాశ్రయమనుకొని confuse అవుతున్నావు. జ్ఞానాశ్రయమనే తీసుకో. Confusion ఉండదు.

**నేను**: మఱి కర్త ఎవరంటావు, జ్ఞానమా కాదా!

**అమ్మ**: జ్ఞోత ఏవ అని కదా ఉపనిషత్తు. బ్రహ్మ సూత్రాలలో కూడా కర్తా శాస్త్రార్థకత్వాత్ అని కర్త ఆత్మ అనే నిర్ణయించింది. కాని ఆ పని అనిత్యమయినంత మాత్రాన ఆత్మ అనిత్యము అని కాదు.

**నేను**: జ్ఞానము లేకుండా పని ఎలా జరుగుతుంది, అందు చేత జ్ఞానమే కర్త, మళ్ళీ ఆత్మ అని ఎందుకంటున్నావు. ఉదాహరణకు నేను కుండను తెలుసుకున్నాను అంటే తెలుకొనేది జ్ఞానము ఒక్కటే, నేను, కుండా ఱెండూ external to జ్ఞానమే.

**అమ్మ**: నువ్వు డబ్బులు తీసుకెళ్ళి పుస్తకాలు కొన్నావు. పుస్తకాలు ఎవరు కొన్నారు, నువ్వా, డబ్బులా?

**నేను**: నేనే, డబ్బులతో కొన్నాను.

**అమ్మ**: అలాగే నువ్వే తెలుసు కుంటావు జ్ఞానముతో. జ్ఞానము తెలుసుకోదు. అందు వలన కర్త నువ్వు అంటే ఆత్మ.

**నేను**: ఈ జ్ఞాతృత్వము అంతః కరణంలో ఉందనుకుంటేనో, అప్పుడు ఈ జ్ఞానానికి నిత్యత్వం పోతుందన్న సమస్య ఉండదు కదా!
అంతః కరణము అంటే మనస్సు కూడా అచేతనము, శరీరంలా పాంచ భౌతికం కాక పోవచ్చు కాని. అందువలన జ్ఞాత అవదు, జ్ఞానాశ్రయమూ అవదు.

**నేను**: మనస్సు లక్షణాలూ, శరీరం లక్షణాలూ వేఱుకదా, అందువలన జ్ఞాతృత్వము మనస్సులో ఉండవచ్చును కదా!

**అమ్మ**: జ్ఞాతృత్వము మనస్సుకుంటే కుండలలాంటి మిగిలిన అచేతన పదార్థాలకూ ఉండాలి. అలా కాదు కదా! మనస్సు తెలుసుకోవచ్చు, అంటే నీప్రకారం దృశ్యత్వ స్వభావం వలన జ్ఞాతృత్వము ఉండదు. అయినా నీ దగ్గర డబ్బులుంటేనే నువ్వు పుస్తకాలు కొంటావు. డబ్బులు మరొకరి దగ్గర పెట్టి వెళితే పుస్తకాలు కొనడం

అవదుకదా, అలాగే ఈ జ్ఞానం కూడా కర్త అయిన ఆత్మ తోటే ఉండాలి తప్ప వేరొక చోట ఉండడానికి అవకాశము లేదు. మనస్సు జ్ఞాన ప్రసార మాధ్యము మాత్రమే.

**నేను**: ఈ జ్ఞాన ప్రసారం convectionఅంటే సంపర్కం వల్లనా, conduction అంటే వాహకత్వం వల్లనా లేక reflection వలననా?

**అమ్మ**: అంటే

**నేను**: బురద నేలలో ఒక కటిక పుల్ల పాతేమనుకో. ఆ బురద నీటి కణాలు ఈ కటిక పుల్ల లో చేరి కటికపుల్లలో బురద నీటి లక్షణాలు చేరతాయి. ఇది convection. అలాకాకుండా ఒక లోహపు గొట్టము ఒక పక్క నిప్పులో పెట్టి ఔండవ పక్క పట్టుకుంటే కొంత సేపటికి చెయ్యి కాలుతుంది. ఇక్కడ ఆ కణాలు ప్రసరించవు, కదలవు. ఇళ్ళ పనులలో కూలీలు తాము కదలకుండా ఇటుకలు ఒకరికొకరు అందిచ్చుకుంటూ చివరకు గోడ కడుతున్న తాపీ మేస్త్రికి అందిచ్చినట్లు, లోహపు కణాలు తాము కదలకుండా వేడిని మాత్రము ఒక చివరనుండి మరొక చివరకు పంపుతాయి. ఇది conduction. అలాకాక వస్తువు పై పడిన సూర్యకాంతి దర్పణము పై బడి పరావర్తనం చెంది మనకు చేరడం వలన మనకు వస్తువు కనపడుతుంది. దీనిని reflection అంటే పరావర్తనం అంటారు.

**అమ్మ**: ఇవేమీ కాదు. Convection కూ conduction కూ తగిన మాధ్యమము ఉండాలి కదా! అచేతనమైన మనస్సు జ్ఞానానికి అలా ఉండలేదు. ఇంక పరావర్తనమంటావా,  జ్ఞాతృత్వము మనస్సుపై పరావర్తనం చెందుతుందా, మనస్సు జ్ఞాతృత్వముపై పరావర్తనం చెందుతుందా!

**నేను**: జ్ఞాతృత్వమే పరావర్తనం చెందతుంది

**అమ్మ**: నీ ప్రకారం జ్ఞాతృత్వము మనస్సులోనే ఉంటే ఇంక పరావర్తనం ఏం చెందుతుంది.?

**నేను**: మనస్సు జ్ఞాతృత్వముపై పరావర్తనములచెందుతుంది అంటే

**అమ్మ**: మనస్సు అచేతనము. దానికి ప్రసారమూ, పరావర్తనమూ ఏమిటి, కుండతో దీపానికి కాంతి చూపించినట్లు అది  కుదరని విషయము కదా. అందుచేత మనస్సు ఒక గాజు బుడ్డీలా ఉండి దీపం కాంతి ప్రసార మాధ్యమముగా ఉంటుంది. ఆ మనస్సులో ఉండే పూర్వ వాసనల వలన కొత్త చేరికల వలన ఆ జ్ఞాన ప్రసారం సంకోచ వ్యాకోచాలకూ, మార్పులూ, చేర్పులకు లోనవుతుంది. అందుకే ధర్మ భూత జ్ఞానము

మారుతూండడం, ఉండడం, పోవడం అదీ అవుతూంటుంది. అయితే ఆత్మను ఆశ్రయించి యున్న ధర్మి జ్ఞానము మాత్రము మార్పులు లేకుండా ఉంటుంది.

**నేను**: అంటే ధర్మిజ్ఞానము ఆత్మతో ఎప్పుడూ ఉంటుందంటావా!

**అమ్మ**: దీపము, జ్వాల ఎప్పుడూ కలసి ఉంటాయికదా! అయితే దీపానికి పైన నువ్వు పెట్టిన బుడ్డీ బాగా మసి పూసుకు పోవడం, పోక పోవడం...అలాంటి పరిస్థితుల బట్టి ఆ దీపపు కాంతి ప్రసారంలో భేదం కనబడుతుంది. అలాగే ధర్మి జ్ఞానమూ, ధర్మ భూత జ్ఞానమూ కూడా. అవి రెండూ ఆత్మను ఆశ్రయంచే ఉంటాయి. నువ్వు ఈ ధర్మ భూత జ్ఞాన సంకోచ, వికాసాలను కప్పి పుచ్చడానికి జ్ఞాతనో, జ్ఞాతృత్వాన్నో శూన్యము చేయడమో, లేక మనస్సులోనో మరొకచోటో దాచి పుచ్చడానికి ప్రయత్నము చేయడమో అవసరము లేదు. ధర్మభూత జ్ఞాన సంకోచ, వికాసాల వలన ఆత్మయొక్క నిత్యత్వానికీ భంగము లేదు. ఆత్మా, జ్ఞానాల సత్యత్వానికీ ప్రమాదం లేదు.

**నేను**: ముత్యపు చిప్పలో కనపడే వెండి ప్రాతి భాసికం, అంటే మిథ్య కాదంటావా?

**అమ్మ**: ఇంతకుముందు అనుకున్నట్లు ముత్యపు చిప్పలో అప్పుడు వెండి ఉండక పోవచ్చును. కాని భ్రమ వలన వెండి గుణాలు కొన్ని ఉండడం వలన ఒకప్పుడు వెండిలా తోచి ఉండవచ్చును. కాని వెండి అంటూ ఒక పదార్థము ఉంది కదా! దానితో గిన్నెలు, గ్లాసులూ చేయించుకుంటాము కదా! అందు వలన వెండి అప్పుడు అక్కడ లేకపోవచ్చునని మాత్రమే చెప్పాలి. అసలు వెండి అనేదే మిథ్య అనడం తప్పు. దీనినే సాగదీసి కనపడే ప్రతి వస్తువూ మిథ్య అనుకొనడమూ సబబు కాదు.

**నేను**: మనం కుండ కనపడుతోంది అంటాము కదా! అంటే కుండ తెలియబడడం కుండ తాను ప్రకటితమవడం వలననా, లేక నువ్విందాకా చెప్పినట్లు  మనస్సు ద్వారా ప్రసరించిన జ్ఞానము వలననా?

**అమ్మ**: కుండ అచైతన్యము కదా, స్వయం ప్రకాశకం కాదు. అందువలన తనంత తాను కనబడలేదు కదా, అంటే తెలియబడ లేదు కదా! అందుచేత కుండ కనబడడానికి కారణం ఒక చిత్పదార్థమునుండి ప్రసరించిన జ్ఞానము వలననే. ఒక వేళ కుండ తనంత తాను తెలియ బడుతుంది అంటే మరొక అచిత్పదార్థమునకు కూడా అంటే ఒక కట్టెకో బట్టకో కూడా తెలియబడాలి కదా!అలా అవదు కదా. కాని మాట వరుసకు కుండ కనబడుతోంది అంటాం అంతే. అలా అనడానికి ఇంకొక కారణం సూర్య కిరణాలు లేదా ఏవైనా కాంతి కిరణాలు

కుండ మీదపడి అక్కడి నుండి మన కళ్ళకు చేరడం అనే physical activity. కాని కుండ తెలియ బడుతోంది అని మనం ఎప్పుడూ అనం కదా, నేను కుండను తెలుసుకున్నాను అనే అంటాము.

**నేను**: ఈ తెలుసుకోవడంలో తేడాలు ఉంటాయంటున్నావు కదా, అంటే జ్ఞానాలలో తేడాలు. ఈ భేదాలు, లేదా దోషాలు ధర్మ భూత జ్ఞానం మనస్సు ద్వారా ప్రసరించి నప్పుడు మనస్సులో మాలిన్యాలు అవే నువ్విందాకా చెప్పేవే పాత వాసనలు, కొత్త చేరికలూ అని వాటి వలననేనా?

**అమ్మ**: అవును. దీపం చుట్టూ ఉండే గాజు బుడ్డీ కి ఉన్న మఱకల బట్టో, రంగుల బట్టో బయటకు వచ్చే ఆ కాంతి ప్రభావితం అవుతుంది కదా! అలాగే నన్న మాట.

**నేను**: ఈ మాలిన్యము ఆత్మకే ఉందని ఎందుకు అనుకో కూడదు.

**అమ్మ**: అలా శాస్త్రం చెప్పలేదు. భగవద్గీత చదవలేదూ! అంతే కాక ఆత్మ కే మాలిన్యముంటే ఆ మాలిన్యం ఎలా పోతుంది.

**నేను**: మరొక ఆత్మ వలన

**అమ్మ**: ఱెండు ఆత్మలు అదే అజడాలు లేవుకదా నీ ప్రకారం. అంతే కాదు ఆ ఆత్మకు ఉన్న మాలిన్యము మరొక ఆత్మ వలన అంటే దాని మాలిన్యము ఎలా పోతుంది, దాని కోసం మరొక ఆత్మ అంటావా! అలా అది అంతులేని కథ. అందు వలన అలాంటి మాలిన్యము మఱి పోనే పోదు.

**నేను**: మఱి మనస్సుకు మాత్రం ఎలా పోతుంది.

**అమ్మ**: భగవద్గీత ఱెండవ అధ్యాయం చదువు. దానిలో 59 వ శ్లోకంలో "రస వర్జమ్ రసోప్యస్య పరమ్ దృష్ట్వా నివర్తతే" అన్నాడు, కృష్ణ భగవానుడు. సూక్ష్మంగా చెప్పాలంటే ఆత్మ తన స్వరూపాన్ని తెలుసు కొని ప్రవర్తిస్తే ఈ వాసనలు పోతాయన్న మాట. దీని గురించి మిగిలిన శాస్త్రాలలో కూడా వివరంగా ఉన్నదనుకో. ఈ తెలుకోవడం, ప్రవర్తించడం గురించి మరొకసారి చర్చిద్దాంలే.

**నేను**: సూర్యకాంతి కిరణాలకు చేయి అడ్డు పెట్టి నప్పుడు, ఆ చేతి సందుల లోంచి వెలుతురు వస్తుంది కదా, అలా మనస్సు నుండి కూడా స్వతః జ్ఞాన ప్రసారం అవుతుందా!

**అమ్మ**: అలా కాంతి కిరణాలకు చేయి అడ్డం పెట్టి నప్పుడు చేతి సందులలోంచి వక్రీ భవనమో, మరేదో అయి వచ్చేది కూడా సూర్య కాంతే. చేతి లోంచి కొత్తగా పుట్టుకొచ్చే కాంతి ఏదీ లేదు. అలాగే మనస్సు నుండి జ్ఞానం ఉత్పత్తి అవదు, అభివ్యక్తమూ , అంటే ప్రకాశము కాని వస్తువును ప్రకాశితం చేయడం , అవదు, మనస్సు అచైతన్యము అవడం వలన. అంతేకాదు, అభివ్యక్తము చేయడానికి దానలో సాధన సంపత్తి కూడా లేదు.

**నేను**: కర్త అంటే ఆత్మ అన్నకంటే ఆత్మను సాక్షి అంటే బాగుంటుందేమో, అలాగయితే క్రియకి ఉండే అనిత్యత్వం బాధ ఆత్మకు ఉండదు.

**అమ్మ**: నీకు బాగుండడం ప్రకారం నిర్ణయించ కూడదు. శాస్త్రం ఎలా చెబితే అలా తెలుసుకోవాలి. ఇంతకు ముందు అనుకున్నట్లు శాస్త్రం ఆత్మయే కర్త అని చెప్పింది. అయినా ఆత్మ సాక్షి అంటే మఱి కర్త ఎవరంటావు. అచేతనమైన మనస్సు కాదు. శరీరమూ అచేతనమే కనుక శరీరమూ కాదు. జ్ఞానము ఏదో ఒక ఆశ్రయాన్ని విడచి ఉండలేదు కనుక జ్ఞానము కూడా స్వతస్సిద్ధంగా కర్త కాలేదు. అందు వలన ఆత్మయే కర్త అవుతుంది. అంతేకాదు, జ్ఞానాశ్రయము ఏదో అదే కర్త అవాలి తప్ప వేరొకటి కర్త అవడానికి అవకాశం లేదు. ఆత్మ కర్త అవడం వలన దాని నిత్యత్వానికీ ఇంతకు ముందు చెప్పుకున్నట్లు భంగం రాదు.

**నేను**: మఱి నిద్ర పోయి నప్పుడు జ్ఞాన ప్రసారం ఉండదు కదా! అంటే ఆత్మ ఉండదా! అప్పుడు ఆత్మ నశిస్తుందా! మంచి నిద్ర నుండి లేచి నప్పుడు గొప్ప సుఖంగా ఉంది, పూర్తిగా నన్ను నేను మరచిపోయినాను అంటాం కదా!

**అమ్మ**: నేను నిద్ర పోయాను అన్నప్పుడు, నేను అదే ఆత్మ ఉంటూనే ఉంది కదా! అందుచేత ఆత్మ నశించడం, మళ్ళీ పుట్టడం జరగదు. ఎటొచ్చీ మంచి నిద్ర పట్టి ఇంద్రియాలతో బాటు మనస్సు కూడా పూర్తిగా మూసుకు పోతే ధర్మ భూత జ్ఞాన ప్రసారం జరగదు. ఒక వేళ మనస్సు పూర్తిగా విశ్రాంతి తీసుకోక పోతే ఈ జ్ఞానము మనస్సులో ప్రవేశించి అందులో పాత వాసనలచే ప్రభావితమై ఇంద్రియాలు ఇంకా మూసుకొని ఉండడం వలన బయటకు పోక వెనుకకు మరలడం చేత కలలు వస్తాయి. ఆ వాసనలు మంచివయితే మంచి కలలు, చెడువయితే చెడు కలలు. ఈ కలల వలన మనకు ఆ సమయంలో ఏదో ఒక భావన, మంచో, చెడో, ఆనందమో, దుఃఖమో కలుగుతుంది కనుక ఇంతకు ముందు చెప్పు కున్నట్లు ఇవి కూడా సత్యాలే, మిథ్యలు కాదు. నిజానికి మరొకరి ప్రమేయం లేకుండా మనం మాత్రమే అనుభవించ వలసిన కర్మ ఫలాలను పరమాత్మ ఈ కలల ద్వారా మనలను అనుభవింప చేస్తాడన్న మాట. వీటికి మరొక కారణం, పరమాత్మకు

మనపై అనుగ్రహం కలిగి నప్పుడు మన కర్మ ఫలాలను ఈ రకంగా అనుభవింప చేయాలని సంకల్పించ వచ్చు. ఏదేమయినా నిద్రలో కూడా ఆత్మ ఉంటుంది, నశించదు.

**నేను**: నన్ను నేను నిద్రలో తెలుసుకోలేదంటే!

**అమ్మ**: ఆ స్థితిలో నా శారీరక స్థితి, నా జాత్యాశ్రమధర్మ విశేషాలు తెలుసుకోలేక పోయాను అని, జ్ఞాన ప్రసారం ఉండదు కదా మరి.

**నేను**: మోక్ష దశలో కూడా ఈ ఆత్మ వేఱుగా ఉంటుందా! బ్రహ్మలో ఐక్యం అయిపోదూ!

**అమ్మ**: మోక్షం అంటే ఏమిటి? "ముక్తిర్మోక్షో మహానందః " అని కదా! మోక్ష దశలో ఆత్మ నాశనమయిపోతే ఆ మహానందం ఎవరికి. ముక్తులు అహమన్నమ్, అహమన్నమ్, అని నేను అనుభవిస్తున్నాను అని అంటారు అంటుంది శ్రుతి. ఆ "నేను" లేక పోతే మఱి అనుభవం ఎవరికి. అసలు ఇన్ని సాధనలూ, ప్రయత్నాలూ చివరికి నాశనమయి పోవడానికంటే ఎవడికయినా అలాంటి మోక్షం కావాలా, ఆ పేరు వినగానే ఆమడ దూరం పరుగెత్తడూ? అందుచేత మోక్ష దశలో కూడా ఆత్మ ఉంటుంది, మహానందాన్ని అనుభవిస్తూ. అసలు అక్కడ ఐక్యం అంటే అర్థం తెలుసుకోవాలి. సుందర కాండ చదువుతూంటావు కదా. ఆంజనేయ స్వామి "రామ సుగ్రీవయోరైక్యమ్ దేవ్యేనమ్ సమజాయత" అంటే రామ, సుగ్రీవులలో ఒకరు నాశనమై పోయినారని కాదు కదా!

**నేను**: బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి అని కదమ్మా శ్రుతి.

**అమ్మ**: దీనికి కూడా అర్థం బ్రహ్మ ఏవ అంటే బ్రహ్మ యే అని కాక బ్రహ్మ ఇవ అంటే బ్రహ్మ వలె అని చెప్పుకొన వచ్చును. బ్రహ్మ అంటే వ్యుత్పత్తి అర్థాన్ని బట్టి తీసుకుంటే బృహత్ ధాతువును బట్టి బ్రహ్మ ను తెలుసుకున్నవాడు గొప్ప వాడు అవుతాడు అని చెప్పుకొన వచ్చును. ఇంకా లాక్షణిక అంటే indirect అర్థం తీసుకొని కూడా దీనిని వివరించ వచ్చు. అందు వలన ఆత్మ నాశనం ఎప్పుడూ సంభవం కాదు.

**నేను**: మఱి అప్పుడు కూడా రాగ ద్వేషాలూ అవీ ఉంటాయా ఆత్మకు!

**అమ్మ**: అందుకే భగవద్గీత సమంగా చదువమని చెప్పేది. ఈ రాగ ద్వేషాలూ అవీ ఎలా వచ్చేయి. సత్త్వ రజస్తమో గుణాల వలన, పూర్వ వాసనల వలన. ఈ వాసనలకు, గుణాలకు ఆశ్రయం ఏది.? మనస్సు. మోక్ష

దశలో ఈ మనస్సు ఆత్మ నుండి విడి పోతుంది. అప్పుడు ఆత్మ త్రిగుణాతీతమై ఉండడం వలన అజ్ఞానంకానీ, రాగ ద్వేషాలు కానీ దానికి ఉండవు.

**నేను**: భగవద్గీత సమంగా చదువు అంటున్నావు. దానిలోనే ఏడవ అధ్యాయంలో "భూమిరాపోనలో వాయుః ....అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిః " అని ఉంది. అంటే ఈ అహంకారం అదే అహమ్ అంటే ఆత్మే కదా ఇది కూడా ప్రకృతి భాగమేనన్న మాట. మరి నువ్వేమో దీన్ని స్వయం ప్రకాశకమనీ, చైతన్యమనీ అంటున్నావు.

**అమ్మ**: అక్కడ అహంకారం అంటే అర్థం వేఱు. సృష్టి జరిగి నప్పుడు అవ్యక్తమూ అవీ వచ్చి వాటినుండి అహంకారం దాని నుండి మనస్సు ఇలా అన్నీ వచ్చేయి అని చెబుతుంది శ్రుతి. అది ప్రకృతి తత్త్వం, అచైతన్యము. తత్త్వత్రయం చదువుకున్నప్పుడు ఆ విషయాలు వివరంగా చెబుతాను. కాని దానిని ఆత్మ అనుకోకూడదు.

**నేను**: అదే గీతలో "అహంకార విమూఢాత్మా" అని ఉందే!

**అమ్మ**: అక్కడ అహంకారం అంటే దేహాత్మాభిమానము, గర్వము అని అర్థము. అహమ్ అంటే ఆత్మ కదా, అనహమి అహమ్ కరోతీతి అహంకారః అని వ్యుత్పత్తి. అంటే నేను అంటే ఆత్మ కాని దానిని అంటే శరీరం, జాతి, వర్ణాశ్రితాలూ అవీ ఆత్మ అనుకొనడం అన్నమాట. "అటువంటి అజ్ఞానం కలిగిన ఆత్మ " అని అక్కడ అర్థం. హరి అంటే శ్రీమన్నారాయణుడు అని అర్థం ఉంది, కోతి, కప్ప అని కూడా అర్థం ఉంది, శ్రీమన్నారాయణుడూ, కోతీ, కప్ప ఒక్కటే అంటే ఎట్లారా? సందర్భాన్ని బట్టి సమన్వయం చేసుకొని పెద్దల సహాయంతో అర్థం సమంగా చేసుకోవాలి. ఆత్మ అంటే స్వయంప్రకాశకమవాలి, జ్ఞానాశ్రయమవాలి, అంతః ప్రవేశము చేసి, జ్ఞాన ప్రసార వ్యాప్తిని కలిగి ఉండాలి కదా.

**నేను**: అది కాదమ్మా, ఆకాశానికి నిజానికి ఏ రంగూ ఉండదు కదా, కాని మనకు ప్రొద్దున్న ఒక రంగు లోను, మధ్యాహ్నం ఇంకొక రంగులోను, అలాగే ఈరోజు ఒక రంగు లోను, మరొక రోజు మరొక రంగు లోను కన బడుతూంటుంది. అలాగే నిజానికి లేక పోయినా మన భేద వాసన వలన ఈ ప్రకృతి వివిధ రకాలుగా కనబడుతూంటుంది.

**అమ్మ**: ఆకాశం ప్రొద్దున్న ఒకరంగులో, మధ్యాహ్నం ఒక రంగులో ....ఇలా ఎందుకు కనబడు తుందో తెలుసును కదా. తెల్లని కాంతిలో ఉన్న వివిధములైన రంగు కిరణాలు వేఱు వేఱుగా వక్రీభవనం చెందడం

మధ్యలో ఉన్న ధూళి కణాల వలన ఇలా జరుగుతుంది. మన భేద వాసన వలన కాదు. సత్యమైన కారణం కనబడుతూండగా దీన్నంతటినీ మిథ్య అని ఎలాగంటావు.

**నేను**: నేననేది, మన ఇంద్రియాలకు పరిమితులున్నాయి. ఉదాహరణకు ప్రొద్దున్న వెలిగించిన దీపము సాయంత్రము దాకా వెలుగుతున్నదనుకో. అప్పుడు మనము ప్రొద్దున్న మనం వెలిగించిన జ్వాలయే సాయంత్రం కూడా ఉందను కుంటాము. కాని నిజానికి ప్రొద్దున్న వెలిగించిన జ్వాల క్షణ క్షణానికీ మారి పోతూంటుంది, మొదటి జ్వాల అంటే ఆ నూనె బొట్టు, వత్తి ముక్కా కాలిపోయి, తరువాత నూనె బొట్టూ, తరువాత వత్తి ముక్కా తరువాత క్షణంలో జ్వాలకు కారణమవుతాయి. అయితే మంట ఆరడం, మళ్ళీ వెలగడం కాకుండా, మొదటిది ఆరిపోయే సరికి తరువాతది వెలగడం వలన మనం ఈ విషయం గుర్తించలేక ప్రొద్దున్న జ్వాలయే సాయంత్రం కూడా ఉందను కుంటాము. అందు చేత నేను చెప్పేదేమి టంటే మన ఇంద్రియాల పరిమితుల వలన ప్రత్యక్షం సరి అయిన జ్ఞానం ఈయదు కనుక ప్రత్యక్షం మీద ఆధార పడక శాస్త్రాన్ని ఆశ్రయించాలి. అప్పుడు శాస్త్ర ప్రకారం "నేహ నానాస్తి కించన" అని అనేకములైన శ్రుతుల వలన ఇలా కనపడుతున్న అనేకములు అన్నీ ప్రాతి భాసికములే, నిజానికి ఉన్నది బ్రహ్మ ఒక్కటే అని తెలుస్తుంది.

**అమ్మ**: నువ్వు చెప్పిన ఉదాహరణములో ప్రొద్దున్న దీపం వెలిగించినప్పుడు జ్వాల, సాయంత్రం మనం చూస్తున్న జ్వాల ఒకటి కాదని ప్రత్యక్ష ప్రమాణంలో తెలియదంటున్నావు, కాని కొంచెం దగ్గరకు వెళ్ళి నిశితంగా పరిశీలిస్తే ప్రొద్దున్న మనంపోసిన నూనె తరగడం, వేసిన వత్తి కాలి పోయి చిన్నదయి పోవడం కనబడుతుంది. అంటే దాన్ని బట్టి నీకు తెలియదూ, ప్రొద్దున్న జ్వాల, సాయంత్రం జ్వాల పూర్తిగా ఒక్కటే కాదని.

**నేను**: అప్పుడు కూడా నూనె తరిగింది, వత్తి పొడుగు తగ్గింది, కనుక ఈ జ్వాల ప్రొద్దున్న జ్వాల కాదు అని అను మాన ప్రమాణం తో గ్రహించాలి తప్ప ప్రత్యక్ష ప్రమాణం తో మనకు తెలియదు.

**అమ్మ**: అదే, ప్రత్యక్ష ప్రమాణానికి అనుమాన ప్రమాణము జోడించి రెండింటి వలనా తెలుసుకుంటున్నావు అసలు విషయం. అంతే కాని ప్రత్యక్ష ప్రమాణాన్ని, చెత్త బుట్టలో పడవేసి కాదు. అంటే రెండు ప్రమాణాలను సమన్వయించుకొని అసలు విషయం తెలుసుకోవాలి. కాని నువ్వు చెప్పి నట్లు ప్రత్యక్షానికి పరిమితులుంటాయి కాబట్టి ప్రత్యక్షం పూర్తిగా విస్మరించాలని కాదు. ప్రత్యక్షం లో దోషం ఉంటే అందరికీ ఒకే రకమైన దోషం అందరికీ అదే పాళ్ళలో, పరిమాణంలో ఉండడం ఎంతవరకు సంభవము. ఒక వేళ అందరికీ ఒకే రకమైన దోషం ఒక్కలాగే ఉందను కుంటే, అదే నువ్వు చెప్పే భేద వాసనల వలన, ఈ కనబడేదంతా మిథ్య

అని చెప్ప గలచిన మహానుభావుడికీ ఆ భేద వాసన ఉండాలి కదా, ఆయనకు మాత్రం భేద వాసన లేదని ఎలా తెలుస్తుంది. అసలు ఆయనకు భేద వాసనే లేకుంటే నిర్విశేషమైన బ్రహ్మే అయిపోక ఇంకా ఇక్కడ ఎలా ఉంటాడు. ఆయన చెప్పినది మాత్రం సత్యం అని ఎలా చెబుతాము. అయినా శాస్త్రం కూడా బ్రహ్మ తప్ప మిగిలిన ఈ కనబడుతున్నదంతా మిథ్య అని ఎక్కడ చెప్పింది. నువ్వు చెప్పిన "నేహ నానాస్తి కించన" అంటే " ఇక్కడ అన్నిటి లోనూ పరమాత్మ అంతర్యామి గా ఉన్నాడు కనుక ఈ విషయంలో ఇవన్నీ వేఱు కాదు" అని అర్థము. ఒకవేళ బ్రహ్మ తప్ప మరేమీ లేదు అంటే ఇంతకు ముందు చెప్పుకున్నట్లు పరమాత్మ, జీవుళ్ళు, ప్రకృతి ఉన్నారని చెప్పే అనేకములయిన భేద శ్రుతులు, జీవుళ్ళు, ప్రకృతి పరమాత్మతోనే ఉంటాయని చెప్పే ఘటక శ్రుతులు ఎలా విస్మరిస్తావు.

**నేను**: చెప్పేను కదమ్మా, తరువాత వచ్చిన శ్రుతులు, ముందు వచ్చిన వాటిని supercedeచేస్తాయి. అందువలన వాటిని పరిగణన లోనికి తీసుకొననక్కరలేదు.

**అమ్మ**: అది సరికాదు. ఎందుకంటే ప్రత్యక్ష ప్రమాణానికి పూర్తిగా విరుద్ధంగా శాస్త్రం చెప్పదు. ఎటొచ్చీ ప్రత్యక్షానికి ఉండే పరిమితుల వలన కలిగే సందేహాలను శాస్త్రం నివృత్తి చేయవచ్చును. ఆ పరిమితులను తొలగించ వచ్చును. "సా విద్యా యా నివృత్తయే" అనికదా! ఒక వేళ అలా మనం శాస్త్రాన్ని అర్థం చేసుకుంటే తప్పే. అయినా నువ్వు చెప్పిన భేద వాసన తో ప్రకృతిని చూస్తూ తప్పుగా అంతమందీ అర్థం చేసుకుంటున్నప్పుడు మరి శాస్త్రాన్ని మాత్రం సమంగా ఎలా అర్థం చేసుకుంటాం. ఒక గుహ లో ఉన్న వాళ్ళందరూ గుడ్డి వాళ్ళే అయితే వాళ్ళల్లో ఎవరికీ చంద్రుడెలా ఉంటాడు తెలియదు. అందువలన చంద్రుడి నిజ స్వరూపం ఎవడూ చెప్పలేడు. చెప్పినా అది సరి కాదు. అలాంటప్పుడు ఆ శాస్త్రానికీ భేద వాసన లేక దోషము ఉంటుంది. అంటే ఆ శాస్త్రము అసత్యమే. అసత్యమన్నది శాస్త్రంతో సత్యం ఎలా అనుభవమవుతుంది. ఒక వేళ అలా బ్రహ్మ గురించి ఏ మహాను భావుడేనా లేదా ఏ శాస్త్రమేనా తెలియ చెప్పితే, ఆ బ్రహ్మ గోచరమై పోతే, నీభాషలో ఆ బ్రహ్మ కూడా మిథ్యే. ఒక విషయం చెప్పు, ఆ శాస్త్రం సత్యమా, మిథ్యా?

**నేను**: సత్యమే,

**అమ్మ**: బ్రహ్మ, శాస్త్రం రెండు సత్యాలన్న మాట. బ్రహ్మ ఒక్కటే సత్యం కాదన్న మాట, నువ్వొప్పుకుంటావా ఇలా!

**నేను**: కాదు మిథ్య అంటే

**అమ్మ**: మిథ్య అయిన శాస్త్రాన్ని పట్టుకొని మోక్షాన్ని ఏం సాధిస్తావు, కుక్క తోక పట్టుకొని గోదావరి ఈదినట్లు.

**నేను**: అలా కాదు. నిచ్చెన పట్టుకొని గోడ ఎక్కుతాం, ఎక్కిన తరువాత నిచ్చెన వదిలేస్తాం, అంటే మరి నిచ్చెన ఉండదన్నమాట. అలాగే బ్రహ్మానుభవము కలిగే దాకా శాస్త్రము. తరువాత అదీ లేనట్లే. లేక పోతే శాస్త్రమూ, బ్రహ్మ రెండయిపోతాయి కదా. అందుచేత అప్పుడు ఉండేది ఒక్క బ్రహ్మే. శాస్త్రమూ ఉండదు.

**అమ్మ**: నిచ్చెన అక్కడే ఉంటుంది, ఎక్కడకు పోతుంది. అలాగే శాస్త్రమూ ఉంటుంది. ఒక వేళ ఆ నిచ్చెన అసత్యమైతే గోడ ఎక్కలేవు. సత్యమైతే బ్రహ్మతో బాటు మరొక సత్యం వచ్చి కూర్చుంటుంది. అలాకాదు ఎక్కే దాకా నిచ్చెన సత్యమే కాని ఎక్కిపోయిన తరువాత అది అసత్యము అంటే అటువంటి స్థితి అసంభవము. అలాకాదు నిచ్చెన ఎప్పుడూ అదే ఆ శాస్త్రం ఎప్పుడూ మిథ్యయే అయితే మిథ్య అయిన శాస్త్రం నుండి సత్యాన్ని ఎలా సాధిస్తావు.

**నేను**: అలా ఎందుకు కుదరదు. మనకు కలలు వచ్చి నప్పుడు కలలు మిథ్య అయినా యదార్థమైన ఫలితాలు చూస్తున్నాము కదా!

**అమ్మ**: కలలు మిథ్య కాదు కలలు కలిగే కార్య క్రమమంతా యదార్థమే.

**నేను**: కలలు కలిగే కార్యక్రమము పక్కకు పెట్టు, ఆ కలలో ఏనుగు కనబడినదనుకో, అది యదార్థము కాదు కదా, కాని దాని వలన మంచి జరుగుతుంది కదా, అంటే ఈ మంచి యదార్థమే కదా! దాని వలన అయదార్థము నుండి యదార్థము సాధించవచ్చు.

**అమ్మ**: ఇంతకు ముందు చెప్పేను కదా, కలలో కనపడే విషయాలు, వస్తువులు కూడా యదార్థాలే, మిథ్యలు కాదు. వాటి వలన ఆనందమో, దుఃఖమో ఆ సమయంలో కలుగు తోంది కదా! అందు వలన యదార్థమైన కారణం వలననే యదార్థమైన ఫలితాలు కలుగుతున్నాయి. అయదార్థమైన కారణం వలన కాదు.

**నేను**: అంటే కలలో కనబడేవి కూడా యదార్థాలే నంటావా?

**అమ్మ**: అవును నాన్నా, ఇంతకు ముందు అనుకున్నట్లు యదార్థాలు అంటే అదే సత్యమైనవి,అనగా అర్థక్రియా కారిత్వము గలవి, అంటే అవి ఉన్నప్పుడు ఏదయినా ఒక ప్రయోజనం సిద్ధిస్తే అవి యదార్థాలే, అంటే సత్యాలే. ఇప్పుడు కల వచ్చిన సందర్భంలో ఆ కల వచ్చిన వారికి ఆ కలలో కనబడిన వాటివలన ఏదో ఒక అనుభవము, సుఖమో, దుఃఖమో, భయమో, ఆనందమో ఏదో ఒకటి, కలుగుతుంది కదా! అంటే ఆ

కలలలో కనబడేవీ యదార్థాలే నన్నమాట. అందుకే కలల ప్రభావం వలన జరిగినవి కూడా యదార్థమైన కారణము వలన సంభవించినవే. కలలో కనబడిన ఏనుగు యదార్థమే, అలా కనబడడం వలన తరువాత జీవితంలో జరిగిన మంచి విషయమూ యదార్థమే.

**నేను**: సరే, అద్దంలో ప్రతిబింబం మిథ్యాబింబమని ఒప్పుకుంటావు కదా! ఆ మిథ్యా ప్రతి బింబాన్ని చూసి చక్కగా ముస్తాబు చేసుకుంటావు కదా! అంటే యదార్థమైన కార్యము మిథ్యా కారణం వలన జరుగు తోంది కదా! అలాగే అయదార్థమైన శాస్త్ర ప్రమాణంతో యదార్థమైన బ్రహ్మానుభవాన్ని పొందవచ్చునన్న మాట.

**అమ్మ**: నేను ఇంతకు ముందు చెప్పినదే దానికీ apply అవుతుంది. ఇక్కడ కూడా కాంతి కిరణాలు పడడం, పరావర్తనం చెందడం, అవి కళ్ళలో రెటీనా మీద పడడం, తద్వారా మనకు ప్రతిబింబం కనబడడం ఇదంతా యదార్థమైన కార్యక్రమం. అందు వలన యదార్థమైన కారణం వలననే యదార్థమైన కార్యం జరుగుతోంది ఇక్కడ కూడా.

**నేను**: ఇంద్ర జాలము చేసేవాడు అదే Magic చేసేవాడు ఏమీ లేకుండా ఒక వస్తువును కళ్ళకు కనిపింప చేస్తాడు, కనపడకుండానూ చేస్తాడు. అప్పుడు మనం చప్పట్లు కొడతాం, అంటే ఆనందిస్తాం. లేకపోతే ఎవరినో కత్తితో కోసేస్తాడు, కోసివేసినట్లు ప్రవర్తిస్తాడు. అప్పుడు భయపడడమో బాధపడడమో చేస్తాం. అంటే అయదార్థమైన కారణం నుండి యదార్థమైన ఫలితం కలుగుతోంది కదా!

**అమ్మ**: అక్కడ కూడా ఒక ప్రయోజనం కలుగుతోంది అంటే అదే, ఆనందమో, దుఃఖమో, భయమో, బాధో కలుగుతోందంటే ఆ కారణం యదార్థమనే తీసుకోవాలి. ఇంద్రజాలికుడు ఏదయినా ఇంద్ర జాలం చేస్తున్నాడంటే అలా చేయడానికి వాడు ఏదో పద్ధతి అనుసరిస్తూ ఉంటాడు, ప్రత్యేక పరికరాలో, చాకచక్యముతో కూడిన technique లో, మంత్రాలో ఏవో...అవి కూడా యదార్థాలే కదా! అందు చేత ఇక్కడ కూడా నీ వాదము చెల్లదు.

**నేను**: మనం గీతలు గీయడమో, బొమ్మలు వేయడమో చేసేమనుకో. ఆ అచేతనమైన, అయదార్థమైన గీతల వలననో, బొమ్మల వలననో యదార్థమైన వస్తువులనో, మనుషులనో మనం గ్రహిస్తున్నాము కదా, మరి అప్పుడో,

**అమ్మ**: అప్పుడూ అంతే. నువ్వు అచేతనము అంటే అయదార్థము అనుకుంటున్నావులా ఉంది. గీత కాని బొమ్మ కాని అచేతనము కావచ్చు కాని, అయదార్థము కాదు. అందు వలన అక్కడ కూడా యదార్థ కారణం నుండే యదార్థ కార్యం జరుగుతోంది.

**నేను**: మన చుట్టూ ఈ వస్తువులు అదే ఈ ప్రకృతి పదార్థములు అన్నీ ఎలా వచ్చేయో తెలుసా!

**అమ్మ**: నువ్వు చెప్పు, వింటాను.

**నేను**: ఈ మొత్తమంతా చూడడానికి కూడా కనబడకుండా, అదే black hole అని విపరీతమైన mass, Gravity వలన పూర్తిగా కుదించుకు పోయి చివరకు ఆ mass విపరీతమై పోవడం వలన పేలిపోయి చెల్లాచెదురు గా పడి, వాటి వాటి ఆకర్షణ బలాల వలన తిరుగుతున్నాయి ఈ గ్రహాలూ, నక్షత్రాలూ అవీనీ.

**అమ్మ**: అయితే?

**నేను**: శబ్దం కూడా అలాగే పుట్టింది. అంటే ముందు ఒకే శబ్దం అదే ఓంకారమనుకో, ఉండి, ఉన్నా, తగిన మాధ్యమము అదే medium , అలాగే చెవులకు వినబడడానికి తగిన పౌనఃపున్యము అంటే frequency కాక అగ్రాహ్యంగా  ఉండేది. అది ఒక్క సారి పెద్దగా శబ్దించి, శ్రోత్ర గ్రాహ్యమైనది. దీనినే స్ఫోటమని అంటారు. తరువాత వచ్చిన శబ్దాలకు అన్నిటికీ అదే మూలము. ఆశబ్దాలనుండి, వర్ణాలు, అదే అక్షరాలు, పదాలు పుట్టి, పదాల నుండి వాక్యాలు....ఇలా అన్నీ పుట్టేయి.  నువ్వు ఒక వాక్యం మాటలాడేవనుకో, ఉదాహరణకు "రాముడు అడవికి వెళ్ళెను" అని మనం మాటలాడుతున్నప్పుడు చూడు, తరువాత అక్షరము పలికే సరికి అంతకు ముందు అక్షరము కనబడకుండా పోతుంది. అంటే నాశనమై పోతుందన్న మాట. అంటే ము అనే సరికి, రా పోతుంది, డు అనే సరికి రా, ము రెండూ ఉండవు. ఇలా పలికిన తరువాత ప్రతి అక్షరం, అలాగే ప్రతి శబ్దం, ప్రతి పదం కనబడకుండా అయిపోతే ఆ పదాలు చెప్పే వస్తువులూ, మనషులూ సంగతి అంతే కదా, రాముడైనా అంతే, అడవి అయినా అంతే, అన్నీ లేకుండా పోయేవే. చివరకు మిగిలినది ఆ స్ఫోటము ఒక్కటే. అదొక్కటే సత్యము, అదే యదార్థము. మిగిలినవన్నీ అయదార్థాలే. అడవి అనే పదమే  లేకుండా పోయినప్పుడు, మరి అడవి ఎక్కడుంటుంది. అందు చేత ఈ కనబడుతున్నవన్నీ అయదార్థాలే.

**అమ్మ**: "రాముడు అడవికి వెళ్ళెను" అని అంటున్నప్పుడు అడవి అని అనే సరికి రాముడు అనే పదము లేకుండా పోతోంది కనుక ఈ లెక్కలో అన్ని పదాలు, ఆ పదాలు చెప్పేవి అన్నీ కూడా లేనివే అంటావు, అంతేనా! కాని నిజానికి ఇలా జరగడం లేదు. రాముడు అన్న తరువాత "అడవికి" అంటే "రాముడు" అన్న

పదం మన బుర్ర లోనే నిలచి ఉంటుంది. అడవికి అన్నప్పుడు, ఆ అడవి అంతకు ముందు పలికిన రాముడు అన్న పదము తో మన బుర్రలో సమన్వయమవుతుంది. ఇలాగే, వాక్యంలో అన్ని పదాలు, వేరు వేరు వాక్యాలు .....అన్నీ వ్యాకరణ పూర్వకంగా కలసి అర్థవంతమైన విషయం తెలుస్తుంది. అంతే కాని అడవి అనే సరికి రాముడు అనే పదము నశించి పోదు. అలా గయితే వినీవాడికి పిచ్చెక్కి పోతుంది, తప్ప ఒక్క ముక్కా అర్థం కాదు. అలాగయితే "ము" అనే సరికి "రా" అన్న అక్షరం నశించి పోవాలి. అలా అయితే ఆ చెప్పిన వాడు ఏం చెప్పినట్టు, విన్నవాడు ఏం విన్నట్టు, ఏం అర్థం చేసుకున్నట్లు. మొత్తం పదాల, లేదా వాక్యాల సమన్వయం వలననే విషయగ్రాహ్యత సిద్ధిస్తుంది.

**నేను**: ఒక తోటలోనో అడవిలోనో మొక్కలన్నీ ఒకదాని తరువాత ఒకటి పడిపోతూంటే వాటిని మొక్కల సమూహము అని అనము కదా.?అలాగే ఒక అక్షరం తరువాత ఒకటి పడిపోతూంటే అక్షరాల సమూహము, సముదాయము అని ఎలా అంటాము.

**అమ్మ**: ఆ అక్షరాలు పడి పోవడం, నాశనమవడం జరగడం లేదు నాన్నా, అవన్నీ ఒక చోట కొలుస్తున్నాయి, బుర్ర లోనో మరొక చోటో కలసి, అర్థవంతమయిన విషయాన్ని తెలియ జేస్తున్నాయి. అందు వలన ఆ అక్షరాలు, పదాలు, వాక్యాలూ అన్నీ యదార్థాలూ, యదార్థ బోధకాలూనూ. ఏతావతః ఆయా పద బోధకాలయిన సమస్త వస్తువులూ కూడా యదార్థాలే. అందు వలన స్ఫోట మొక్కటే యదార్థము అన్నది సరి కాదు.

**నేను**: ఆకాశము ఒక్కటే. అదే కుండలోనూ, పాలిక లోనూ, ప్రమిదలోనూ భాసిస్తుంది. అలాగే...

**అమ్మ**: ఈ విషయం మనం ఇంతకు ముందు అనుకున్నాం. కుండలో ఆకాశం పరిమాణం, పాలికలో ఆకాశం పరిమాణం, మహదాకాశం పరిమాణం అన్నీ ఒకటి కాదు. వాటి అస్తిత్వాలు వేరు. అందు చేత వాట్లల్లో ఒక్కటే సత్యం మిగిలినవన్నీ అవిద్య వలన కనబడతాయి తప్ప నిజానికి లేవు అన్నది సబబు కాదు.

**నేను**: అంటే అవిద్య లేదంటావా?

**అమ్మ**: పొగ ఉంటే నిప్పుఉంటుందని అనుమాన ప్రమాణం పట్టుకొని, ఆవిరినో, పొగ మంచునో చూసి అక్కడ నిప్పుందను కోవడం తప్పుకదా! అక్కడికి వెళ్ళి చూస్తే నిప్పుండదు. అలాగే ఆదిత్యో యూపః అన్నశ్రుతి వాక్యానికి యూప స్థంభం ఆదిత్యుడిలా ఉండాలంటే ఆ యూప స్థంభం వృత్తాకారంలో ఉండాలని కాదు, ఆదిత్యుని వలె ప్రకాశవంతంగా ఉండాలని అర్థము. స్థంభం వృత్తాకారంలోఎప్పుడూ ఉండదు కదా! ఎందుకు

చెబుతున్నానంటే ప్రత్యక్షప్రమాణంలో పరిమితులున్నాయని, ఏవేవో అనుమాన ప్రమాణాలు, శబ్ద ప్రమాణాలు తప్పుగా apply చేసి అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తే మనం సత్యాన్ని తెలుసుకోలేము. ఒక ప్రమాణానికి మరొక ప్రమాణం సమంగా సమన్వయం చేసుకొని అర్థం చేసుకోవాలి తప్ప కనబడుతున్నదంతా మిథ్య, ఎందుకంటే శాస్త్రం ప్రత్యక్షానికి విరుద్ధంగా చెప్పింది, అందు వలన అంతమందికీ అవిద్య వలన అంతా తప్పుగా కనబడుతోంది, తప్పుగా భాసిస్తోంది, అంటే మనం శాస్త్రాన్ని సమంగా అర్థం చేసుకోవడం లేదన్నమాట, ఆదిత్యో యూపః అంటే యూప స్థంభం వృత్తాకారంగా ఉండాలని చెప్పినట్లు.

**నేను**: మరి "అనృతేన హి ప్రత్యూఢాః " అని కదా ఛాందోగ్యోపనిషత్ చెప్పింది. అంటే
అనృతం అంటే అజ్ఞానం చేత అదే అవిద్య చేత
ప్రత్యూఢాః అంటే అపహరించ బడి పోయినారు
హి అంటే ఈ విషయం ప్రసిద్ధమే అంటే మిగిలిన శ్రుతులలోనూ చెప్పబడినదే కద!
అనే కదా అర్థము. అంటే దీని వలన మనకు తెలుస్తున్నది, మనమందరమూ అవిద్య చేత కప్పబడి పోయి ఉన్నాము అనే కదా!

**అమ్మ**: ఇక్కడ అనృతమ్ అసత్యం, అజ్ఞానం అని కాదు అర్థం. అదే నేను చెబుతున్నది, ప్రత్యక్షానికి పూర్తిగా విరుద్ధంగా శాస్త్రం అర్థం చేసకోకూడదు. ఇక్కడ ఋతమ్ అంటే భగవదారాధనా రూపంగా కర్మలు చేయడం, కఠోపనిషత్ లో "ఋతమ్ పిబంతౌ అమృతస్య లోకే" అని ఉంది కదా, అంటే అక్కడ ఋతమ్ అంటే నిష్కామమైన భగవదారాధనా రూపమైన కర్మలే కదా! ఇక్కడా అంతే! అనృతమ్ అంటే దానికి వ్యతిరేకం, భగవదారాధనా రూపంగా కర్మలు చేయక పోవడం. నువ్వు పూర్తి వాక్యం చదువు "ఏతమ్ బ్రహ్మలోకమ్ న విందంతి అనృతేన హి ప్రత్యూఢాః" అంటే "మీరు బ్రహ్మ లోకాన్ని పొందకపోవడానికి కారణం భగవదారాధనా రూపంగా కర్మలు చేయక పోవడమే". అని అర్థము. ఈ రకంగా వివిధములైన శ్రుతి వాక్యాలను, ప్రమాణాలను సమన్వయ పరచుకొని ఆచార్యుల వద్ద శ్రుతి, పురాణేతిహాసాలకు సమంగా అర్థం చేసు కోవాలి. అది సరే, నువ్వు ఈ అవిద్య అంటున్నావుకదా, అదెక్కడ ఉంటుందంటావు?

**నేను**: అంటే!

**అమ్మ**: అవిద్య అంటూ ఉంటే అది ఎవరినో ఆశ్రయించి ఉండాలి కదా! ఆ అవిద్య బ్రహ్మ ని ఆశ్రయించి ఉంటుందా, జీవుడిని ఆశ్రయించి ఉంటుందా!

**నేను**: జీవుడినే ఆశ్రయించి ఉంటుంది.

**అమ్మ**: ఎప్పటినుండి?

**నేను**: వాటికి పుట్టుక లేదు కదమ్మా, అందువలన అనాది నుండి

**అమ్మ**: జీవుడూ, అవిద్యా రెండూ అనాదులయితే, అవిద్య ఆశ్రయించకుండా, జీవుడెలా వస్తాడు, లేదా జీవుడున్నప్పుడు అవిద్య ఎలా ఆశ్రయిస్తుంది. మీ ఇల్లు ఎక్కడ అంటే పెద్దనాన్న గారింటి పక్కన, పెద్దనాన్న గారిల్లు ఎక్కడ అంటే మా ఇంటి పక్కన అన్నట్లు ఇలాంటి నిర్వచనం అసంబద్ధమైనది.

**నేను**: చెట్టు ముందా, విత్తు ముందా అన్నట్లా, అలాంటప్పుడు చెట్టు, విత్తు పరంపర అదే అన్యోన్య క్రమముగా అర్థం చేసుకోవాలి తప్ప చెట్టు ముందా, విత్తు ముందా అని ప్రశ్న వేయకూడదు.

**అమ్మ**: నువ్వు చెప్పిన ఉదాహరణము ఇక్కడ కుదరదు. నీ ఉదాహరణములో చెట్టు తరువాత విత్తు వస్తుంది, విత్తు తరువాత చెట్టు వస్తుంది ఒకదాని తరువాత ఒకటి. అంతే తప్ప రెండూ మొదటినుండీ కలిసి ఒక్కసారే ఉండవు. అందువలన వాటిని పరంపరగా పరిగణించవచ్చు. కాని, అవిద్యా, జీవుడూ విషయంలో ఇవి రెండూ మొదటినుండీ ఉన్నాయంటే మరి పారంపరిక సత్యమని ఎలా చెబుతావు. ఇలాంటి దోషాన్ని అన్యోన్యాశ్రయ దోషము అని అంటారు.

**నేను**: పోనీ, బ్రహ్మనే ఆశ్రయించి ఉందని అంటే!

**అమ్మ**: చీకటి, సూర్యుడు కలసి ఉన్నట్లు బ్రహ్మ, అవిద్య కలసి ఎలాఉంటాయి. ఒక వేళ బ్రహ్మనే అవిద్య ఆశ్రయిస్తే వాడు బ్రహ్మ కాడు.

**నేను**: ఎందు వలన?

**అమ్మ**: పరిపూర్ణ జ్ఞాన స్వరూపమైన బ్రహ్మను అవిద్య, అజ్ఞానం ఎలా ఆశ్రయిస్తుంది. ఆశ్రయిస్తే జ్ఞాన స్వరూపం అజ్ఞాన వంతమైపోదూ. అంతేకాదు, నీ ప్రకారం బ్రహ్మ నిర్విశేష చిన్మాత్రం. ఈ అవిద్య ఆశ్రయిస్తే నిర్విశేషము కాదు, సవిశేషమైపోతుంది, అవిద్య ఒక విశేషం కదా అలాంటప్పుడు అది బ్రహ్మకు విశేషం అయిపోతుంది కదా! సరే ఆ అవిద్య ఎలా పోతుంది?

**నేను**: మనం అనుకున్నాము కదా, తత్త్వమసి లాంటి వాక్యార్థ జ్ఞానము వలన

**అమ్మ**: అంటే బ్రహ్మకు బాహ్యంగా అదే external గా మరొక జ్ఞానం ఉంటే, బ్రహ్మ ఒక జ్ఞాన స్వరూపం, వాక్యార్థ జ్ఞానము ఇంకొక జ్ఞానం మొత్తం రెండు జ్ఞానాలు, ఇది కూడా నీ ప్రకారం కుదరదు కదా! అసలు ఆ వాక్యార్థ జ్ఞానము ఏం చేస్తుంది?

**నేను**: తత్త్వమసి అంటే నీవే బ్రహ్మ అయి ఉన్నావు అని బ్రహ్మ స్వరూపాన్ని తెలియ చేస్తుంది .

**అమ్మ**: అంటే బ్రహ్మ వేరొక external జ్ఞానానికి గోచరమవుతాడన్నమాట. బాహ్య జ్ఞానానికి గోచరమయితే ఆ బ్రహ్మ మరి బ్రహ్మ కాడు. గోచరమయితే జడము అని కద నీ సిద్ధాంతము. అసలు బ్రహ్మ యే తనకున్న అజ్ఞానాన్ని తొలగించులేక పోతే ఆ బ్రహ్మ పరిపూర్ణ జ్ఞాన స్వరూపం అని ఎలా చెబుతాము.
అంతే కాకుండా బ్రహ్మ గోచరిస్తే అది ప్రమేయమైపోతుంది. అంటే తెలుసుకొనబడేది అవుతుంది. ఇదీ కుదరదు నీ ప్రకారం.

**నేను**: అవిద్య ఆశ్రయించింది అంటే అది విశేషమైపోతుందని కదా నువ్వంటున్నావు, కాదు అవిద్య బ్రహ్మ స్వరూపమే అంటే

**అమ్మ**: ఆ అవిద్య మరెప్పుడూ పోదు. అప్పుడు ఆ బ్రహ్మ బ్రహ్మే కాదు.

**నేను**: అవిద్య తొలగి పోయిన తరువాత బ్రహ్మ అయిపోతాడు కదమ్మా!

**అమ్మ**: చదరంగంలో రాజుకు చెక్ చెప్పేస్తే, అంటే యుద్ధములో రాజును బంధీ చేసేస్తే మరి విడిపించీ వారెవరు. కుదరదు కదా!

**నేను**: ఇంతకు ముందు అనుకున్నట్లు గారడీవాడు చేసేపనులకు తర్కం అదే logic ఉండదమ్మా, అన్నిటికీ తర్కం అంటే ఎలాగ. ఒక దివిటీ జోరుగా త్రిప్పితే చక్రంలా కనపడుతుంది. అంటే దాన్ని నిప్పు చక్రం అనం కదా!

**అమ్మ**: దేనికైనా తర్కంతో విశ్లేషణ చేయడం సమంగా చేస్తే సమాధానం దొరుకు తుంది. గారడీవాడు చేసే పనులకు యదార్థమైన కారణం, మంత్రమవనీ, ప్రత్యేక మయిన పరికరాలవనీ, మోసమవనీ... ఏదో ఒక కారణం ఉండి తీరుతుంది. అలాగే దివిటీని జోరుగా త్రిప్పి నప్పుడు చక్రంలా కనబడడానికి కారణం వర్తులాకారంలో వేగంగా తిరుగుతున్న ఆ దివిటీ యొక్క వేఱు వేఱు స్థానాలను కన్ను గ్రహించలేక

వృత్తాకారంగా పరిగణించడం, అందు వలన సృష్టిలో ప్రతి దానికీ అర్థం అదే కారణం చెప్పలేమనీ, తర్క రాహిత్యం ఆదరణీయమని చెప్పి తప్పించుకోలేవు.

**నేను**: బ్రహ్మ లో ఆ అవిద్యా నివృత్తి జ్ఞానము చెల్లా చెదురుగా, అంటే అవిశదముగా ఉండి ఉండ వచ్చు. వాక్యార్థ జ్ఞానము వలన అది సమన్వయము చెంది బ్రహ్మ స్వరూపావిష్కరణ అయి ఉండ వచ్చు. అంటే అజ్ఞానము బాహ్యమైనది అదే external అవక పోవచ్చు ఉదాహరణకు సూర్య కిరణాలు మామూలుగా దూదిని కాల్చలేవు. కాని ఒక కటకం అదే lens భూతద్దం అంటామే దాని ద్వారా దూదిని తాకితే ఆ దూది కాలిపోతుంది.

**అమ్మ**: బ్రహ్మ నిర్విశేషము అవడం వలన అవయవాలు ఉండవని కదా నువ్వు అంటావు. అప్పుడు కొంత జ్ఞానము విడిగానో, చెల్లా చెదురుగానో ఉండడం కుదరదు. అప్పుడు అవయవి అయిపోదూ.

**నేను**: అలా కాదు, బ్రహ్మకు వాక్యార్థ జ్ఞానము ఉన్నది, కాని స్ఫురణలో లేదు. External input ఆ జ్ఞానాన్ని స్ఫురణకు తెచ్చేయి అంటే. మరోలా చెబుతాను విను, పట్నం మామయ్య ను నాకు తెలుసును. కాని చాలా రోజులుగా చూడలేదు. ఈ రోజు ఆయన వస్తే నేను కొంచెం సందిగ్ధంలో ఉంటే నువ్వు చెప్పేవు, పట్నం మామయ్యరా అని, అంటే వెంటనే గుర్తించేను. ఇలా కూడా కావచ్చు కదా బ్రహ్మ, వాక్యార్థ జ్ఞాన  విషయంలో.

**అమ్మ**: ఏమిటి గుర్తుకు వచ్చింది, లేదా నేను ఏమిటి గుర్తు చేసేను అని అంటావు. ఆయన లక్షణాలా, ఏదో ఒకటి చెప్పి గుర్తు చేయాలి కదా, అలాగయితే మళ్ళీ ఆ బ్రహ్మ సవిశేషమైపోతుంది. అయినా బ్రహ్మ అంటే పరిపూర్ణ జ్ఞానము కదా, దానికి మళ్ళీ గుర్తు చేయడం ఏమిటి, అలా చేయవలసిన అవసరం వస్తే అది పరిపూర్ణ జ్ఞానము, బ్రహ్మ ఎలా?

**నేను**: త్రాడు మీద పాము భాసించినట్లు అవిద్య భాసిస్తుంది.?అది పాము కాదు త్రాడు అని చెప్పిన వెంటనే అదే నువ్వు బ్రహ్మ ను అని తెలిసిన వెంటనే ఆ అవిద్య అనే అభాస పోతుంది

**అమ్మ**: నీ ఉదాహరణంలో అది పాముకాదు త్రాడు అని నీకు చెప్పినప్పుడు అది త్రాడు అన్న జ్ఞానము నీకు కలిగింది. త్రాడుకి కాదు. బ్రహ్మ విషయంలో అలా కాదు, నువ్వు బ్రహ్మవు అను జ్ఞానము అవిద్య ఆవరించిన బ్రహ్మ కు బాహ్య జ్ఞానము వలన కలిగింది.? అంటే త్రాడుకి తాను పాము కాదు త్రాడు అను జ్ఞానము కలిగింది. ఇదెలా సంభవం.

అసలు త్రాడు మీద పాము అభాస ఎందుకు కలిగిందంటావు. కొన్ని లక్షణాలు, అదే సన్నంగా, పొడుగ్గా ఉండడం లాంటివి చూసి కదా పొరబడతాం. నీ భాషలో అవిద్య చేత ఆవరించబడతాం. అంటే సన్నంగా, పొడుగ్గా అంటూ లక్షణాలు వచ్చేస్తే ఆ బ్రహ్మ సవిశేషమైపోతుంది కదా.

**నేను**: బ్రహ్మను వదలి వేయి అమ్మా, ఈ అవిద్య ఈ ప్రపంచాన్నంతా ఆవరించి భేద భావాన్ని కలిగిస్తుందంటే?

**అమ్మ**: అంటే ప్రపంచాన్ని ఆశ్రయించి ఈ ప్రపంచాన్ని వివిధరకాలుగా విచిత్రంగా చూపిస్తూన్నదంటావు. సరే దాని వలన బ్రహ్మ సత్యం అని ఎలా అనగలము. కనబడుతున్న జగత్తు మిథ్య అంటే బ్రహ్మ సత్యం అని చెప్పలేము. ఈ జగత్తు సత్యం కాదు అని చెప్పగలవేమో, అంతే.

**నేను**: వాక్యార్థ జ్ఞానం వలన బ్రహ్మ తప్ప తక్కిన దంతా మిథ్య అని తన స్వరూపానుభవం బ్రహ్మకు కలుగుతుంది.

**అమ్మ**: ముందే నువ్వుబ్రహ్మ గురించి  సత్ ఏవ  ....అద్వితీయమ్ అని దాని స్వరూపము అద్వితీయము అని అనుకున్నాము కదా!
అలాంటప్పుడు బ్రహ్మకు కొత్తగా తెలిసేది ఏమిటి! అసలు అద్వితీయమ్ అంటేనే బ్రహ్మకు లక్షణం ఉన్నట్లు తెలుస్తోంది. అందువలన అవిద్య దేనిని ఆశ్రయించి ఉంటుంది అన్నది చెప్పలేవు.

**నేను**: బ్రహ్మను అవిద్య కప్పివేస్తుంది అంటేనో, దీపాన్ని ఒక మూకుడో ఏదో కప్పివేసినట్లు.

**అమ్మ**: నీ ప్రకారం బ్రహ్మ విషయంలో బ్రహ్మ, జ్ఞాన ప్రకాశము అదే ఉదాహరణలో దీపం, దాని కాంతి లాగ అవి ఒక్కటే, వేరు కాదు. ఎందుకంటే బ్రహ్మ నిర్విశేషం కదా, అందువలన ప్రకాశం వేరుగా ఉండదు, అది బ్రహ్మ స్వరూపమే.

**నేను**: అవును అయితే

**అమ్మ**: కాంతిని మూయడం అదే లేకుండా చేయడం చేస్తే కాంతి తో బాటు దీపం కూడా ఉండదు. అంటే ప్రకాశంతోపాటు బ్రహ్మ కూడా నాశనం అయిపోతుంది, అలా కుదరదు కదా! అది సరే, మూసేస్తుంది అంటే బ్రహ్మను పుట్టనివ్వకుండా చేస్తుందా, ఆ బ్రహ్మ ను మూసివేసి స్వయం ప్రకాశకత్వ భంగం చేస్తుందా!

**నేను**: మూసివేస్తుంది.

**అమ్మ**: అంటే ఇంతకుముందు అనుకున్నట్లు బ్రహ్మ ప్రకాశనాశనం అంటే బ్రహ్మ కూడా నాశనం అయిపోతుంది అన్నమాట. కాని బ్రహ్మకు నాశనం ఉండదు కదా?

**నేను**: బ్రహ్మను పుట్టనివ్వకుండా చేస్తుంది.

**అమ్మ**: అలాగయితే బ్రహ్మకు అస్తిత్వమే ఉండదు.
ఏ విధంగా చూచినా మూయడం అంటే బ్రహ్మ నాశనమవుతుంది అని చెబుతున్నావన్నమాట, అలా కుదరదు కదా! అందువలన బ్రహ్మను అవిద్య మూసేస్తుంది అని చెప్పలేము.
అది అలా ఉంచు, ఇంతకీ ఆ అవిద్య సత్ అంటావా, అసత్ అంటావా?

**నేను**: సత్ అంటే

**అమ్మ**: బ్రహ్మ ఒక సత్, అవిద్య కూడా సత్ అయితే ఱెండు సత్ లు అయిపోవూ. నీ ప్రకారం సత్ ఒక్కటే కదా! ఈ ఱెండవ సత్ ను ఏం చేస్తావు?

**నేను**: పోనీ అసత్ అంటే!

**అమ్మ**: అంటే అది జ్ఞానమా, జ్ఞానము చేత తెలుసు కొన బడే జ్ఞేయమా, తెలుసుకొనే జ్ఞాతా?

**నేను**: జ్ఞానమే!

**అమ్మ**: అంటే బ్రహ్మ లాగేనా? బ్రహ్మ అన్నా జ్ఞానమన్నా ఒక్కటే కదా! అలాగయితే బ్రహ్మ కూడా అసత్ యే అవాలి,

**నేను**: కాదు, బ్రహ్మలా కాదు,

**అమ్మ**: అంటే అనంతమైన జ్ఞానమా! అలాగయితే మఱి ఈ అవిద్య పోనే పోదు.

**నేను**: కాదు, అనంతమైనది కాదు

**అమ్మ**: అంటే విచ్ఛిన్నమైన జ్ఞానము అన్నమాట. నీ ప్రకారం జ్ఞానంలో ఎటువంటి భేదాలూ ఉండకూడదు కదా! విచ్ఛిన్నము కాని జ్ఞానము, విచ్ఛిన్నమయే జ్ఞానము ఇలా ఎన్ని రకాల జ్ఞానాలుంటాయి. ఇలా ఉండడం ఎలా ఒప్పుకుంటావు!

**నేను**: పోనీ జ్ఞేయమో, జ్ఞాతో అనుకో.

**అమ్మ**: ఆ జ్ఞాతకు భ్రమ ఎలా కలిగింది. ఇంకొక అవిద్య అంటావా, ఇలా ఆ అవిద్యకు కారణం ఇంకొక అవిద్య, దానికి కారణం మరొక అవిద్య అనుకుంటూ అదొక అంతులేని కథ అయిపోదూ? అలా కుదరదే!

**నేను**: సత్ కాదు, అసత్ కూడా కాదుఅంటే

**అమ్మ**: ఏదయినా సత్ యేనా అవాలి, లేదా అసత్ యేనా అవాలి. ఆ రెండూ కానిదేమిటి? అలాంటిది ఉండదు కదా!

**నేను**: ఉంటుందనుకో

**అమ్మ**: ఉండదు. ఒకవేళ నువ్వన్నట్లు మాట వరసకు ఉంటుందంటే ఉన్నది కాబట్టి అదీ సత్ యే.

**నేను**: ముందు ఉంటుంది, అది బ్రహ్మను కప్పుతుంది. వాక్యార్థ జ్ఞానంతో పోతుంది.

**అమ్మ**: అలా పోయినది మళ్ళీ రావచ్చా! అలా వస్తూ పోతూ ఉంటుందా, అలాగయితే మళ్ళీ, మళ్ళీ వాక్యార్థ జ్ఞానము బ్రహ్మకు అవసరమవుతుంటుందా, ఇదొక అంతు లేని కథ మళ్ళీ. ఇలా కుదరదని చెల్లినడిగినా చెప్పేస్తుంది.

**నేను**: పోనీ బ్రహ్మతో ఉన్నది అవిద్య అనకుండా బ్రహ్మనే అవిద్య అంటే!

**అమ్మ**: బ్రహ్మ, అవిద్య ఒక్కటే అంటే బ్రహ్మ కూడా అసత్ అవాలి ఎప్పటికీ, ఇదేదో సర్వమ్ శూన్యమ్ బ్రహ్మ యేలేదు అనే బౌద్ధానికి దారి తీస్తుంది. మరి నీకు శాస్త్రం ఎందుకు! అంతే కాదు బ్రహ్మ వలననే ఈ మిథ్యా ప్రపంచమంతా గోచరిస్తోందని అంటే మరి అవిద్య ఎందుకు. దాని అవసరమే లేదు. నువ్వు చెప్పినది కుదరదు. అది సరే  ఈ అవిద్య ఏం చేస్తుంది, ఎలా పోతుంది, మరొక సారి చెప్పు.

**నేను**: అవిద్య వలన ఈ మిథ్యా ప్రపంచమంతా కనబడుతోంది. వాక్యార్థ జ్ఞానము వలన ఆ అవిద్య పోయి బ్రహ్మ తన స్వరూపజ్ఞానానుభవము పొందుతుంది.

**అమ్మ**: జగత్తు మిథ్య అయినంత మాత్రాన బ్రహ్మ సత్యమని తెలియదే, నేను చెడుదానిని అంటే దాని అర్థము నువ్వు మంచి వాడవని కాదు కదా! అంతే కాదు వాక్యార్థ జ్ఞానానికి పదార్థ తత్త్వాన్ని మార్చే సామర్థ్యము

ఉండదు. అంటే ఎవరైనా నీ దగ్గరకు వచ్చి నువ్వు కొండవు అంటే నువ్వు కొండ ఎలా అయిపోవో అలాగే నువ్వు బ్రహ్మవు అంటే బ్రహ్మవూ అయిపోవు.

**నేను**: అది కాదమ్మా! ఈ అవిద్య సత్ కాని అసత్ కాని అనిర్వచనీయం. అంటే బట్ట, బుట్ట లా సద్వస్తువూ అంటే ఉన్నదని చెప్పడానికీ, కుందేటి కొమ్ము లాగో పులి తొండము లాగో అసద్వస్తువు అంటే లేనిది అని చెప్పడానికీ కుదరనిది, అంటే అనిర్వచనీయమైనది. నువ్వు కుదరదని చెబుతున్న తర్కమంతా అది సద్వస్తువో, అసద్వస్తువో అయితే కదా. ఈ అవిద్య ఆ రెండూ కాకుండా అనిర్వచనీయమైనది.

**అమ్మ**: అలాంటి వస్తువు ఏదీ ఉండదని చెప్పేను కదా! ఏదయినా సత్, అసత్ లలో ఏదో ఒకటి అయి తీరాలి.

**నేను**: ఎందుకు కుదరదు. ఉదాహరణకు మనకు ఇంతకు ముందు అనుకున్న త్రాడు, పాము దృష్టాంతమే తీసుకో. పాము కనబడుతోంది కనుక అది సత్ యే. అది పులి లాగో సింహము లాగో కనబడలేదు కదా. పాము లా ఇప్పుడు కనబడుతోంది. కాని తరువాత అది లేదు కనుక (అంటే త్రాడే ఉన్నది కనుక) అది అసత్. అలాగే అవిద్య వలన జరుగుతున్న ఫలితాలను చూస్తున్నాము, అదే రక రకాలుగా ఈ జగత్తును కనిపింప చేస్తూ భ్రమ జ్ఞానమును కలిగిస్తోంది, అంటే సత్ అనాలి. కాని ఉపనిషత్ " సత్ ఏవ ఆసీత్ ఏకమేవ అద్వితీయమ్" అని సత్ ఒక్కటే ఉందని చెప్పింది, అంటే అవిద్య లేదన్నమాటే కదా. అంటే అవిద్యను అసత్ అనాలి. కనుక అవిద్య సత్ కాకుండా అసత్ కాకుండా అనిర్వచనీయమై ప్రత్యేక మైనదన్నమాట.

**అమ్మ**: నీ త్రాడు పాము దృష్టాంతము వలన పామును సత్ కాని అసత్ కాని అనిర్వచనీయమైన ప్రత్యేక వస్తువు అని చెప్పడం కుదరదు. అలాంటి వస్తువు ఏదీ ఉండదు. అలాంటిది ఉంటుందని నిరూపించే ఏ ప్రమాణమూ, ప్రత్యక్షము గాని అనుమానము గాని, శబ్ద ప్రమాణము గాని, ఉండదు.

**నేను**: అవిద్యను నిరూపించడానికి ప్రత్యక్ష ప్రమాణము, అనుమాన ప్రమాణము, శబ్ద ప్రమాణము మూడూ కూడా చెప్ప వచ్చును. అసలు నువ్వు అవిద్య అంటే విద్య కానిది అదే జ్ఞానము కానిది అన్న నిర్వచనం సమంగా అర్థం చేసుకోలేదు.

**అమ్మ**: చెప్పు అదేదో,

**నేను**: అవిద్య అనేది అభావరూపము అని తీసుకోకూడదు. అది భావరూపము అంటే positive entity అని అర్థం చేసుకోవాలి. అప్పుడు జ్ఞానము, అవిద్య కలసి ఉండడానికి అభ్యంతరము లేదు. నువ్వు వెలుతురు, వెలుతురు లేకపోవడం కలసి ఉండవన్నట్లనుకొని సందేహించనక్కరలేదు.

**అమ్మ**: అంటే జ్ఞానము, అవిద్య కలసి ఉండవచ్చునంటావు. అది కొంచెం వివరంగా చెప్పు.

**నేను**: నఞ్ కారానికి ఆఱు రకాలైన అర్థాలున్నాయి కదమ్మా!

తత్సాదృశ్యమ్ అభావశ్చ తదన్యత్వమ్ తదల్పతా
అప్రాశస్త్యమ్ విరోధశ్చ నఞ్అర్థాః షట్ ప్రకీర్తితాః

అని కదా. అంటే న కారము "పోలిఉండి వేఱుగా ఉన్న  వస్తువునకూ " వాడవచ్చు అబ్రాహ్మణ అంటే బ్రాహ్మణుడు కాని మనుష్యుడు. అలాంటప్పుడు బ్రాహ్మణుడు, అబ్రాహ్మణుడు కలిసి ఒక చోట ఉండవచ్చు. ఇబ్బందేమీ లేదు. మరొకలా చెబుతాను విను. గజాభావము అంటే ఏమిటి.

**అమ్మ**: గజము అదే ఏనుగు లేక పోవడం.

**నేను**: ఇక్కడ ఏనుగు లేకుండా లొట్టిపిట్ట ఉన్నదనుకో. ఆ పరిస్థితి గజాభావమేనా.

**అమ్మ**: అవును

**నేను**: అంటే ఏనుగు, లొట్టి పిట్ట ఇక్కడ ఉన్నాయనుకో. గజము, గజాభావము కలసి ఉన్నాయి అనడం లో తప్పు లేదు కదా. అంటే జ్ఞానము, అవిద్య అదే జ్ఞానాభావము కలసి ఉండడానికి అభ్యంతరము ఏముంది. ఇందాకా వెలుతురు, వెలుతురు లేకపోవడం కలసి సంభవించవు అని అన్నావు. అసలు వెలుతురు లేకపోవడం అంటే చీకటే కదా!

**అమ్మ**: అవును.

**నేను**: చీకటి కూడా వెలుతురు లేకపోవడం అని కాక చీకటి అని తీసుకో. చీకటి అదే తమస్సు positive item కదా.

**అమ్మ**: అదెలా.

**నేను**: నల్లటి చీకటి, దట్టమైన చీకటి అని అంటాం కదా. చీకటిని చూస్తున్నాం, అనుభవిస్తున్నాం, వర్ణిస్తున్నాం. అది positive item కాకపోతే అలా కుదరదు కదా. అలాగే నేను అజ్ఞానిని, లేదా నేను అజ్ఞానముతో ఉన్నాను అని మనం అంటూంటాము కదా!

**అమ్మ**: అవును

**నేను**: అంటే అజ్ఞానము positive item కాకపోతే అజ్ఞానముతో ఉన్నాను అని ఎలా చెబుతాము. అంతేకాదు, నేను అంటే జ్ఞానము అజ్ఞానము కలసి ఉన్నట్లు ప్రత్యక్షంగా గుర్తిస్తున్నాము కదా. అంటే ఈ అవిద్య అదే అజ్ఞానాన్ని ప్రత్యక్ష ప్రమాణంతో గుర్తించడం, నిరూపించడం జరుగుతోంది. మనం నిదుర పోయి లేచి నప్పుడు మంచి నిదుర పట్టింది, అసలు తెలివే లేదు అంటాము కదా. అంటే మంచి నిద్రలో జ్ఞానాభావము నాతో ఉన్నట్లే కదా. అప్పుడు కూడా మన ప్రత్యక్షానుభవముతో జ్ఞానము, జ్ఞానాభావము కలసి ఉన్నట్లు అంటే మనలో అవిద్య ఉన్నట్లు తెలుసుకుంటున్నాము కదా. అందు వలన నీవన్నట్లు అవిద్య జ్ఞానంతో ఉండదు, అందు వలన అవిద్య లేదు అని చెప్పడం సరి కాదు. పైన చెప్పి నట్లు ప్రత్యక్ష ప్రమాణంలో అవిద్య ఉన్నట్లు చక్కగా తెలుస్తోంది.

**అమ్మ**: గజం అదే ఏనుగు తెలియక పోతే ఏనుగు అభావం అదే ఏనుగు లేకపోవడం తెలుస్తుందా!

**నేను**: ఏనుగు తెలిసినప్పుడే ఏనుగు లేకపోవడం తెలుస్తుంది

**అమ్మ**: అంటే జ్ఞానము జ్ఞానమును తెలుసుకుంటున్నప్పుడే అజ్ఞానమును తెలుసుకొనగలదు. అంటే జ్ఞానము తన జ్ఞాన స్వరూపమును తెలుసుకుంటున్నప్పుడు నేను అజ్ఞానిని అని అనడం కాని, అజ్ఞానం జ్ఞానంతో బాటు కలిసి ఉండడం గాని ఎలా సంభవము.

**నేను**: అందుకే అజ్ఞానమును ఒక positive item గా తీసుకోవాలి. నేను సుఖముతో ఉన్నాను, అన్నట్లే నేను అజ్ఞానముతో ఉన్నాను అన్నమాట. అప్పుడు నేను, సుఖము వేరయినా కలసి ఉండినట్లు నేను అజ్ఞానము వేరు అయినా కలసి ఉంటాయి.

**అమ్మ**: బ్రహ్మ అంటే స్వయం ప్రకాశకం, అంటే ఇది అవిద్య, భ్రమ అని గ్రహించాలి కదా!

**నేను**: జ్ఞానం అవిద్యను తెలుసు కోవడం వలన నేను అజ్ఞానిని అన్న విషయం తెలుస్తోంది. కాని దానిని నశింప చేయ లేదు.

**అమ్మ**: జ్ఞానం తనను తెలుసుకుంటూ అవిద్యను కూడా తన స్వరూపముగా తెలుసుకుంటుందన్న మాట. అవిద్యను ఆ జ్ఞానము తెలుసుకొనే వస్తువుగా ఎలా విడదీయగలము.

**నేను**: జ్ఞానము అదే బ్రహ్మ స్వయంప్రకాశకము. దానిని తెలుసుకునేందుకు వేరే ప్రమాణం అక్కరలేదు. అందుచేత అవిద్య కంటే వేరుగా అది ఉండగలదు. నేను అజ్ఞానిని అన్నప్పుడు అవిద్య ప్రత్యక్షంగా గ్రహింప బడుతోంది. అంటే ప్రత్యక్ష ప్రమాణం కుదురుతోందన్న మాట.

**అమ్మ**: బ్రహ్మ స్వయం ప్రకాశకం అంటూనే అవిద్యను అనుభవిస్తున్నాడని ఎలా చెబుతావు. బ్రహ్మ జ్ఞానాన్ని అనుభవించడం, అజ్ఞానాన్ని అనుభవించడం ఒకే సారి ఎలా? అసలు ఈ అవిద్య positive item అంటున్నావు కదా! దాన్ని నిర్వచించ గలవా.

**నేను**: అవిద్య అనిర్వచనీయము అని చెప్పేను కదమ్మా, ఒక తెల్ల కాగితం బ్రహ్మ అనుకుంటే దానిపై అవిద్య అనే జిగురు అలమి రంగులు జల్లితే ఎలాగ అధ్యాసలు అవే త్రాడు మీద పాము కనబడినట్లు, మిథ్యా ప్రపంచమంతా కనబడుతోంది. ఈ అవిద్య బ్రహ్మనూ ఆవరిస్తుంది. అందువలన బ్రహ్మ నిర్విశేషం కాక విశేష పూర్ణుడుగా భాసిస్తాడు. అలాగే ప్రపంచం మీదా ఆవరిస్తుంది, అందుకే ఇలా రకరకాలుగా, బోలెడన్ని జీవుళ్ళలా భాసిస్తుంది. ఆ అవిద్య పరిమాణంలో తేడాల వలన మనలో భ్రమజ్ఞానము కూడా వేఱు వేఱుగా ఉన్నట్టనిపిస్తుంది.

**అమ్మ**: అవిద్య దోషమా కాదా!

**నేను**: దోషమే

**అమ్మ**: అంటే అది బ్రహ్మలో ఉండడానికి అవకాశం లేదు. బ్రహ్మ నిర్విశేషం, నిరవద్యం కదా

**నేను**: దోషము కాకపోతే

**అమ్మ**: అలాగయితే బ్రహ్మకు జీవభావము, ఇతర అపరమార్థిక భావాలు నువ్వు చెప్పి నట్లు ఎలా వస్తాయి.

అంతేకాదు. నిద్రలో అవిద్య ఉంది బ్రహ్మతో అనడం కూడా తప్పు. అక్కడ అజ్ఞానిని అన్నప్పుడు ధర్మభూత జ్ఞాన ప్రసారం మనస్సు, ఇంద్రియాల ద్వారా సమంగా జరగలేదు అని. అలాగే మూర్ఛ లాంటి స్థితులలో కూడా. అప్పుడు బ్రహ్మకు కాని ధర్మి జ్ఞానమునకు కాని ఏమీ అవదు. నువ్వు చెబుతున్న ఈ భావరూప అవిద్య జ్ఞాన వ్యతిరేకమైనా అవాలి, జ్ఞానము కంటే వేరైనదేనా అవాలి, లేదా జ్ఞానము లేక పోవడమేనా అవాలి. జ్ఞానము జ్ఞాన వ్యతిరేకమూ కలసి ఉండవు, జ్ఞానమూ, వేరొక జ్ఞానమూ అంటే రెండు జ్ఞానాలు అయిపోయి అద్వైత భంగమవుతుంది. జ్ఞానము లేకపోవడమూ జ్ఞానముండడమూ కలసి ఉండవు అందువలన నువ్వు చెప్పినది కుదరదు.
అది సరే ఈ అవిద్యను బ్రహ్మ గ్రహిస్తుందంటే గ్రహించిన తరువాత కప్పుతుందా, కప్పిన తరువాత గ్రహిస్తుందా?

**నేను**: గ్రహించిన తరువాత కప్పుతుంది

**అమ్మ**: బ్రహ్మ అవిద్యను ఆవరించకముందే గ్రహించేస్తే మరెందుకు కప్పడం.
బ్రహ్మ అవిద్యను అనుభవించడం ఇంకొక దాని ద్వారానా, లేక నేరుగానా

**నేను**: ఇంకొక దాని ద్వారా

**అమ్మ**: అంటే అదొక అవిద్యా, దాని కోసం మరొక అవిద్య ....ఇలా అదొక అంతులేని కథ అయిపోదూ

**నేను**: నేరుగానే అంటే

**అమ్మ**: అంటే అది బ్రహ్మ స్వరూపమే. అలాగయితే అదెప్పటికీ పోదు. పోతే బ్రహ్మ నాశనమయిపోవాలి.

**నేను**: బ్రహ్మని అవిద్య కప్పిన తరువాతే అనుభవిస్తుందంటే?

**అమ్మ**: అలాగయితే అది జ్ఞానం వలన పోదు. నీకు పచ్చ కామెర్లు వచ్చిన తరువాత నేను వచ్చి నీకు పచ్చ కామెర్లు లేవు అని చెబితే ఆ పచ్చ కామెర్లు పోవుకదా!

**నేను**: బ్రహ్మని కప్పడం, అనుభవింపచేయడం ఒకే సారి అంటే

**అమ్మ**: బ్రహ్మ స్వయం ప్రకాశకం కదా, కప్పబడకుండా అవిద్యానుభవం సాధ్యం కాదు.

**నేను**: అవిద్య కాకుండా ఇంకేదో కప్పడం వలనఅవిద్య ను బ్రహ్మ అనుభవించడం ప్రారంభించింది, అప్పుడు అవిద్య వచ్చేసింది అంటే

**అమ్మ**: అంటే అది మరొక అవిద్య లాంటిది, ఏజాయి అయితేనేం తల పగలగొట్టుకుందికన్నట్లు ఏ అవిద్య అయితేనేం. ఇలా అవిద్యలు పెంచుకుంటూ పోతే అదొక అంతులేని కథ.

**నేను**: బ్రహ్మను అవిద్య కప్పినప్పుడు బ్రహ్మ కొంత వరకే ప్రకాశిస్తోందంటే

**అమ్మ**: బ్రహ్మ లో భాగాలు ఉండవుకదా! అలాంటప్పుడు కొంత భాగం ప్రకాశించడం, కొంత ప్రకాశించకపోవడం ఎలాకుదురుతుంది. స్వయం ప్రకాశకం అన్నప్పుడు ఇలా చెప్పలేం. ఒక వేళ బ్రహ్మ లో ఈ అప్రకాశత ఉందంటే అది ఎలా వస్తుంది. అలాగయితే మరి అవిద్య ఎందుకు. దాని అవసరమే లేదు. అలాంటప్పుడు బ్రహ్మ కూ మిగిలిన మిథ్యా ప్రకృతికీ తేడా ఏమిటి.

**నేను**: అవిద్య దోషం కదా!

**అమ్మ**: అవిద్య దోషం, దాని వలన జగత్తూ దోషమే. బ్రహ్మను ఆవరించడం వలన అదీ దోషమే. మరి బ్రహ్మ సత్యం అని అననక్కరలేదు. అంతా శూన్యమే అని అనేసుకోవచ్చు.
నేను: నువ్వు ప్రత్యక్ష ప్రమాణాన్ని నేనేమి చెప్పినా ఒప్పుకోవడం లేదు. అనుమాన ప్రమాణంలో నిరూపిస్తాను, చూడు

**అమ్మ**: అలాగే నిరూపించు, చూస్తాను

**నేను**: ఇందాకా చెప్పినట్లు చీకటి వెలుతురు లేకపోవడం అనికాక ఒక భావ రూపము అంటే positive entity అని ఒప్పుకుంటావా! ఎందుకంటే దట్టమైన చీకటి, నల్లని చీకటి అని చీకటిని చూసి వర్ణిస్తున్నాము కదా. Positive entity కాక పోతే ఇలా చూడడం, వర్ణించడం కుదరదు కదా. ఇప్పుడు దీపం వెలిగిస్తే వస్తువులు కనబడుతున్నాయి, ఎలాగ ఆ చీకటి పోవడం వలన. ఉదాహరణకు కొండమీద పొగ కనబడుతూంది, మన ఇంటిలో కట్టెల పొయ్యి తో నిప్పు రాజేసి నప్పుడు పొగ కనబడుతోంది, అందువలన కొండ మీదకూడా నిప్పు ఉండి ఉండాలి. అలాగే తత్త్వమసి లాంటి వాక్యార్థ జ్ఞానము వలన బ్రహ్మ స్వయంప్రకాశకమైనది. అంతకు ముందు బ్రహ్మ అప్రకాశమై ఉన్నది. ఇలా ముందు అప్రకాశమై ఉండడానికి కారణం, ఇంతకు ముందు దీపం వెలిగించిన తరువాత పోయిన చీకటి లాగ, వాక్యార్థ జ్ఞానము వలన పోయే అవిద్య అన్నమాట. అర్థం అయిందా.

**అమ్మ**: నువ్వు చీకటిని positive item అంటున్నావు. అది తప్పు. చీకటి అంటూ వేటే పదార్థము ఏమీ లేదు. ఇప్పటి విజ్ఞాన శాస్త్రము కూడా చీకటిని positive item అని చెప్పదు, చీకటి అంటే వెలుతురు లేకపోవడం అనేచెబుతుంది. సరే, అదలా ఉంచు. నువ్వు చెబుతున్న అనుమాన ప్రమాణం ఎంత అర్థ రహితంగా ఉన్నదో చూడు. వాక్యార్థ జ్ఞానము వలన బ్రహ్మ స్వయం ప్రకాశకమైనదని, అంతకు ముందు అలా కాదని దానికి కారణం అవిద్య అనీ అంటున్నావు, వస్తువులు తెలియకుండా చేసే చీకటి లా. అయితే ఇలా చేసేది అవిద్యే అని ఎలా చెబుతావు, దానికి నీ దగ్గర ఏమీ ఋజువు లేదు. అది అవిద్యేనా అవచ్చు, మరొక అజ్ఞానమేనా అవచ్చు, అదీ ఒక వేళ అంతకు ముందు బ్రహ్మ స్వయంప్రకాశంగా నువ్వు చెప్పినట్లు ఉండక పోతే. అందు చేత అది కుదరదు. మరొకటి, నువ్వు అదే నోటితో  జగత్తులో వస్తు ప్రకాశకానికి కారణం కూడా అవిద్య అంటున్నావు. చీకటి పుస్తకాన్ని కనబడకుండా చేసి, బంతిని కనబడీటట్లు చేయదు. అది పుస్తకాన్నీ, బంతినీ కూడా కనబడనట్లే చేస్తుంది. కాని నీ అవిద్య విషయంలో అది బ్రహ్మ ప్రకాశాన్ని పోగొడుతుంది, జగత్తులో వస్తు ప్రకాశాన్ని కలిగిస్తుంది. ఇదెలా. అయినా ఆ అవిద్యా, ఈ అవిద్యా ఒక్కటే అని చెప్పడానికి కూడా నీ దగ్గర ఋజువు లేదు. అసలు దీపం పెట్టినా నీకు కళ్ళు లేక పోతే వస్తువులు కనబడతాయా.

**నేను**: కనబడవు

**అమ్మ**: అంటే దీపం కనబడడానికి సహకారి మాత్రమే. అసలు కారణం కాదు. నీ ఇంద్రియాలు అసలు కారణం.

**నేను**: నేనన్నది, దీపం చీకటిని పోగొట్టినది అని

**అమ్మ**: అంటే పదార్థ ప్రకాశానికి విరోధిని పోగొట్టినది అని కదా, కాని విరోధి పోయినంత మాత్రాన ప్రకాశం రాదు. నువ్వు ప్రకాశము కలిగించింది అని అంటున్నావు. అదెలా.
అదలా ఉంచు. ఈ అవిద్య ఎక్కడుందంటావు.

**నేను**: బ్రహ్మ లో. అందు వలననే బ్రహ్మ స్వస్వరూపజ్ఞాన భ్రమ తో ఉంది.

**అమ్మ**: అవిద్య బ్రహ్మ లో ఉండదు. ఎందుకంటే నీ ప్రకారం, బ్రహ్మ జ్ఞానాశ్రయం కాదు. త్రాడు, పాముల జ్ఞానం త్రాడు లో ఉండదు. జ్ఞానాశ్రయం అయిన నీలో ఉంటుంది. అవిద్య దేనిని ఆచ్ఛాదించింది అదే ఆవరించింది

**నేను**: చెప్పేను కదా, బ్రహ్మనే.

**అమ్మ**: కుదరదు. త్రాడు, పాముల జ్ఞానం త్రాడుని ఇక్కడ మన విషయంలో బ్రహ్మను ఆవరించదు, జ్ఞానాశ్రయమైన నిన్ను ఆవరిస్తుంది. నీ ప్రకారం బ్రహ్మ జ్ఞానాశ్రయం కాదాయె.
మరి ఆ అవిద్య ఎలా తొలగుతుంది.

**నేను**: నివర్తక జ్ఞానము వలన

**అమ్మ**: అవిద్య నివర్తకజ్ఞానం వలన ఎలా తొలగు తుంది, త్రాడు దగ్గరకు వెళ్ళి చెప్పి చూడు నువ్వు త్రాడువి పామువి కాదు అని, అది జ్ఞాత అయితేకదా తెలుసుకుందికి, అవిద్య నివర్తకం అవడానికి
అసలు ఆ అజ్ఞానానికి ఆధారం ఎక్కడ నేను: బ్రహ్మ.

**అమ్మ**: అసలు అది జ్ఞానాశ్రయము కానప్పుడు అజ్ఞానము నకు ఆధారము కాదు. కుండ, బండ లాగ.
సరే, అవిద్య ఎవరిని మూసేస్తుంది

**నేను**: బ్రహ్మనే

**అమ్మ**: బ్రహ్మ అవిద్య చేత మూయబడలేదు, ఎందుకంటే అది జ్ఞానమునకు విషయం కాదు, త్రాడు లాగే. ఏది అవిద్య చేత మూయబడుతుందో అదే కదా అసలు జ్ఞానము వలన తెలియాలి. త్రాడు బదులుగా పాము కనిపించిందంటే త్రాడు అవిద్య చేత మూయబడినదంటున్నావు. అసలు జ్ఞానము వలన అదే కదా తెలియాలి, కాని నీ ప్రకారం బ్రహ్మ గోచరమయితే జడము, అంటే బ్రహ్మ కాదు మరెలా?
బ్రహ్మకున్న అవిద్య అసలు జ్ఞానం వలన పోతుందా

**నేను**: పోవాలి మరి
అమ్మ: బ్రహ్మ జ్ఞానవిషయం, అవిద్య అసలు జ్ఞానం వలన పోయిందని ఎలా చెబుతావు, అది గోచరమైతే, అప్పుడు మొదటికే మోసం. అలా గోచరమైతే బ్రహ్మ బ్రహ్మ కాదు.
అవిద్యకు ముందు ఏమిటి ఉంది

**నేను**: అవిద్యకు ముందు ఏమీ లేదు

**అమ్మ**: నువ్వు అవిద్యను అనుమాన ప్రమాణంతో ఋజువు చేస్తానంటున్నావు. ఏదైనా అనుమాన ప్రమాణం తో ఋజువు అవుతుందంటే దానికి తర్కం, కారణం ఉంది. అంటే దానికి పుట్టుక ఉంది. అంటే అవిద్యకు

ముందు అవిద్య లేదు. అవిద్య అనాది కాదు. అంతేకాదు అవిద్య నాశనమవుతుంది కనుక అనాది కావడానికవకాశము లేదు.
ఇంతకీ ఈ అవిద్య ఎలా నశిస్తోంది?

**నేను**: వాక్యార్థ జ్ఞానము వలన

**అమ్మ**: అవిద్య positive item అంటున్నావు కదా. ఏదయినా positive item నశించడం ఎలా? యోగ శక్తి వలననో మరొక శక్తి వలననో అది రూపాంతరం చెందవచ్చును, లేదా కొంత శక్తి రూపాన్ని పొందవచ్చును. కాని జ్ఞానము వలన నాశనం అయిపోవడం అసంభవం కదా.
భావరూపమైన అజ్ఞానం మరొక జ్ఞానం వలన నశించదు. ఒక కుండ ను ఊయి పెట్టి కొడితే పగుల వచ్చును. కుండ గురించి తెలుసుకుంటే అది నాశనమెలా అవుతుంది.

**నేను**: పాము, లేదా దాని వలన కలిగిన భయము అది పాము కాదు త్రాడు అని చెప్పడం వలన పోయింది కదా.

**అమ్మ**: అలా చెప్పడం వలన కాదు, ఆ పాము తరువాత కనబడక పోతేనే అంటే దాని దగ్గరకు వెళ్ళి చూడడం వలననో, దీపం వెలిగించు కోవడం వలననో అలా ఏదో చేయడం వలన ఆ పాము కనబడక త్రాడు కనబడడం అయితే అప్పుడు భయం పోతుంది. అందు వలన ఎవరివలననో విన్న జ్ఞానం చేత కాదు భయం పోవడం. అంటే ఆభయానికి కారణం పోయిన తరువాత ఆ భయం పోతుంది. అందు చేత అవిద్య నువ్వు positive item అంటే అది జ్ఞానం వలన నాశనం అవదు.

**నేను**: ప్రపంచం అంతా మిథ్య కదా, ఈ భ్రమకు కారణం ఉండాలి కదా. అంటే అవిద్య లేకుంటే ఎలా?

**అమ్మ**: ఈ ప్రపంచం అంతా మిథ్య అని ఎలా చెబుతావు?

**నేను**: జరిగే ఒక కార్యానికి, దానికి కారణానికి సారూప్యత, అదే, ఒకలాంటివి కావాలి కదా! ఉదాహరణకు మట్టి నుండి కుండ వచ్చినదంటే మట్టీ, కుండా ఒక్క లాంటివే కదా. అలాగే ఈ కనబడుతున్న ప్రపంచం అంతా మిథ్య అయినప్పుడు దానికి ఒక మిథ్య అంటే అసత్పదార్థము అదే అవిద్య కారణమవాలి. ఈ ప్రపంచం అంతా మిథ్య అని శబ్ద ప్రమాణం నిస్సంకోచంగా ఘోషిస్తోంది. అందుచేత మిథ్య అయిన ప్రపంచానికి కారణంగా మిథ్యాభూతమైన అవిద్య భాసించాలి కదా!

**అమ్మ**: ఈ ప్రపంచమంతా మిథ్య అని దానికి కారణంగా మరొక మిథ్యాభూతమైన అవిద్య భాసిస్తుందని ఏ శబ్ద ప్రమాణం ఘోషించలేదు. తరువాత మిథ్య నుండి మిథ్య వస్తుంది అనేది కుదరదని వివరిస్తాను. ఒక వస్తువును ముందు తప్పుగా తెలుసుకొని తరువాత ఆ తప్పు తెలుసుకున్నంత మాత్రాన మిథ్య, అవిద్య అనుకుంటూ గాభరా పడనక్కరలేదు. ఇలాగే భ్రాంతి స్థలంలో ఒక వస్తువు వేరొక దానిలా తోచడాన్ని వేరు వేరు దర్శన కారులు వేరువేరుగా భావించి గాభరా పడిన వారే. కాని అసలు జ్ఞానమంతా కూడా యథార్థమే.

**నేను**: వేరు వేరు దర్శనాల వాళ్ళు వేరు వేరు గా అర్థం చేసుకున్నారన్నావు. అవేవో కొంచెం చెప్పు

**అమ్మ**: నువ్వు చెప్పే త్రాడు, పాము ఉదాహరణము తీసుకొనే ఎవళ్ళెవళ్ళు ఎలా అర్థం చేసుకున్నారో చూద్దాం. వీటిని ఖ్యాతులంటారు. ఖ్యాతి అంటే భ్రాంతి జ్ఞానం, erroneous perception అనుకో.
యోగాచారులు అనే బౌద్ధులు పాము, త్రాడు కనబడడానికి కారణం మనలో ఉండే జ్ఞానమే, అదే ఆత్మే అంటారు. వీరిది ఆత్మ ఖ్యాతి.
ఆ బౌద్ధులలోనే శూన్యవాదులు అంతా అసత్ అని అంటారు. అది అసత్ఖ్యాతి.
మీమాంసకులు త్రాడు జ్ఞానం, పాము జ్ఞానం రెండూ యథార్థమే అంటారు. పాము లక్షణాలు గుర్తించక త్రాడని త్రాడు లక్షణాలు గుర్తించక పామని అనుకుంటామని అనే వీరిది అఖ్యాతి.
అలా కాకుండా త్రాడు బదులుగా పామును తెలుసుకుంటున్నాము కాబట్టి తార్కికులు అన్యథా ఖ్యాతి అని అంటారు.
మీ స్వామీజీ వాళ్ళూ అదే శాంకరాద్వైతులు అనిర్వచనీయ ఖ్యాతి అంటారు, త్రాడు మీద కనబడుతున్న పాము సత్ యో అసత్ యో నిర్వచించలేమని అంటున్నావు కదా, అందువలన. జ్ఞానాలన్నీ యథార్థాలే అని చెప్పే రామానుజీయులది యథార్థ ఖ్యాతి.

**నేను**: త్రాడూ, పామూ రెండూ లేవన్న వారిని, రెండూ గుర్తించలేమన్న వారినీ వదలేయి. అసంబద్ధమైన వాదాలు, అవి. అన్యథా ఖ్యాతిని తీసుకో. పాము ధర్మాలకు, త్రాడు ధర్మాలకు తేడా తెలియక పోవడమేగా అన్యథా ఖ్యాతి అంటే. అందుకే త్రాడును బదులుగా పామనుకుంటున్నామని కదా! ఇదెలా కుదురుతుంది. ఇంక, పాములా ఉన్న వస్తువు త్రాడు జాతికి చెందదు కదా, త్రాడును పాము అనుకోవడానికి, అన్యథా ఖ్యాతి ప్రకారం . ఇదీ కుదరదు.
ఒకచోట ఉన్న వస్తువు మరొక చోట ఉన్నట్లు భాసిస్తే అన్యథా ఖ్యాతి అనవచ్చును. ఇదీ కుదరదు. కొమ్ములు విరిగిన ఆవు లో ఉండే ఆవు లక్షణాలు కొమ్ములు లేని ఆవులో ఉంటే, అంటే రెండింటిలోనూ గోత్వముండడం వాస్తవమే కదా. భ్రమ కాదే!

అలా కాకుండా ఒకచోటనే ఉన్నది మరొకచోట నున్నట్లు భాసించడం అన్యథా ఖ్యాతి అంటే మందు వలననో మంత్రం వలననో పాము కరవకపోతే అక్కడ పామే లేదని అనలేము కదా!
పాముకి, త్రాడుకి కొన్ని సామాన్య అసాధారణ ధర్మాలుండడం వలన అవే సన్నగా, పొడుగ్గా ఉండడం లాంటివి, త్రాడుని పామనుకోవచ్చు. కాని ఆ పాము కదలదు, కరవదు అని తెలిసినప్పుడు ఆ భ్రమ ఉండదు కదా. అలాంటప్పుడు త్రాడు మీద కనపడింది, పాము కాదు పాము లాంటిది. పాము జాతిదేదో అనుకో. అందుచేత అన్యథా ఖ్యాతి ఎలా చూసినా పని చేయదు.

**అమ్మ**: ఆ జాతి సత్యమా, కాదా

**నేను**: సత్యమే,

**అమ్మ**: సత్యం అయిన జాతి అసత్యం అయిన వస్తువులను ఆశ్రయించి ఉంటుందా!

**నేను**: పోనీ జాతిని అసత్యమే అంటే

**అమ్మ**: అసత్యమైన జాతిలో సత్యమైన త్రాడుకు సంబంధము ఎలా చెబుతావు.

**నేను**: అందుకే కదమ్మా సత్ కాక అసత్ కాక అనిర్వచనీయమైనది అని ఆ పామును చెబుతున్నాము

**అమ్మ**: అంటే అదొక కొత్త ఆకారంతో ఉంటుందా! అదేమీ కాదు. జ్ఞానమంతా యథార్థమే. శ్రుతులన్నీ యథార్థ ఖ్యాతినే ధృవీకరిస్తాయి. "బహుస్యామ్ ప్రజాయేయ" అని పరమాత్మ సంకల్పించిన తరువాత జరిగిన త్రివృత్కరణమో, పంచీకరణమో, అంటే పంచ భూతాలూ కలసి తయారయిన ఈ పదార్థాలన్నీ. దాని వలన కొన్ని మూలకాలు కొన్ని పదార్థాలలో సామాన్యముగా ఉండడం వలన ఈ పదార్థాలలో పోలికలూ, ఈ భ్రమ జ్ఞానాలూ. అందు వలన జ్ఞానాలన్నీ యథార్థాలు. మనకు ఏదయినా ఒక రకంగా తోచిందీ, లేదా కనపడిందీ అంటే అది యథార్థమైనదే. అది, సత్ కాదు, అసత్ కాదు అనుకుంటూ గాభరా పడనక్కరలేదు.

**నేను**: చంద్రుడిని కంటితో చూస్తున్నప్పుడు కంటిని నొక్కడం వలన ఇద్దరు చంద్రులను చూడవచ్చును. అంటే ఇద్దరు చంద్రుళ్ళు సత్యాలేనా.

**అమ్మ**: ఇద్దరు చంద్రులు కన్ను నొక్కినప్పుడు ఎందుకు కనబడుతున్నారో ఆలోచించు. చంద్రుడి ప్రతిబింబము కంటిలో ఏర్పడి దానిని మన బుద్ధి గుర్తించడం వలన కదా మనకు చంద్రుడు కనబడేది, కాని

కన్ను చేతితో నొక్కినప్పుడు కంటిలో ప్రతిబింబము ఏర్పడడానికి సహకరించే (ద్రవ) పదార్థము భాగింపబడి రెండు ప్రతిబింబాలు ఏర్పడడానికి దోహద మవుతుంది, అప్పుడు మనం ఇద్దరు చంద్రులను చూస్తాము.ఈ విధానమంతా యథార్థమే కదా.

**నేను**: మఱి ముత్యపు చిప్ప వెండిలా కనబడడం?

**అమ్మ**: ఇందాకా అనుకున్నట్లు ఈ పదార్థాలన్నీ పాంచ భౌతికాలు అవడంవలన, ఒక పదార్థపు కొన్ని లక్షణాలు మఱియొక పదార్థానికి ఉండవచ్చును. ముత్యపు చిప్ప, వెండి ఉదాహరణంలో వెండి లక్షణాలు అవే తెల్లగా ఉండడం, మెరవడం లాంటివి ముత్యపుచిప్పలో ఉంటాయి. మనము ఆ లక్షణాలు మాత్రమే గుర్తించి నప్పుడు మనకు ముత్యపు చిప్ప వెండిలా గోచరిస్తుంది. అల్పముగా నున్న రజతత్వ భావమును మాత్రమే మనం ముత్యపుచిప్పలో గ్రహిస్తున్నామన్నమాట. అలాకాకుండా తరువాత పెళుసుతనము, గట్టి తనము లాంటి లక్షణాలు గ్రహిస్తే అది వెండి కాదు ముత్యపు చిప్ప అని తెలుస్తుంది. పాము, త్రాడు విషయంలో కూడా జరిగేది ఇదే. అందుచేత సజాతీయ అంశములు మాత్రమే గ్రహింపబడడం విజాతీయ అంశములు గ్రహింప బడక పోవడం వలన కలిగే ఇలాంటి పరిస్థితి ని యథార్థ ఖ్యాతి అనడానికి ఆక్షేపం లేదు. ఎందుకంటే ఇలా జరుగుతోంది కదా.

**నేను:** మఱి కలలో కనపడే పదార్థాల విషయంలో.

**అమ్మ:** మనము ఇంతకుముందు అనుకున్నట్లు మనకు కలిగే కలలు యథార్థాలే. మనము మాత్రమే అనుభవించవలసిన కర్మ ఫలాలను పరమాత్మ కలల ద్వారా అనుభవింప చేస్తాడు. "న తత్ర రథా రథయోగా న పంథానః భవంతి, ....అథ వేశాన్తాన్ పుష్కరిణ్యః స్రవన్త్యః భవన్తి, స హి కర్తా" అని బృహదారణ్యకోపనిషత్తు "ఆ కలలో కనబడు రథములు గాని, ....ఆ గృహాదులను పరమాత్మయే సృష్టించును. ఆయన సర్వ సృష్టి కర్త కదా" అని ఆ పరమాత్మ కలలో పదార్థాలను సృష్టిస్తాడని స్పష్టంగా చెప్పింది కదా! అందువలన కలలో పదార్థాలు కూడా యథార్థాలే.

**నేను:** పచ్చ కామెర్లు వంటి దృష్టి దోషము వచ్చిన వాడికి తెల్లని శంఖము కూడా పచ్చగా కనబడుతుంది. దానికేం చెప్తావు.

**అమ్మ** : శంఖాదుల నుండి వచ్చిన కిరణాలు కంటిలో పిత్తద్రవ్యంతో కలవడంవలన అలా పచ్చగా కనబడుతోంది కదా. అందుచేత కిరణములతో బాటు ఈ సూక్ష్మ పీత ద్రవ్యము గ్రహించడం వలన కలిగే ఈ దృష్టి జ్ఞానము ఆ సందర్భములో సహజమే!

**నేను:** స్ఫటికము జపా పుష్పము వంటి ఎఱ్ఱని పూవు దగ్గర పెడితే ఎఱ్ఱగా కనబడుతుంది కదా!

**అమ్మ:** స్ఫటికము మాత్రమే ఎఱ్ఱగా కనబడుతుంది. అక్కడొక జాయి పెట్టేవనుకో. ఎఱ్ఱగా కనబడదు కదా! స్ఫటికము యొక్క ప్రతి ఫలించే గుణము వలన జపాపుష్పము రంగు ఆ స్ఫటికంలో కనబడుతోంది. దీనిలో భ్రమ, భ్రాంతి ఏమిటుంది, ప్రకృతి సహజమైన విషయమే కదా!

**నేను:** ఎండమావి లో నీళ్ళు లేని చోట నీళ్ళు ఉన్నట్లు తోస్తుంది. ఇదీ భ్రమ కాదా.

**అమ్మ:** ఇంతకు ముందు అను కున్నట్లు పదార్థాలన్నీ పాంచభౌతికాలవడం వలన ఒక పదార్థములో మఱియొక పదార్థపు లక్షణాలు కనిపిస్తాయి. కాంతి కిరణ ప్రసారములలో జరిగే తేడాల వలన ఇలా జరుగుతుంది. ఇదీ సహజమే. ఎందుకంటే అలాంటి పరిస్థితి వచ్చినప్పుడు ఎండమావి ఎడారిలోనే కాదు, మన ఊరిలోనూ చూస్తాము.

**నేను:** కొఱివి కర్ర వేగంగా తిప్పి నప్పుడో, అదొక నిప్పు చక్రంలా కనబడుతుంది కదా!

**అమ్మ:** ఇది కూడా మనం ఇంతకు ముందు చెప్పుకున్నాము.
కొఱివి కర్ర వేగంగా స్థాన భ్రంశము చెందుతున్నప్పుడు అదే తిరుగుతున్నప్పుడు, ఆ వేగం మన కన్ను గ్రహించ లేక పోతే అలా నిప్పు చక్రం లా కనబడుతుంది. ఇదీ ప్రకృతిలో సహజమే!

**నేను:** అద్దంలో ప్రతిబింబమో!

**అమ్మ:** కాంతి కిరణాల పరావర్తనమనే ధర్మం వలన అద్దము పై పడిన కిరణాలు పరావర్తనం చెంది, మన కంటిని చేరి అద్దములో మన ముఖమున్నట్లు కనిపిస్తుంది. మన ముఖము, అద్దము రెండూ ఉన్నాయి కదా నిజంగా వేరు వేరుగానే. అందుచేత దీనిలో అయథార్థత లేదు.

**నేను:** నువ్వు నాగపూరు లో ఉంటే హైదరాబాదును దక్షిణంగా ఉన్నదంటావు. బెంగుళూరులో ఉంటే అదే హైదరాబాదు ఉత్తరదిక్కుగా ఉంటుంది. అసలు అనంతాకాశము లో ఒక్కటే దిక్కు అని అనుకోవచ్చా. ఈ దిక్కుల సంగతి ఏమిటి!

**అమ్మ:** శ్రుతి "నాభ్యాత్ ఆసీత్ అంతరిక్షమ్, .....దిశః శ్రోత్రాత్ " అని ఆకాశానికి, దిక్కులకు వేర్వేరు ఉత్పత్తి స్థానాలను చెప్పింది కదా! అంతే కాదు దిశః అని బహు వచనం వలన దిక్కు ఒక్కటి కాదు అని కూడా తెలుస్తోంది. అయితే ఒక దిక్కును వేఱొక దిక్కుగా గ్రహించడం కూడా యథార్థ ఖ్యాతియే, ఎందు కంటే ఇట్టి వ్యవహార భేదము దానికి కారణాలైన పదార్ధ సాపేక్షత వలన వచ్చినది.
నువ్విలా ఎన్ని ఉదాహరణలు చూపించినా ఆ పదార్థాలన్నీ యథార్థాలేనని నిరూపించవచ్చు. పరమాత్మ సృష్టిలో ఏ పదార్థమూ యథార్థమే కాని మిథ్యా పదార్థములు కావు.

**నేను:** అవిద్య ఉందని చెప్పడానికి నేను చెబుతున్న ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలు నువ్వు ఒప్పుకోవడం లేదు. కాని, ఎన్నో శబ్ద ప్రమాణాలున్నాయి కదా! వాటికేం చెబుతావు

**అమ్మ:** ఏమిటవి?

**నేను:** తైత్తిరీయ బ్రాహ్మణం లో "నాసదాసీత్ నోసదాసీత్ తమ ఆసీత్ తమసా గూఢమగ్రే ప్రకేతమ్ అని ఉందట. అంటే " సృష్టికి ముందు సత్, అసత్ లేవు, తమస్సు ఉండి జ్ఞానం దానిచే కప్పబడి ఉంది. " అని. తమస్సంటే అవిద్య అన్నమాట.

**అమ్మ:** అలాకాదు దాని అర్థం. ప్రళయ సమయంలో "అవ్యక్తమ్ అక్షరమ్ లీయతే అక్షరమ్ తమసి లీయతే తమః పరేదేవే ఏకీ భవతి" అని చెబుతూ ఉన్న సందర్భం లోది. అంటే అవ్యక్తమ్ అక్షరం లోనూ, అక్షరం తమస్సు లోనూ  తమస్సు పరమాత్మ లోనూ లీనమవుతుంది అని. అప్పుడు సత్ అంటే విడి విడిగా నున్న అదే వ్యష్టి రూపంలో నున్న ఆత్మలు, అసత్ అంటే వ్యష్టి రూపంలో నున్న అచిత్పదార్థములు. ప్రళయ సమయంలో ఇవన్నీ చివరకు పరమాత్మలో లీనమవుతాయి అని అంతే తప్ప అవిద్య కప్పడం ప్రసక్తే లేదు దీనిలో.

**నేను:** జ్యోతీంషి విష్ణుః భువనాని విష్ణుః వనాని విష్ణుః ...యదస్తి యన్నాస్తిచ సూర్య చంద్రులు, లోకాలు, ....ఇలా ఉన్నవీ లేనివీ కూడా బ్రహ్మమే అని కదా  విష్ణు పురాణం.
అలాగే "జ్ఞాన స్వరూపః భగవాన్ " అంటే జ్ఞానమే స్వరూపముగా కలవాడు, అంటే జ్ఞానము గుణమని కాదు.

"యదాతు శుద్ధం...జ్ఞానమపాస్త దోషమ్" అంటే అవిద్య అనే దోషము పోయి జ్ఞానము తన స్వాభావిక రూపంలోకి వస్తుంది. అని, అంటే అవిద్య ఉన్నదనే కదా!
"తస్మాత్ న విజ్ఞాన మృతేస్తి కించిత్ ..." అంటే విజ్ఞానం అదే బ్రహ్మ తప్ప మరే వస్తువులు లేవు అనీ "జ్ఞానమ్ యథా సత్యమ్ అసత్యమ్ అన్యత్" అని బ్రహ్మమొక్కటే సత్యము, మిగిలినదంతా లేనిదే అని ఇలా ఎన్నో ప్రమాణాలు మనకు కనబడుతున్నాయి.

**అమ్మ:** నువ్వన్న " జ్యోతీంషి "శ్లోకంలో యదస్తి యత్ నాస్తి అంటే ఆత్మలు, ప్రకృతి. అన్నింటా అంతర్యామిగా పరమాత్మ ఉన్నాడని దాని అర్థం.
"జ్ఞాన స్వరూపం..." అన్న చోట భగవంతుని సృష్టి సంకల్ప జ్ఞానము చేత సృష్టింపబడి ఆయననే అంతర్యామి గా జీవుళ్ళు కలిగి ఉంటారని అర్థము.
"యదాతు శుద్ధమ్" అన్న శ్లోకంలో పరమాత్మ చేత సృష్టించబడిన జీవుళ్ళ గురించి వర్ణిస్తున్నారు. ఆత్మలన్నీ జ్ఞాన రూపాలు అని చెప్పినంత మాత్రాన వాటికి వాటికి జ్ఞానము గుణము కాదని కాదు కదా! మనము అది జ్ఞాన స్వరూపము, జ్ఞానగుణకమూ కూడా అని ఇంతకుముందు చెప్పుకున్నాం కదా!
"తస్మాత్ న విజ్ఞాన అమృతేస్తి కించిత్" అన్న శ్లోకంలో ప్రకృతి మారుతూంటుంది కనుక అచిత్ పదార్థాన్ని ఎప్పుడూ ఒకచోట అస్తి అని చెప్పం అన్న విషయం చెప్పేరు.
అలాగే వివిధ కర్మలవలన వివిధ శరీరాలలో ప్రవేశిస్తున్నా తనకు అంటే ఆత్మకు మాత్రం ఈ వివిధ ఆకారాల తేడాలుండవన్న విషయం తెలిసి ఉంటాడు ప్రాజ్ఞుడు అని చెబుతుంది " విజ్ఞానమ్ ఏకమ్" అన్న శ్లోకము.

అస్తి, నాస్తి అని అంటే పై శ్లోకాలలో చిత్, అచిత్ పదార్థాలు, అంటే ఆత్మలు, ప్రకృతి. జగత్తంతా వాటితో నిండి ఉందనీ, వాటికి అంతర్యామి గా పరమాత్మ ఉన్నాడనీ పైశ్లోకాలలో అర్థం చేసుకోవాలి.

ఈ శ్లోకాలన్నీ విష్ణు పురాణంలో ఏ సందర్భంలో వచ్చేయో చూడు. మైత్రేయుడికి ఈ సృష్టి గురించి చెబుతున్న సందర్భంలో వచ్చిన శ్లోకాలు. మొత్తం అంతా చెప్పి అట్బే ఇదంతా ఉత్తుత్తిదే అంతా మిథ్యే అని ఎవరైనా వ్రాస్తారా. ఆ తరువాత శ్లోకాలలో " విష్ణ్వాధారమ్...." అంటే ఈ మూడు లోకాలూ విష్ణువు ఆధారంగా ఎలా ఉన్నాయో జ్ఞానం ప్రధానంగా ఎలా పరమార్థమో, అది చెప్పబడింది అని ఉంది. అంటే జ్ఞానం స్వాభావిక స్వరూపం అనీ అచిత్తు కర్మ నిమిత్తంగా మారుతూటుందనీ అర్థం. అందుచేత అవిద్య ను శబ్ద ప్రమాణం తో నిరూపించలేవు.

**నేను:** అంటే "తత్త్వమసి" లాంటి వాక్యార్థ జ్ఞానము వలన ఈ అవిద్య పోతుందని చెప్పేరే స్వామీజీ!

**అమ్మ:** మనము ఇంతకుముందు "తత్త్వమసి" అంటే అర్థం "పరమాత్మ నీ శరీరం లోపల అదే జీవుని లోపల ఉన్నాడు " అని తప్ప "జీవుడు, పరమాత్మ ఒక్కటే" అని అర్థం కాదన్న విషయం తెలుసుకున్నాం. దీని వలన అవిద్య పోవడం ఎలా కుదురుతుంది. అది సరే, నువ్వు చెప్పే భేద జ్ఞానాన్ని అదే అవిద్యను పోగొట్టిన తరువాత ఈ వాక్యార్థ నివర్తక జ్ఞానము ఎక్కడ ఉంటుంది. బ్రహ్మలో ఉంటుందంటావా! బ్రహ్మ ఒక జ్ఞానము నీ ప్రకారం, దానిలో మరొక జ్ఞానము ఉండ కూడదు కదా, ఉంటే రెండు జ్ఞానాలూ, అద్వైత భంగమూను.

**నేను:** అలా కాదమ్మా, కార్చిచ్చు అని చెప్పుకున్నాము కదా, కార్చిచ్చు అడవిని కాల్చేసి తానూ ఆరిపేయినట్లు ఈ నివర్తక  వాక్యార్థ జ్ఞానము అవిద్య ను నివర్తించిన తరువాత తానూ నాశనమైపోతుంది.

**అమ్మ:** కార్చిచ్చు నాశనం కాదు, ఆరి పోతుంది, దానికి కారణం గాలి, వాన లాంటివో, లేక మరి ఆ నిప్పు నిలబడడానికి తగిన ఇంధనం లేక పోవడమో అవుతుంది. నీ నివర్తక జ్ఞానము విషయం అలాకాదు. అయినా నిజమైనదవడం వలన కార్చిచ్చు అడవిని తగులబెట్టింది. కాని నీ విషయంలో ఆ నివర్తక జ్ఞానం అయథార్థము కదా! అది నిజమైన భ్రమ జ్ఞానాన్ని ఎలా నివర్తిస్తుంది. ఒక వేళ అయథార్థము కాదు, యథార్థమే అంటే అది మరెక్కడికీ పోదు. అప్పుడు మళ్ళీ అద్వైత భంగము.

**నేను:** అది మరొక దాని వలన పోతుందంటే

**అమ్మ:** అంటే మరొక జ్ఞానమా, దానిని పోగొట్ట డానికి మరొక జ్ఞానాన్ని తెచ్చుకోవాలి. ఇదొక అంతులేని కథ అయిపోదూ!
అయినా "తత్త్వ మసి" లాంటి వాక్యాల వలన మోక్షము వస్తుంది అని కాదు, శ్రుతులు చెప్పినది, "వేదాహమ్ ఏతమ్ పురుషమ్ మహాన్తమ్ ఆదిత్య వర్ణమ్ .....నాన్యః పంథా అయనాయ విద్యతే" అని పరమాత్మ ఆదిత్య వర్ణము లాంటి దివ్య గుణ విశేషములు గలవాడని, వానిని తెలుసుకొంటే మోక్షము సిద్ధిస్తుందని ఇలా అనేక శ్రుతులలో చెప్పింది. బ్రహ్మ గురించి శోధక వాక్యాలన్నీ ఆయన కళ్యాణ గుణ విశిష్టుడు అనీ హేయ ప్రత్యనీకుడనీ చెబుతాయి. అట్టి పరమాత్మ, అనేక దోషములతో పుణ్య, పాపకర్మలను చేసి వాటి ఫలితములను అనుభవించడానికి పుట్టిన మనము ఎలా ఒక్కటి అవుతాము.

**నేను:** శోధక వాక్యాలంటే

**అమ్మ:** ఏదయినా ఒక పదార్థము నిర్వచించడానికి, వర్ణించడానికి రెండు రకాలుగా వాడుతూంటాము

ఒకరకాన్ని స్వరూప నిరూపక  ధర్మాలంటారు. గంగడోలు ఉన్నది అవు, తొండమున్నది ఏనుగు లాగ. వీటివలన ఆ వస్తువు ఏమిటో మనకు నిర్ధారణగా తెలుస్తుంది. రెండవ రకం నిరూపిత స్వరూప ధర్మాలు. అంటే ఆవుకు, నాలుగు కాళ్ళు, రెండు కళ్ళు, రెండు చెవులూ అవీ ఉంటాయి అంటే ఇలాంటి జంతువులు గుఱ్ఱమో, గాడిదో ఇలా మిగిలిన జంతువులు కూడా ఉండ వచ్చు. ఉదాహరణకు "సత్యమ్, జ్ఞానమ్, అనంతమ్ బ్రహ్మ" అన్నది పరమాత్మ స్వరూప నిరూపక ధర్మాలు చెప్పే శోధక వాక్యము. ఇలాంటి వాక్యాలన్నీ పరమాత్మ కళ్యాణ గుణ పూర్ణుడనీ...

**నేను:** ఇంతకు ముందు అనుకున్నట్లు అసత్యము కానిదీ....అంటూ దీనికి అర్థం చెప్పకూడదా.

**అమ్మ:** నేరుగా అర్థం తెలుస్తూంటే అలా వేఱుగా అర్థం చెప్పడం అందునా అన్ని పదాలకూ హాస్యాస్పదం అవుతుంది. అది సరే అసత్యం కానిది అన్నప్పుడు అసత్యం అంటే ఏమిటి చెబుతావు.

**నేను:** సత్యము కంటే భిన్నమైనది

**అమ్మ:** మీ ఇల్లు పెద్దనాన్న గారింటి పక్కన, పెద్దనాన్న గారిల్లు మీ ఇంటి పక్కన. బాగానే ఉంది, నీ నిర్వచనం. ఇలా ఎవ్వరూ ఒప్పుకోరు.

**నేను:** సత్యం అన్నప్పుడు సత్యమని కాకుండా సత్యమను గుణమున కాశ్రయమైనవాడు అని కదా నువ్వు చెబుతున్నావు. ఇదెలాగ.

**అమ్మ:** వ్యాకరణం ప్రకారం గుణ వాచకాలకు మత్ప్రత్యయము అక్కరలేదు. నల్లకుండ అని అంటున్నావు కదా నల్లదనము కల కుండ లేదా నల్లదనము ఆశ్రయముగా కల కుండ అని చెప్పనక్కరలేదు కదా. సత్యమ్....బ్రహ్మ అంటే సత్యత్వమునకు ఆశ్రయమైన బ్రహ్మ అనే అర్థము.

**నేను:** మఱి మూడు విశేషణాలకీనా, ఒకదానికొకటి విశేషణం కాదా

**అమ్మ:** ఈ విషయం కూడా ఇంతకు ముందు చెప్పుకున్నాం. నల్ల, పెద్ద, నున్నని కుండ అంటే తప్పేముంది, ఆ విశేషణాలన్నీ కుండకే కదా.

**నేను:** అంటే వాక్యార్థ జ్ఞానము అవిద్యని నివర్తించ లేదు అంటావు. మఱి అవిద్య నివృత్తి అవుతోంది కదా, మనకు బ్రహ్మ జ్ఞానము కలగ గానే ఈ సంసార బంధాలన్నీ పోతాయి కదా!

**అమ్మ**: సంసార బంధాలు పోవడం నువ్వనుకుంటున్న బ్రహ్మ జ్ఞానము వలన కాదు. ఇంతకీ ఈ బంధాలు యథార్థాలా, భ్రమా అంటే అయథార్థాలా

**నేను:** అయథార్థాలే

**అమ్మ**: అయథార్థాలయితే యథార్థమైన బ్రహ్మను ఎలా బంధిస్తాయి.

**నేను:** యథార్థాలంటే

**అమ్మ**: అలాగయితే అవి ఎన్నటికీ పోవు. అసలు బ్రహ్మతో బాటు మరొక యథార్థ పదార్థము ఉండడానికి అవకాశమూ లేదు. ఈ సంసార బంధాలన్నీ ఎలా వచ్చేయంటావు

**నేను:** పాత పుణ్య పాపాల వలన

**అమ్మ**: కదా, పాప పుణ్య రూపకర్మల వలన వచ్చిన బంధాలు ఆ కర్మానుభవము వలననే పోతాయి కాని, నువ్వు బ్రహ్మవి, నువ్వు సన్యాసివి అని ఎవడో చెప్పడం వలన పోవు. జ్ఞానం వలన ఒక పదార్థము గాని real entity గాని నాశనమవదని ఇంతకుముందు చెప్పుకున్నాము కదా

**నేను:** మఱి ..

**అమ్మ**: అసలు ఇంత మంది జీవుళ్ళు ఒకటి కాదనడానికి, ఒకటిగా అవరనడానికి ఈ పుణ్య, పాపకర్మలే నిదర్శనం. ఇవి ఒక్కొక్కళ్ళకూ ఒక్కొక్కలా ఉంటాయి. అందువలననే మనందరి జనన, మరణాలూ, మనం చేసే పనులూ, మన మన సత్త్వ, రజ, స్తమో గుణాలూ ఇవన్నీ వేరుగా ఉంటాయి. శ్రుతులు కూడా "నిత్యో నిత్యానామ్, చేతనశ్చేతనానామ్" అంటూ ఈ జీవుళ్ళందరూ అనేకాలు అని చెప్పింది. ఆ అందరూ మొత్తం బంధాలు నాశనమయిపోయి నాశనం ఎలా అయిపోతారు.
అంతేకాదు, ఈ బంధం పోగొట్టే జ్ఞానం మళ్ళీ ఎలా పోతుంది

**నేను:** తనంత తానే

**అమ్మ**: అది యథార్థమే అయితే ఉండక తప్పదు . కాకుంటే ఇందాకా అనుకున్నట్లు అవిద్యను నివర్తించ లేదు. అసలు ఈ బ్రహ్మ, జీవుడు ఒకటే అనే జ్ఞానాన్ని అసలు తెలుసుకునేదెవడు.

**నేను:** అలా తెలుసుకునే వాడు అధ్యాస రూపుడు. అంటే బ్రహ్మ మీద ప్రపంచం ఎలా ఆరోపించబడిందో అలాగే నేను అనే భావనతో ఆరోపించబడినవాడు.

**అమ్మ:** వాడెవడు. బ్రహ్మ తప్ప మరొక పదార్థము ఉండదు కదా! అలాంటప్పుడు ఒక జ్ఞానము, దానికొక కర్తా, ఇదెలా.

**నేను:** అదే బ్రహ్మ స్వరూపము నేను మిథ్య అని తెలుసుకోవడం అన్న మాట. అమ్మ: తెలుసుకుంటున్నాడు అంటే వాడు జ్ఞాత కావాలి. ఇది కుదరదుగా నీ ప్రకారము.

**నేను:** అదంతా భ్రాంతి జ్ఞానము వలననే కదమ్మా,

**అమ్మ:** ఇలా అవిద్య కలగడానికి మరొక భ్రాంతి జ్ఞానము, శభాష్, అదొక అంతులేని కథ.

**నేను:** అలా కాదు, జీవ బ్రహ్మలు ఒకటే అనే జ్ఞానంలోనే జ్ఞాత, జ్ఞాన స్వరూపం కూడా ఉంటారు. అవిద్య పోతే బ్రహ్మ ఒక్కడే.

**అమ్మ:** చిన్న తమ్ముడు తలుపు వెనక దాక్కొని నేను లేను అన్నట్లుంది నువ్వు చెప్పింది. నేను అందరినీ చంపేస్తాను అంటే ఆ అందరిలో నువ్వూ ఉంటావా, ఉండవా? నువ్వు కూడా నాశనమయిపోతే ఇంక సాధించేదేముంది, నేనంటూ లేనప్పుడు వచ్చే మోక్షము అదేమి మోక్షము, అదెవడికి కావాలి. అందుచేత ఈ అవిద్య నివృత్తి అనేది నీ అపోహ మాత్రమే.

**నేను:** కత్తితో అందరినీ చంపివేసిన తరువాత ఒకడు తనను తాను చంపుకోలేడంటావా?

**అమ్మ:**మనమనుకుంటున్న విషయంలో తనను తాను కత్తితో చంపుకున్న తరువాత ఆ కత్తి కూడా నాశనమవాలి, అంటే ఆ జీవుడికి తాను నాశనం చేసుకుందికి పనికివచ్చిన నివర్తక జ్ఞానం తానూ తరువాత నాశనమైపోవాలి. నువ్వెప్పుడైనా అలా ఊహించనైనా ఊహించగలవా. అయినా ఇంతకుముందు చెప్పుకున్నట్లు తన నాశనమే మోక్షము అంటే, సాధనా చతుష్టయము మాట పక్కనుంచు, అలాంటి మోక్షం దరిదాపులకు వాసన చూడడానికైనా ఎవడైనా వస్తాడంటావా? అలా తనను తాను నాశనం చేసుకొనేది మోక్షమూ కాదు, దానికుపకరించి తరువాత తనకు తానుగా నాశనమయిపోయే నివర్తకజ్ఞానమూ ఉండదు, అలా ఎవడో చెప్పినంత మాత్రాన నాశనమయిపోయే అవిద్య అనే అసంబద్ధమైన జ్ఞానమూ ఉండదు. అలా ఏ శ్రుతులూ, శాస్త్రాలు చెప్పనూలేదు.

**నేను:** వోసే శాస్త్రాలు పరమాత్మ తప్ప మిగిలినదంతా మిథ్య అనీ ఆ పరమాత్మ కూడా నిర్విశేషమైనదనీ చెప్పేయని ఒప్పుకుంటావా.

**అమ్మ:** మనము ఇంతకుముందు ఛాందోగ్యోపనిషత్ లో "సద్విద్యా ప్రకరణంలో "సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్ ఏకమేవ అద్వితీయమ్" అంటే అర్థము బ్రహ్మ ఒక్కడే ఉన్నాడు, మరేమీ లేవు, ఆబ్రహ్మ విశేషాలు ఏమీ లేకుండా నిర్విశేషమై ఉంటాడని అర్థం కాదని చెప్పుకున్నాం. అలాగే "సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ" అంటే అసత్యము కానిది అంటూ అపసవ్యమైన అర్థం చెప్పుకోకుండా సత్యగుణాశ్రయుడు, సత్యస్వభావుడు పరమాత్మ అంటూ పరమాత్మ జ్ఞానాదుల కాశ్రయమైనవాడు, జ్ఞానస్వరూపుడు కూడ అని తెలుసుకోవాలనుకున్నాము. ఇంతేకాకుండా సగుణ శ్రుతులు, ఘటక శ్రుతులతో బాటు నిర్గుణ శ్రుతులను కూడ సమన్వయం చేసుకొని పరమాత్మ కళ్యాణ గుణాత్మకుడు, హేయగుణ ప్రత్యనీకుడు అని అర్థం చేసుకోవాలని కూడా అనుకున్నాం.

**నేను:** మఱి స్వామీజీ అపచ్ఛేద న్యాయం ప్రకారం నిర్గుణ శ్రుతులే పరిగణించాలన్నారు కదా.

**అమ్మ:** దీనిగురించి ఇంతకుముందు అనుకున్నాం. ఇంతకూ అపచ్ఛేద న్యాయం అంటే ఏమిటి!

**నేను:** శ్రుతులలో ఒకే విషయాన్ని ఱెండు చోట్ల వేఱ్వేఱు గా చెప్పినప్పుడు తరువాత చెప్పినదానిని పరిగణించి ముందు చెప్పిన దానిని పరిహరించాలి. అంటే తరువాత చెప్పింది ముందు చెప్పినదానిని supercede చేస్తుందన్నమాట.

**అమ్మ:** యజ్ఞంలో యజమాని, ఋత్విక్కులూ పరస్పర సంబంధంతో అగ్నిహోత్ర ప్రదక్షిణ చేయాలి. ఆ సంబంధం తప్పి పోతే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. ఈ సంబంధం తప్పిపోడాన్ని అపచ్ఛేదమని అంటారు. ఈ ప్రాయశ్చిత్తాలు కూడా ఉద్గాతకు అపచ్ఛేదమైతే ఒకలా, మరొకరికి అపచ్ఛేదమైతే మరొకలా ఉంటాయి. యాదృచ్ఛికంగా ఇద్దరికి  అపచ్ఛేదమైతే తరువాత అంటే ఱెండవ అపచ్ఛేదానికి ప్రాయశ్చిత్తము చేయాలి అన్నది అపచ్ఛేదన్యాయము. ఇక్కడ యాదృచ్ఛికంగా జరిగినప్పుడు ఈ న్యాయము వర్తిస్తుంది. కాని నియతముగా అంటే బుద్ధి పూర్వకంగా చేసిన వాటికి అపచ్ఛేద న్యాయము వర్తించదు. నేను ఒకరిని బుద్ధి పూర్వకముగా చంపేసి, తరువాత వారి ఇంటిలో ఒక రూపాయి దొంగతనం చేసెననుకో. అపచ్ఛేద న్యాయం ప్రకారం నాకు చంపడానికి శిక్ష పడకుండా రూపాయి దొంగలించినందుకు మాత్రమే శిక్ష పడాలి. కాని అలా కాదు కదా. అలాంటి చోట్ల అనుసరించడానికి వేఱ్వేఱు న్యాయాలు అదే విధానాలు ఉన్నాయి. సగుణ, నిర్గుణ

శ్రుతులు యాదృచ్ఛికంగా వచ్చినవి కాదు. అవి రెండూ కూడా స్వరూప ప్రయుక్తాలే, తప్పని సరే. అందువలన నీ అపచ్ఛేద న్యాయము అక్కడ పని చేయదు. మవ దేశాన్ని ముస్లిములు పరి పాలించేరు అని ముందు అధ్యాయంలో ఉండి, తరువాత అధ్యాయంలో ఆంగ్లేయులు పరి పాలించేరు అని ఉంటే నీ ప్రకారం ముస్లిములు పరిపాలించేరు అన్న విషయం పరిహరించి ఆంగ్లేయులు పరిపాలించేరు అన్న విషయాన్ని మాత్రమే తీసుకోవాలి, అదెలా కుదుకుతుంది.  మీమాంసా శాస్త్రంలో బోలెడు న్యాయాలు చెప్పేరు. ఉపక్రమం, ఉపసంహారములకు విరోధం వస్తే ఉపక్రమం విషయమే తీసుకోవాలట. దీనిని ఉపక్రమాధికరణం అంటారు. దీని ప్రకారం సగుణ శ్రుతులనే తీసుకోవాలి.

విషయ ప్రాబల్యాన్ని బట్టి కూడా ఏ విషయం ప్రబలమో అంటే సమర్థనీయమో దానినే తీసుకొని దుర్బలమైన విషయం విడచి పెట్టాలని విరోధాధివకరణము చెబుతుంది. ఇక్కడ సాపేక్షమైన విషయం కంటే నిరపేక్షమైనది, సోపాధికమైనదానికంటే స్వతంత్ర ప్రతిపత్తి గలది ప్రబలమైనది అని గ్రహించాలి. అంటే నిప్పుంటే పొగ వస్తుంది అన్నప్పుడు ఆ ఇంధనం ఆర్ద్ర సహితమైనప్పుడే పొగ వస్తుంది అన్నావనుకో. అంటే మన ఇంటిలో gas పొయ్యి మంట నుండి పొగ రాదు. అంటే నిప్పు నుండి అన్ని సందర్భాలనుండీ పొగ రాదు. అంటే ఆ విషయం సోపాధికము, అటువంటి ఉపపత్తి బలహీనమైనది.  పరమాత్మ విషయంలో ఆయన గుణాలు స్వాభావికాలు, నిరుపాధికాలూను. అందువలన సగుణత్వమనేది ఆయన విషయంలో ప్రబలమైనది.

ఇలాగే సామాన్య, విశేష సందర్భాలలో సామాన్య విశేష న్యాయమని ఉంది. బస్సులో ఎక్కిన వాళ్ళు టిక్కెట్టు పూర్తి వెలకు తీసుకోవాలి. అన్నది సామాన్య నియమము. 65 ఏళ్ళు దాటిన వాళ్ళకు  సగము ఖరీదు మాత్రమే అన్నది విశేష నియమము. మనము ఆ రెండూ సమన్వయం చేసుకోవడం లేదూ. పరమాత్మ విషయంలోనూ నిరంజనః అంటే ప్రకృతి సంబంధ రహితుడని, నిర్గుణః అంటే త్రిగుణాతీతుడనీ సమన్వయం చేసుకొని చెప్పుకోవచ్చు.

ఇలా చెప్పుకుంటూ పోతే బోలెడన్ని న్యాయాలున్నాయి. నువ్వు చెప్పిన న్యాయం మాత్రం ఇక్కడ పని చేయదు. అసలు దాని అవసరమూ లేదు. సగుణ శ్రుతులతో బ్రహ్మ కళ్యాణ గుణాకరుడనీ, నిర్గుణ శ్రుతులతో బ్రహ్మ సత్త్వ, రజస్తమో గుణాతీతుడనీ హేయ గుణ ప్రత్యనీకుడనీ అంటే చెడు గుణాలకు ఎదిరి అవి ఆయన దగ్గరకు కూడా దరి చేరకుండా వాటికి విరోధి అయిన వాడని చక్కగా సమన్వయం చేసుకోవచ్చు. పరమాత్మ స్వయం ప్రకాశకమనీ, సత్యమ్ జ్ఞానమ్ అనంతమ్ అనీ చెబుతూ గుణాలేవీ లేవని ఎలాచెబుతావు. నిర్గుణమ్ అని వచ్చినప్పుడు ప్రాకృతికమైన సత్త్వ రజస్తమో గుణాలకతీతుడు, హేయ గుణములకు ప్రత్యనీకుడు అని అర్థం చెప్పుకోవాలి కాని. సర్వజ్ఞః అంటే అన్నీ తెలిసిన వాడు, సర్వవిత్ అంటే

వాటి వాటి స్వరూప స్వభావములు గుర్తించి నియమించువాడు, సత్యకామః, సత్యసంకల్పః, .....అపహత పాప్మా అంటూ శ్రుతి బ్రహ్మ సగుణత్వాన్నే నిర్వచిస్తుంది.

**నేను:** నువ్వు చెప్పినది సమంగా అర్థం కాలేదు.

**అమ్మ:** మరొకలా చెబుతాను విను. నువ్వు పుస్తకము ఉంటే పాఠము చదువ గలవు, పుస్తకము లేకపోతే

**నేను:** చదువ లేను

**అమ్మ:** అంటే నీవు చదవడం పుస్తకం మీద ఆధార పడి ఉంది. తాతగారికి పుస్తకం అక్కరలేదు ఆయన చదివేవాటికి వేటికయినా, అంటే పుస్తకం నీకొక ఉపాధి అంటే సాధనము. ఆ ఉపాధి పోతే నీకా చదవగలచిన గుణం ఉండదు. అలాగే నేను చిన్నప్పుడు బోలెడంత పని చేసేదాన్ని. ఇప్పుడు శక్తి తగ్గిపోయి చేయలేను. అలా కాకుండా పరమాత్మకు కళ్యాణగుణాలన్నీ స్వాభావిక మైనవి. అంటే ఆయనకు ఇలాంటి పరిమితులూ, ఉపాధులూ ఉండవన్న మాట. "స్వాభావికీ జ్ఞాన బలా క్రియాచ" అనికదా శ్రుతి. అంతేకాదు "నాన్యః హేతుః విద్యతే ఈశనాయ" అంటే బ్రహ్మ నియంతృత్వమునకు మరేమీ కారణము ఆధారము అక్కరలేదని కూడా శ్రుతి చెబుతుంది. అందువలన పరమాత్మ గుణాలు కల్పితాలు, సోపాధికాలు కాకపోడం వలన ఎప్పుడూ ఉంటాయి.

**నేను:** ఎన్ని గుణాలున్నాయంటావు పరమాత్మకు. "తేయే శతమ్ తేయే శతమ్" అంటారు, అంటే వందో ఎన్నోనా

**అమ్మ:** అక్కడ శతమ్ అంటే వంద అని కాదు, అసంఖ్యాకము అని. ఒక వేళ వంద అని తీసుకున్నా, అది అవధికి వర్తిస్తుంది తప్ప ఆయనకు కాదు. తైత్తిరీయోపనిషత్తు ఆయన యొక్క  ఆనందమనే ఒక్క గుణం వర్ణించడానికే ప్రయత్నించి ఆయురారోగ్య ఐశ్వర్యాలతో నున్న యువకుడి ఆనందాన్ని base గా తీసుకొని దానికి వందల, వందల రెట్లు అంటూ లెక్కించి యతో వాచో నివర్తంతే....మనసాపి సహ అని వాక్కుకీ మనస్సుకి అందనంత అని తేల్చింది

**నేను:** వాక్కుకీ, మనస్సుకీ అందనంత అంటే శూన్యమని కూడ అనుకోవచ్చా

**అమ్మ:** పరమాత్మవి అప్రాకృతికమైన దివ్యమైన కళ్యాణ గుణాలు. మన ఇంద్రియాలు, మనస్సు ప్రాకృతిక మైనవి. కనబడే ఏడు కిరణాల కటుపక్కా, ఇటుపక్కా ఉన్న ప్రకృతిలో రోజు చూస్తున్న కాంతి కిరణాలనే చూడలేము. పరమాత్మను ఎలా తెలుసుకుంటాము, ఆయన అనుకుంటే తప్ప

**నేను:** పోనే, ఉపాసనా స్థితిలో మాత్రము ఆయన సగుణుడు, ఉపాసనాతీత అనుభవ స్థితిలో అదే మోక్షస్థితిలో నిర్గుణుడు అనుకోవచ్చా. అప్పుడూ మనం సగుణ, నిర్గుణ వాక్యాలను సమన్వయం చేస్తున్నట్లే కదా!

**అమ్మ:** అంటే నీకు ఆకలి వేసి అప్పచ్చి కావలసినప్పుడు నేను గొప్పదాన్ని, తరువాత ఏమీ గుణాలు లేనిదానిని అనా. అమ్మ ఎప్పుడూ అలా ఉండదు నాన్నా. "అమ్మ తనము" అమ్మకు స్వాభావికమైనది. ఈ జగత్తులకంతా అమ్మా, నాన్నా...అన్నీ అయిన ఆయన కళ్యాణ గుణాలు కూడా ఇవ్వేళ ఉండి రేపు పోయేవి కావు. ఆయన స్వరూప, స్వభావాలలో అంతర్భాగమే. అయినా మోక్షం సమయంలో నిర్గుణుడైపోతాడని చెప్పడానికి శ్రుతి అలా చెప్పలేదు . "సోశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా" అని మోక్ష స్థితిలో ఆ జీవాత్మ బ్రహ్మను ఆయన గుణములతో కూడా అనుభవించి, ఆనందిస్తూంటాడు, అని. లేదా ఆ జీవాత్మ ఆ బ్రహ్మ గుణములను బ్రహ్మతో కూడా అనుభవించి ఆనందిస్తూంటాడు అని అర్థము. అందువలన మోక్ష దశలో కూడా బ్రహ్మ గుణాలతోటే ఉంటాడు, జీవాత్మ వాటిని అనుభవించడం, ఆనందించడం జరుగుతుంది. అయినా బ్రహ్మ గుణాలు లేని ముద్ద అయితే మరి ఆనందమూ, అనుభవమూ ఎక్కడిది. అంతేకాదు ఛాందోగ్యంలో దహరవిద్యోపాసన సందర్భంలో "దహరోస్మిన్ అంతరః ఆకాశః తస్మిన్ యదన్తః తదన్వేష్టుమ్" అంటూ బ్రహ్మయందున్న గుణాలతోటే ఉపాసించాలని చెప్పింది. అందుచేత బ్రహ్మ జీవుని ఉపాసనాస్థితి లోను, మోక్ష స్థితిలోను కూడా సగుణమే. నిర్గుణము కాదు.

**నేను:** "సోశ్నుతే సర్వాన్ కామాన్" అన్నప్పుడు కామాన్ అంటే కోరికలు కాదా!

**అమ్మ:** కామ్యన్త ఇతి కామాః అని వ్యుత్పత్తి. అంటే కోరదగినవి అనగా ఆయన గుణములన్న మాట. దివ్యములైన ఆయన కళ్యాణ గుణాలనే కదా మనం కోరుకునేది.

**నేను:** కామాన్ అంటే కోరికలు అని కూడా అర్థం ఉంది కదా, మఱి అలా ఎందుకనుకోకూడదూ?

**అమ్మ:** ఇందాకా అనుకున్న దహర విద్యలో బ్రహ్మని గుణాలతో ఉపాసించాలని చెప్పింది కద. మరొక General నియమం ఏమిటంటే "యథాక్రతుః అస్మిన్ లోకే పురుషో భవతి తథేతః ప్రేత్య భవతి" అంటే

జీవుడు ఈ లోకంలో ఎలా ఉపాసన చేస్తాడో చనిపోయిన తరువాత దానినే పొందుతాడు అని. అందువలన పరమాత్మ కళ్యాణగుణాలన్నీ ఈ లోకంలో ఉపాసించి, మోక్ష దశలో వాటిని అనుభవిస్తామన్నమాట.

**నేను:** "విజ్ఞాన ఘన ఏవ" అంటే బ్రహ్మ స్వరూపం అంటే బ్రహ్మ జ్ఞానమే అని కదా

**అమ్మ:** బ్రహ్మ జ్ఞాన స్వరూపం అయినా జ్ఞానగుణకుడు కూడా. ధర్మి జ్ఞానం, ధర్మభూత జ్ఞానం వివరాలు తెలుసుకున్నాం కదా. నువ్వు లోక దృష్టి తో చూస్తున్నావా, లేక శ్రుతి ప్రమాణము బట్టి చూస్తున్నావా అని ఆలోచించు. లోక దృష్టితో అంటే "నేను తెలుసు కుంటున్నాను", లేదా "బ్రహ్మకు అన్నీ తెలుసును" అని అన్నప్పుడు ధర్మభూత జ్ఞానాన్నే చెప్పుకోవాలి. లేదా శ్రుతి ప్రమాణం ప్రకారం చూస్తే నేను ఇంతకుముందు చెప్పినట్లు బ్రహ్మ స్వాభావిక జ్ఞాన, బలాది గుణాశ్రయమని ఒప్పుకోవాలి. అయినా ధర్మి జ్ఞానము, ధర్మ భూత జ్ఞానము రెండింటినీ అర్థం చేసుకుంటే నీకా సందేహం రాదు. "తదైక్షత" అన్నట్లు తన సంకల్పంతో లోకాలన్నీ సృష్టించిన వాడికి ఏ గుణం లేదని ఎలా అంటావు?

**నేను:** కేనోపనిషత్ లో "యస్యామతమ్ తస్య మతమ్ అవిజ్ఞాతమ్ విజానతామ్" అని ఉన్నదట. అంటే "ఎవరు బ్రహ్మను తెలుసుకొనుటకు సాధ్యం కాదని భావిస్తారో, వారే యథార్థం తెలిసిన వారు. ఎవరు తెలుసునని అనుకుంటారో వారికి బ్రహ్మ యథార్థం తెలియదు" అని. అంటే బ్రహ్మ ఇంకొకరికి గోచరమవదు అని కదా. అంటే నిర్గుణము అనే కదా. కాని మోక్షదశలో ఆయన గుణాలను అనుభవించడం ఎలా.

**అమ్మ:** తాతగారు వ్యాకరణ శిరోమణి కదా, ఆయనకు ఎంత జ్ఞానమున్నదో నీకు తెలుసునా!

**నేను:** పూర్తిగా తెలియదు

**అమ్మ:** అందుచేత ఆయనకు జ్ఞానము లేదని చెప్పగలవా!

**నేను:** లేదు. నాకు దాని గురించి పూర్తిగా తెలియదని మాత్రమే చెప్పగలను.

**అమ్మ:** అలాగే నువ్వు ఇక్కడా అక్కడా విన్న జ్ఞానంతో నాకు బ్రహ్మ సూత్రాలూ ఉపనిషత్తులు అన్నీ పూర్తిగా వచ్చేసునండీ అన్నావనుకో, ఎవళ్ళయినా ఏమిటంటారు, వీడికేమీ తెలియదు అని అనరూ. అలా కాకుండా నాకు పూర్తిగా వాటి గురించి తెలియదన్నావనుకో, వీడు పరవాలేదు, జ్ఞానం ఉన్నవాడే అని అంటారు. అలాగే నువ్వు చెప్పిన శ్రుతికి అర్థము "బ్రహ్మను పూర్తిగా తెలుసుకోవడం ఎవరికీ సాధ్యం కాదు, ఎందుకంటే ఆయన

కళ్యాణ గుణాలు అసంఖ్యాకాలు కదా! " అని. అయినా నువ్వు చెప్పిన శ్రుతిలోనే "మతమ్, విజానతామ్" అంటూ బ్రహ్మ తెలుసుకోబడడం ఉంది కదా, అంటే నువ్వు బ్రహ్మను తెలుసుకోలేము కనుక నిర్గుణము అని ఎలా చెబుతున్నావు. అసంఖ్యేయ కళ్యాణ గుణాకరుడైన బ్రహ్మను పూర్తిగా తెలుసుకోవడం కుదరదని మాత్రమే చెప్పాలి.

**నేను:** కాని బృహదారణ్యకోపనిషత్తు లో "నదృష్టేః ద్రష్టారమ్ నమతేః మన్తారమ్...." అని ఉందట. అంటే దృష్టి అదే జ్ఞానము కంటె (వేఱుగా) జ్ఞాత లేడు, మననము కంటే(వేఱుగా) మననం చేసేవాడు లేడు అని కదా. అంటే బ్రహ్మకు ద్రష్టత్వం, మంతృత్వం లేవని కదా

**అమ్మ:** అలాకాదు. కొంతమంది ఆత్మ జడపదార్థమనీ, చిత్పదార్థం కాదనీ, దేహేంద్రియాల వలన చైతన్యం వస్తుందనీ అంటారు. ఈ శ్రుతి ఆ ప్రతిపాదనను ఖండిస్తోంది. ఆత్మను జడముగా కాక జ్ఞాన స్వరూపుడుగా గుర్తించమని తెలియచేడానికే ఈ శ్రుతి. జ్ఞానం గుణంగా ఉన్న ఆత్మ జ్ఞాన స్వరూపుడే అని దీని అర్థం. అంటే ఇంతకుముందు అనుకున్నట్లు జ్ఞానాశ్రయుడు, జ్ఞాన గుణకుడూ కూడా అన్నమాట. అంతేకాక ఇంద్రియాలతో చూచేవాడు, అంతరింద్రియమైన మనస్సు తో మననం చేసేవాడూ అయిన జీవుని ఉపాసించవద్దు. అంటే ఆత్మోపాసన చేయరాదు, పరమాత్మోపాసనే చేయాలి అని కూడా దీని అర్థం.

**నేను:** ఆనందో బ్రహ్మ అంటేనో. బ్రహ్మ అంటే ఆనంద స్వరూపుడనే కదా. ఆనందము కలవాడు అనికాదు కదా!

**అమ్మ:** ఇంతకుముందు సత్యమ్ జ్ఞానమ్....అన్న శ్రుతికి చెప్పుకున్నట్లే ఇక్కడ కూడా ఆనంద స్వరూపుడు, ఆనందము గుణముగా కలవాడు అని అర్థము చెప్పుకోవాలి. లేక పోతే "ఆనందమ్ బ్రహ్మణః విద్వాన్" అనీ "ఏకః బ్రహ్మణః ఆనందః" అంటూ బ్రహ్మ యొక్క ఆనందము అని అంటూ కూడా చాలా శ్రుతులు ఉన్నాయి కదా.
వాటికి కూడా సమన్వయం కుదరద్దూ.

**నేను:** "యత్ర హి ద్వైతమ్ ఇవ భవతి తదితర ఇతరమ్ పశ్యతి యత్రత్వస్య సర్వమాత్మైవాభూత్ తత్కేన కం పశ్యేత్ కంవిజానీయాత్" ..... అంటే " ఎప్పుడు భేదమున్నట్లు కనబడుతుందో అప్పుడే ఒకడు మఱియొకనిని తెలుసుకొంటున్నాడు. ఎప్పుడు అంతా ఆత్మే అని తెలుసుకొంటే ఎవడు మఱియొకదానిని ఎలా తెలుసుకుంటాడు. " అని కదా అర్థం. అంటే ఈ భేదాలేమీ లేవనే కదా.

**అమ్మ:** బ్రహ్మ సృష్టి చేసి, దానికాశ్రయమై దానికంతర్యామి గా ఉంటాడని చెప్పిన శ్రుతి చివరకు ఆ జగత్తేమీ లేదని చెప్పదు కదా. అందు చేత దానకర్ధము ఆయనచే సృష్టింపబడనిదియు, వ్యాప్తమవనిదియు ఏమీ లేదని. "నేహ నానాస్తి " అన్నా ఇంతకుముందనుకున్నట్లు అంతా పరబ్రహ్మ వ్యాప్తమే, ఆయన లేనిది ఏమీ లేదు అని చెప్పడం.

**నేను:** "యదాహ్యేవైష ఏతస్మిన్ అంతరమ్ కురుతే అథ తస్య భయమ్ భవతి" అంటే "బ్రహ్మము నందు భేదముందనువానికి సంసార భయం కలుగుతుంది " అని కాదా అర్థం?

**అమ్మ:** "బ్రహ్మకు భిన్నంగా అదే దూరంగా, ఆయనను తెలుసుకొనక, ఉపాసించకుండా ఉంటే వారు భయం పొందుతారు" అని దీని అర్థం. అందుకే "తజ్జలాన్ శాంత ఉపాసీత" అని ఆ సృష్టి, స్థితి, లయ కారకుడై అంతర్యామిఅయిన పరబ్రహ్మమును శాంతుడై ఉపాసించాలి అని శ్రుతి చెబుతోంది. ఉపాసన అంటే ఉపాసన చేసేవాడు, చేయబడేది అని రెండు ఉండక తప్పదు కదా! సృష్టి చేసిన బ్రహ్మ, చేయబడిన జీవుడు ఒక్కటే అని చెప్పడం తప్పు. ఇంతకుముందు అనుకున్నట్లు " ద్వావిమౌ పురుషౌ లోకే" మొదలైన శ్రుతులు కూడా జీవ, బ్రహ్మలు వేఱు అనే విషయమే చెబుతాయి.

**నేను:** మనకు ప్రత్యక్షంగా తెలియనిది చెప్పడానికి శాస్త్రం కానీ, ప్రత్యక్షంగా గ్రహిస్తున్న ఈ భేద వాసన చెప్పడానికి శాస్త్రమెందుకమ్మా!

**అమ్మ:** ప్రత్యక్షం గా తెలిసింది గ్రహించడానకి మాత్రమే శాస్త్రం కాదు అంటే ఒప్పుకుంటాను. కాని ప్రత్యక్షంగా గ్రహించినదంతా చెత్త బుట్టలో వేయడానికి శాస్త్రం అన్నది సరికాదు. ఆపిల్ పండు నేల మీద పడడం ప్రత్యక్షంగా గోచరిస్తోంది. అది మిథ్య కాదు. కాని, ఎందుకు పడుతోందో, ఎంత వేగంతో పడుతోందో, ఎక్కడయినా అలాగే పడుతుందా, .....ఇలాంటి విషయాలు తెలుసుకోవాలంటే శాస్త్రం కావాలి. ఆ విషయాలు భౌతికాలయితే భౌతిక శాస్త్రం సరిపోవచ్చు. కాక అలౌకిక విషయాలయితే వేదాంత శాస్త్రం అవసరం పడుతుంది. మనకు శ్రుతులు కనపడుతున్న వస్తు భేదాన్నే కాదు, కనపడని తత్త్వ త్రయ భేదాలనూ నిర్వచించింది. దానికి మూలాలు చెప్పింది. ఆ పరమాత్మ అంతర్యామిత్వము నువ్వు ప్రత్యక్షంగా చూడలేవుకదా శాస్త్రాల ద్వారానే తెలుసుకోవాలి. అందుకే శాస్త్రాధ్యయనము.

**నేను:** కేవలం విధి వాక్యాలు అంటే శ్రోతవ్యః, మన్తవ్యః, నిదిధ్యాసితవ్యః ద్రష్టవ్యః ఉపాసీత అంటూ చెప్పే శ్రుతులు సామాన్యులకు, తత్త్వ ప్రతిపాదితాలైన శ్రుతులు నిర్గుణం, నిష్క్రియం లాంటి శ్రుతులు జ్ఞానులకు అని అంటారమ్మా!

**అమ్మ:** అది సరి కాదు. ఎందుకంటే "శ్రోతవ్యః మన్తవ్యః....ద్రష్టవ్యః" కదా, శ్రవణ మననాదులు చేయకుండా బ్రహ్మను తెలుసుకోలేము. అలాగే "క్షరమ్ ప్రధానమ్ ....క్షరాత్మానౌ ఈశతే దేవః ఏకః" అన్న వాక్యము చిదచిదీశ్వరులను తత్త్వ త్రయాన్ని నిర్వచిస్తుంది. దానివలన మనకు, ఈ విశ్వానికి ఈశ్వరుడు, అంటే నియమనం చేసేవాడు పరమాత్మ అని మనతో ఆయన సంబంధం తెలుస్తుంది, "తజ్జలాన్ శాంత ఉపాసీత" అని సృష్టి, స్థితి, లయ కారకుడైన బ్రహ్మను శాంత చిత్తుడై ఉపాసించాలి అనే విధి వాక్యము వలన ఆయన శాంత చితితులమై ఉపాసించాలని తెలుస్తుంది. మనకు ఆయనకు సంబంధం తెలియక పోతే మఱి ఉపాసన ఎందుకు చేయాలి. చేస్తే ఫలము ఏమిటి, అంటే "బ్రహ్మ విత్ బ్రహ్మైవ భవతి" అంటే బ్రహ్మ ను తెలుసుకొని బ్రహ్మ సాన్నిధ్యాన్ని, సాయుజ్యాన్ని పొందుతాం. అప్పుడు "సోశ్నుతే సర్వాన్ కామాన్ " అని ఆయన కళ్యాణ గుణాలను అనుభవిస్తాము. ఇలా శ్రుతి వాక్యాలు కలిపి చదువుకొని సమన్వయము చేసుకోవవలసినదే. అందులో కొన్ని విధి వాక్యాలు అక్కరలేదు అంటే కుదరదు.

**నేను:** మఱి భగవద్గీతలో "క్షేత్రజ్ఞమ్ చాపి మామ్ విద్ధి" అంటే ఆత్మ, పరమాత్మ ఒక్కటే అని కాదా!

**అమ్మ:** మనం ఇంతకుముందు అనుకున్నట్లు భగవద్గీత ఎన్నో చోట్ల అలా చెప్పలేదు. ఉదాహరణకు "యో మామజ మనాదిమ్ చ వేత్తి లోక మహేశ్వరమ్" అంటే ఎవరు నన్ను ఆది, పుట్టుక లేని వాడుగా జగన్నియమనం చేసేవాడిగా ఎరుగుదురో అన్నప్పుడు పరమాత్మ మనలను, ఈ లోకములను నియమిస్తున్నట్లే కదా,
"మత్స్థాని సర్వ భూతాని నచాహమ్ తేషు అవస్థితః" అంటే అన్ని భూతముల ఉనికి నాపై ఆధారపడి ఉంది అంతర్యామిని కనుక, కాని నేను వాటిపై ఆధారపడి లేను అనగా జీవులకు తాను ఆధారము అని కదా
"నచ మత్స్థాని భూతాని పశ్యమే యోగమైశ్వరమ్ భూత భృత్ నచ భూతస్థః మమాత్మా భూతభావనః" అంటే ఈ సమస్త జగత్తు ధరించి యున్నాను, ...వాటివలన నాకేమీ ఉపకారం లేదు,?వాటిమీద నేనాధారపడి లేను. అంటే ఈ విశ్వాలకు ఆయనే ఆధారం,
"అహమ్ కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయః తథా" అంటే ఈ సమస్త జగత్తుకూ నేనే ఉత్పత్తి స్థానాన్ని, ప్రళయ స్థానాన్ని కూడ
"మయి సర్వమిదమ్ ప్రోతమ్ సూత్రే మణి గణా ఇవ" ఈ సమస్త జగత్తూ దారంలో మణులలా నాయందు గుచ్చబడి యున్నది.

"ఉత్తమః పురుషః తు అన్యః పరమాత్మేతి ఉదాహృతః యః లోకత్రయమ్ ఆదిశ్య భిభర్తి అవ్యయః ఈశ్వరః" బద్ధుడు(ఈ లోకాలలో జీవుళ్ళు), ముక్తుడు (మోక్షము పొంది పరమపదము లోనువ్న జీవుళ్ళు) కాని పురషోత్తముడైన పరమాత్మ అందరిలో అంతర్యామిగా ప్రవేశించి పోషిస్తున్నాడు. నియమిస్తున్నాడు "యస్మాత్ క్షరమ్ అతీతోహమ్ అక్షరాదపి చ ఉత్తమః అతోస్మి లోకే వేదేద ప్రధితః పురుషోత్తమః " బద్ధ, ముక్త జీవులను దాటి ఉన్న వాడను కనుక నన్ను వేదంలో లోకంలో పురుషోత్తముడని పిలుస్తారు. అంటే ఆయన మిగిలిన జీవుళ్ళందరికీ అతీతుడై, వారి సంరక్షణ, నియమనాదులు చేసేవాడు

ఇలా ఎన్నోచోట్ల తన అంతర్యామిత్వము, ఈశ్వరత్వము కంఠరవేణా చెప్పుకున్నాడు పరమాత్మ భగవద్గీతలో. నువ్వు చెప్పిన క్షేత్రజ్ఞమ్ చ మామ్ విద్ధి అంటే మనం అర్ధం చేసుకోవలసినది పరమాత్మ అంతర్యామిత్వమే.అంటే నేను అన్నప్పుడు ఆత్మ ఈ శరీరంతో బాటు address అయినట్లు, జీవాత్మకు అంతర్యామి అయిన పరమాత్మ జీవాత్మతో బాటు address అవుతాడు కదా.